www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మెషిన్ లెర్నింగ్‌కు ఫిజిక్స్ నోబెల్

- జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు
- కృత్రిమ నాడీవ్యవస్థతో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణకు పట్టం

6

బుధవారం | 9-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 175 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ. 12.15 తదుపరి సప్తమి; నక్షత్రం: మూల తె. 5.15 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ. 12.30-2.10, తె. 3.34-5.15; దుర్ముహూర్తం: ఉ. 11.38-12.25; అమృతఘడియలు: రా. 10.33-12.13; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 5.53 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. కేంద్రం కూడా సహకరించడానికి సిద్ధంగా ఉంది. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి సమగ్ర ప్యాకేజీ అవసరం. పరిపాలన వైఫల్యం, కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల స్టీల్ ప్లాంట్ ఇబ్బందుల్లో పడింది. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక పరిష్కార విధానం. అయితే అందుకు సెయిల్, కేంద్రం ఒప్పుకోవాల్సి ఉంటుంది. సాధుకొండ, ఎర్రకొండ, గడ్చిరోలిలో ఐరన్ ఓర్ ఉంది. సెయిల్ మాదిరి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఐరన్ ఓర్‌ను కేటాయిస్తే ప్రధాన సమస్య పరిష్కారమవుతుంది.

జగన్ వెళుతూ.. వారసత్వంగా 85 లక్షల టన్నుల చెత్తను వ ఎగిల్చిపోయారు. కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేదు. ఏ మంత్రిత్వ శాఖకు వెళ్లి నిధులు అడిగినా యుటిలిటీ సర్టిఫికెట్లు(యూసీ) అడుగుతున్నారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి కుమారస్వామి

ఆంధ్రాకు అభయం

అన్ని విధాలా సహకారం అందిస్తాం.. బాబుకు మోదీ హామీ

- జగన్ హయాంలో అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం
- పూర్తిగా కోలుకునేందుకు కేంద్రం మద్దతు కావాలి
- స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు అన్నివిధాలా చర్యలు
- రెండేళ్లలో పోలవరం, భోగాపురం విమానాశ్రయం
- డిసెంబరు నుంచి రాజధాని పనులు వేగవంతం
- రెండోరోజు అమిత్ షా, నిర్మల, గడ్కరీ, పీయూష్, కుమారస్వామి, హర్దీప్‌సింగ్‌తో సీఎం చర్చలు
- మీడియాకు వివరాలు వెల్లడించిన చంద్రబాబు

న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాల వల్ల అతలాకుతలమైన ఏపీ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు కేంద్రం అన్ని విధాలా సహకరించాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏపీ ఆర్థికంగా పూర్తిగా కోలుకునేందుకు అవసరమైన మద్దతు అందిస్తానని ప్రధాని హామీ ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి

మిగతా 13వ పేజీలో...

ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్

- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతిని కలుపుతూ ఏర్పాటు
- దీనికోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్
- పూర్తి ప్రతిపాదనల తర్వాత ప్రకటన
- ఢిల్లీలో ఎంపీలకు వెల్లడించిన చంద్రబాబు

కమలం ఖుషీ

హరియాణాలో హ్యాట్రిక్ విజయం.. జమ్మూకశ్మీర్‌లో గణనీయంగా సీట్లు

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మూడోసారి విజయం

- హరియాణాలో 90 సీట్లకుగాను 48 స్థానాల్లో బీజేపీ గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్.. ఖాతా తెరవని ఆప్
- లెక్కింపులో తొలుత కాంగ్రెస్ జోరు.. తర్వాత పుంజుకున్న బీజేపీ
- కాంగ్రెస్ భస్మాసుర హస్తం.. కుమ్ములాటలతో గెలుపు దూరం
- హస్తంవైపు జాట్లు.. దాంతో బీజేపీవైపునకు జాటేతర వర్గాలు!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో ఒకింత నిరాశ చెందిన కమలనాథులకు.. హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి! ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మరీ హరియాణాలో హ్యాట్రిక్ విజయం సాధించిన బీజేపీ.. జమ్మూకశ్మీర్‌లో గతంలో కన్నా ఎక్కువ సీట్లు సాధించి సత్తా చాటింది! రెండు చోట్లా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి! హరియాణాలో కాంగ్రెస్‌దే విజయమని.. బీజేపీకి మళ్లీ అధికారం సుదూర స్వప్నమేనని.. జమ్మూకశ్మీర్‌లో హంగ్ తప్పదని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ.. హరియాణాలో బీజేపీ గెలుపు ఢంకా మోగిస్తే.. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి విజయనాదం చేసింది!! హరియాణాలో డకౌట్ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ.. అనూహ్యంగా కశ్మీర్‌లో ఒక్క స్థానంతో బోణీ కొట్టింది.

2



జమ్మూలో బీజేపీ నేతలు, కార్యకర్తల విజయోత్సాహం

కశ్మీరంలో అనూహ్యం

- హంగ్ అంచనాలన్నీ తలకిందులు
- ఎన్సీ-కాంగ్రెస్ కూటమికి పట్టం.. ఎన్సీకి 42 సీట్లు
- 6 స్థానాల్లో హస్తం.. 29 సీట్లతో బీజేపీ సత్తా
- కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా?
- హరియాణా సీఎంగా నాయబ్ కొనసాగింపు?
- అరంగేట్రంలో వినేశ్ ఫొగట్ ఉత్కంఠ విజయం

2

హరియాణా ఫలితాన్ని ఆమోదించం

ప్రజల ఆకాంక్షలకు భిన్నమైన ఫలితమిది: కాంగ్రెస్



ప్రయాణంలో తోడు నీడగా..

6

- హైవేలవెంట ఫుడ్ కోర్టులు, ట్రామా సెంటర్లు, ఫార్మసీలు, రిపేర్ షాపులు, ఏటీఎంలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్రం 'హమ్ సఫర్' పాలసీ
- ప్రారంభించిన నితిన్ గడ్కరీ
- సర్వీసు ప్రొవైడర్లకు ప్రత్యేక రిజిస్ట్రేషన్.. రేటింగ్ సదుపాయం
- లొకేషన్ కోసం 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్
- పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లను మూయొద్దని గడ్కరీ హెచ్చరిక



టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేశ్

పెట్టుబడులపై నేడు భారీ ప్రకటన!


- ముంబైలో టాటా సన్స్ ఛైర్మన్‌తో లోకేశ్ భేటీ
- హీరానందానీ డైరెక్టర్‌తోనూ

13

16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

40 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలి: మంత్రి

12



మార్కెట్ మాయతో ధరల మంట!

రైతు బజార్‌లో మంగళవారం సొరకాయ ధర ఒకటి రూ.18 నుంచి 20. రైతుకు గిట్టుబాటు ధరతోపాటు లాభం కూడా కలిపి మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన రేటు ఇది! మరి... ఇదే సొరకాయ బయటి దుకాణాల్లో ఎంతుండాలి? బయటి వ్యాపారి తన లాభం కూడా చూసుకుంటాడు కాబట్టి... ఐదు నుంచి పది రూపాయలు ఎక్కువ ఉండొచ్చు! కానీ... 40 నుంచి 50కి తగ్గలేదు! ఏమిటీ ధరల దందా? ఇందులో రైతుకు దక్కేదెంత? దళారులు దండుకున్నది ఎంత? ధరలను నియంత్రించాల్సిన మార్కెటింగ్ శాఖ ఏం చేస్తున్నట్లు?

మండు వేసవిలో, వరదల సమయంలో కూరగాయల ధరలు పెరగడం సహజం! పంటలు దెబ్బతిని, సరఫరా ఆగిపోవడమే దీనికి కారణం! ఆ తర్వాత మళ్లీ ధరలు దిగి వస్తాయి. కానీ... రాష్ట్రంలో నాలుగైదు నెలలుగా కూరగాయల ధరలు ఆకాశంలోనే ఉన్నాయి. కిందికి దిగి రావడమే లేదు.



- నాలుగైదు నెలలుగా కూర'గాయాలే'
- రైతు బజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్‌లో భారీగా వ్యత్యాసం
- పండించే రైతుకు దక్కేది మూడో వంతే
- దళారులు, వ్యాపారులకే 65 శాతం!
- నియంత్రణ వదిలేసిన మార్కెటింగ్ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎండాకాలం, వానాకాలం తేడాలేదు! ఇది... కూరగాయల ధరలు మండే కాలం! ఇవేం ధరలని ప్రశ్నిస్తే... భారీ వర్షాలు, వరదలు, కొన్ని చోట్ల అనావృష్టితో కూరగాయల సాగు తగ్గిందని, ఉత్పత్తి పడిపోయిందనే సమాధానాలు వస్తున్నాయి. నిజానికి... ఐదారు నెలలుగా ధరల బాదుడుతో వినియోగదారులకు తల బొప్పి కడుతూనే ఉంది. ఉల్లి, టమాటా, బంగాళాదుంప ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా... రైతులకు దక్కుతున్నది తక్కువ, దళారులు దండుకున్నదే ఎక్కువ. క్షేత్రస్థాయిలో వాస్తవ ధరలను పరిశీలిస్తూ... ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో కొందరు

మిగతా 12వ పేజీలో...

అనావృష్టి, అతి వృష్టికి కూరగాయల సాగు తగ్గి, ధరలు పెరగడం సహజమే. ఇప్పుడూ ఆ ప్రభావం ఉన్నప్పటికీ... మార్కెట్ మాయాజాలం వల్లే ధరలు అధికంగా మండుతున్నాయని తెలుస్తోంది.





ఘనంగా గోవిందుడి గరుడోత్సవం

- ఇష్ట వాహనంపై సర్వాంతర్యామి దర్శనం
- వజ్ర, స్వర్ణాభరణాలతో తేజోమూర్తిగా శ్రీవారు
- మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి 2 లక్షల మంది
- భక్తులు దూసుకురావడంతో తోపులాటలు
- మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల ఆక్రందనలు

5

గరుడ వాహనంపై మలయప్ప స్వామి, కిక్కిరిసిన తిరుమల మాడ వీధులు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఉత్తమ నటుడు అవార్డు అందుకుంటున్న రిషబ్ శెట్టి

జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానం

రాష్ట్రపతి భవన్‌లో అంగరంగ వైభవంగా కార్యక్రమం

- ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్న రిషబ్ శెట్టి, నిత్యామేనన్, ఏఆర్ రెహమాన్
- ఫాల్కే పురస్కారం స్వీకరించిన మిథున్ చక్రవర్తి

6

నాడూ నేడూ వారిదే హవా!

అర్హత లేని కంపెనీకి డీ-సిల్టేషన్ కాంట్రాక్టు

- జగన్ జమానాలో పొందిన సంస్థకే మరో జిల్లాలో అదనపు పనులు
- జీవో 43కి విరుద్ధమని తెలిసినా నెల్లూరు కలెక్టర్, జేసీ అత్యుత్సాహం
- బోట్స్‌మెన్ సొసైటీకి ఇవ్వకుండా వేరే సంక్షేమ సంఘానికి టెండర్
- ఇవ్వొద్దని గత నెల 20న హైకోర్టు ఆదేశాలు
- వాటిని ధిక్కరించి పాత తేదీలతో వర్క్ ఆర్డర్, ఒప్పందాలు
- ఆ కలెక్టర్, జేసీ వెనుక అదే జిల్లా అధికార పార్టీ నేత?

12



ఆ షాపులు భలే కిక్కు!

12

- విజయవాడలో రెండు షాపులకు ఫుల్ డిమాండ్
- 96, 97వ నంబరు దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ
- 96కు 87 దరఖాస్తులు.. 97కు 75 మంది పోటీ
- 96వ షాపునకు వచ్చిన దరఖాస్తు ఫీజే 1.74 కోట్లు
- 41 వేలు దాటిన దరఖాస్తులు.. గడువు మరో 2 రోజులు



14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంపై అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

శరవేగంగా అభివృద్ధి

- భూమిపూజ చేసి 14 నుంచి పనులకు శ్రీకారం
- పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకే పల్లె పండుగ
- గ్రామసభల్లాగే విజయవంతం చేద్దాం
- ప్రతి పంచాయతీలో నాలెడ్జ్ బోర్డు
- ఈ ఏడాది పూర్తిచేసిన, చేపట్టే పనుల వివరాలు అందులో ఉండాలి
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్దేశం
- పంచాయతీరాజ్ అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో విప్లవాత్మక రీతిలో నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదించిన పనులను ఈ నెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి ప్రారంభించాలని

మిగతా 12వ పేజీలో...

హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్




"ఈరోజు (మంగళవారం) శరన్నవరాత్రుల్లో ఆరో రోజు. చేతిలో కమలం పట్టుకుని, సింహవాహనాన్ని అధిరోహించిన కాత్యాయనీ మాతను ఆరాధించే రోజు. ఆ తల్లి మనందరినీ ఆశీర్వదించింది. ఈ పవిత్ర సమయంలో.. హరియాణాలో వరుసగా మూడోసారి కమలం వికసించింది. భగవద్గీత పుట్టిన గడ్డపై సత్యం, అభివృద్ధి గెలిచాయి. అబద్ధాల మూటపై అభివృద్ధి హామీ విజయం సాధించింది."

- ప్రధాని మోదీ

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి వరుసగా మూడోసారి విజయం

- 90 సీట్లకుగాను 48 స్థానాల్లో గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్!
- ఒక్క సీటూ సాధించని ఆమ్ ఆద్మీ పార్టీ



పార్టీ	సీట్లు
బీజేపీ	48
కాంగ్రెస్	37
ఐఎన్ఎల్డీ	2
స్వతంత్రులు	3

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది! ప్రీ పోల్, పోస్ట్ పోల్, ఎగ్జిట్ పోల్ అంచనాల్ని తలకిందులు చేస్తూ.. రాజకీయ నిపుణుల విశ్లేషణలను అబద్ధం చేస్తూ.. ముచ్చటగా మూడోసారి విజయం సాధించింది! మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత కొంతసేపటి వరకూ కాంగ్రెస్ జోరు కనిపించినా.. బీజేపీ క్రమంగా పుంజుకుని రేసులో ముందుకు దూసుకుపోయింది. మొత్తం 90 సీట్లకుగాను.. 48 స్థానాల్లో విజయఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి ఎగ్జిట్ పోల్స్ దాకా.. ప్రతి దశలోనూ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేవలం 37 సీట్లకు పరిమితమై మరోసారి ఓటమి చేదును చవిచూసింది. ఐఎన్ఎల్డీ రెండు సీట్లతో సరిపెట్టుకోగా.. కాంగ్రెస్‌తో పొత్తు కుదరక సొంతంగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ డకౌట్ అయిపోయింది! ఇక.. గత ఎన్నికల్లో 10 సీట్లు సాధించి కింగ్ మేకర్ పాత్ర పోషించిన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది! సాక్షాత్తూ ఆ పార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా దారుణాతిదారుణంగా ఓడిపోయారు. ఇక.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన వినేశ్ ఫొగట్, సావిత్రి జిందాల్ గెలుపొందడం విశేషం. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వినేశ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో గెలిచారు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ అయిన సావిత్రి జిందాల్.. హిసార్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇంత సంతోషంలోనూ బీజేపీకి అసంతృప్తి కలిగించే విషయం.. ఆ పార్టీకి చెందిన 8 మంది మంత్రులు, స్పీకర్ ఓడిపోవడం. అటు హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, ఐఎన్ఎల్డీ చీఫ్ అభయ్ సింగ్ చౌతాలా కూడా ఓడిపోవడం గమనార్హం. కాగా.. 1966లో ఏర్పాటైన హరియాణాలో ఒక పార్టీ వరుసగా మూడోసారి గెలవడం ఇదే!

కాంగ్రెస్ స్వయంకృతం

హరియాణాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, జాట్ సామాజికవర్గంలో ప్రభుత్వంపై నెలకొన్న ఆగ్రహం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టిన క్రీడాకారుల్లో కొందరు రాజకీయ ఆరంగేట్రం చేసి కాంగ్రెస్ పక్షాన నిలబడడం, రైతు ఆందోళనలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి వంటి అనేక పరిణామాల నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే.. ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో వర్గపోరు వారి గెలుపు అవకాశాలకు దూరం చేసింది. జాట్ వర్గం నేత భూపిందర్ సింగ్ హుడాకు దళిత వర్గం నేత కుమారి సెల్జాకు మధ్య విభేదాలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం హుడాకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 70 సీట్లు తన వర్గంవారికే ఇచ్చుకున్నారని.. ఇది కుమారి సెల్జాకే కాక, జాట్ వర్గానికే చెందిన రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు సైతం మింగుడుపడలేదని చెబుతున్నారు. దీంతో, ఎవరికి వారు రెబల్ అభ్యర్థులను నిలబెట్టడంతో పార్టీకి నష్టం వాటిల్లింది. బీజేపీని కూడా రెబెల్ అభ్యర్థులు దెబ్బ తీశారు.

జాట్లు.. జాటేతరులు..

జాట్లు వర్సెస్ జాటేతర వర్గాలుగా చీలిపోయిన హరియాణా ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా విస్పష్టమైన తీర్పుచెప్పారు. జాట్లలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపగా.. జాటేతరుల్లో అత్యధికులు బీజేపీకి ఓటేయడంతో.. కమలనాథులు అనూహ్య విజయం సాధించారు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం అత్యంత తక్కువగా ఉండడానికి కారణం ఇదే. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవుతుంటే.. మరోవైపు బీజేపీ తనదైన శైలిలో ఎన్నికల వ్యూహాలను అమలు చేసింది. మరోవైపు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లకు ఆమ్ ఆద్మీ, బీఎస్పీ రూపంలో గండి పడింది. ఇది బీజేపీకి ఎంతగానో అనుకూలించగా, కాంగ్రెస్‌కు తీవ్రంగా నష్టం చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆప్ హరియాణాలో మాత్రం ఒంటరిగా బరిలో దిగింది.

కేకేకు అందని 'హరియాణా' నాడి

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎంతో హోరాహోరీగా ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లతో అఖండ విజయం సాధిస్తుందని, వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితమై ఘోర పరాజయం చవిచూస్తుందని అత్యంత కచ్చితంగా చెప్పిన కేకే సర్వే సంస్థ అధినేత కిరణ్ కొండేటి హరియాణా విషయంలో మాత్రం సరిగా అంచనా వేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో సర్వే చేసిన కేకే సంస్థ.. మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ 65 పైగా గెలవబోతోందని చెప్పారు. బీజేపీ టైటానిక్‌లా మునిగిపోయే నావ అని పేర్కొన్నారు. రానున్న మహారాష్ట్ర సహా మరే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ నెగ్గదని తెలిపారు. కానీ, ఫలితాలను చూస్తే ఈ అంచనాలన్నీ తప్పాయి. కేకేనే కాదు.. హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికలపై జాతీయ సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పాయి. మరీ ముఖ్యంగా హరియాణాలో కాంగ్రెస్ సగటున 55 సీట్లు గెలిచి అధికారం చేపడుతుందని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. దాదాపు ఇవన్నీ బీజేపీకి 30కి మించి సీట్లు రావని పేర్కొన్నాయి. కానీ, దీనిని తలకిందులు చేస్తూ కమలం నెగ్గుకొచ్చింది. కాగా, కశ్మీర్‌లో త్రిశంకు సభ ఏర్పడుతుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది.

అలా వచ్చి ఇలా గెలిపించి

హరియాణా సీఎంగా నయాబ్ కొనసాగింపు!

న్యూఢిల్లీ, అక్టోబరు 8: హరియాణాలో బీజేపీ ఎన్నికల వ్యూహం ఫలించినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత సీఎం నయాబ్ సింగ్ సైనీ.. సీఎంగా కొనసాగడం దాదాపు ఖాయమైంది. ఓబీసీలను, జాట్‌లను ఆకర్షించడమే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఓబీసీ నేత నయాబ్ సింగ్ సైనీ(54)ని ముఖ్యమంత్రిని చెయ్యడం బీజేపీకి లబ్ధి చేకూర్చింది. సైనీ పాలన కూడా కలిసి రావడంతో లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలకే పరిమితమైన రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకుంది. నిజానికి, సీఎం సైనీ 200 రోజుల పాలనతోనే ఈ మ్యాజిక్ సాధ్యమైందనేది విశ్లేషకుల అభిప్రాయం. మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత నెలకొన్న సమయంలో మార్చి నెలలో సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. త్రివిధ దళాల్లో అగ్నివీర్‌గా పని చేసిన వారికి సర్వీస్ అనంతరం ఉపాధి కల్పనకు ఆమోదం, కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే పంటల సంఖ్యను 24కు పెంచడం, విద్యుత్ బిల్లుల కనీస చార్జీల రద్దు వంటి సైనీ ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల్లో బీజేపీపై ఉన్న వ్యతిరేకతను గణనీయంగా తగ్గించాయి. సీఎం సైనీపై నమ్మకాన్ని పెంచేశాయి. ఇక, ఎన్నికల ప్రచారంలోనూ పార్టీని ముందుండి నడిపించిన సైనీ.. బీజేపీ సాధించిన విజయాలను, ఎన్నికల హామీల అమలు అంశంలో తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికల్లో పార్టీ విజయం సాధించగా సైనీ తిరుగులేని నేతగా ఎదిగారు. పార్టీకి తిరిగి అధికారమిస్తే సైనీనే ముఖ్యమంత్రిగా కొనసాగతారని ఎన్నికల ప్రచారంలో బీజేపీ వర్గాలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో నయాబ్ సింగ్ సైనీ సీఎంగా కొనసాగడం లాంఛనమే..!!



లోకం తీరు



ఓట్ల కుస్తీలో ఫొగట్ పట్టే 'పట్టు'



చండీగఢ్, అక్టోబరు 8: కుస్తీ యోధురాలు, ట్రిపుల్ ఒలింపియన్ వినేశ్ ఫొగట్ హరియాణా ఎన్నికల సమరంలో మాత్రం ఓ 'పట్టు' పట్టారు. ఇటీవల ప్యారిస్ ఒలింపిక్స్‌లో దురదృష్టవశాత్తు తృటిలో పతకం చేజారినా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఫొగట్, తన సమీప అభ్యర్థి, బీజేపీకి చెందిన యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కుస్తీ పోరులాగే మంగళవారం ఫొగట్ ఫలితం కూడా అభిమానులను మునివేళ్ల మీద నిలబెట్టి ఉత్కంఠకు గురిచేసింది. తొలుత ఆధిక్యం కనబరిచినా తర్వాత ఆమె వెనుకబడ్డారు. కౌంటింగ్ మధ్య రౌండ్లకొచ్చేసరికి మళ్లీ ఆధిక్యంలోకొచ్చి దాన్ని చివరి దాకా కొనసాగించారు. 2019లో జులానా నుంచి ఎన్డీయే భాగస్వామ్య పార్టీ జేజేపీ అభ్యర్థి విజయం సాధించగా అంతకుముందు 2014, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇక్కడ జనం పట్టం కట్టారు. విజయం అనంతరం ఫొగట్ మీడియాతో మాట్లాడారు. ఫలితాల్లో తనకు ప్రజల ఆప్యాయత కనిపించిందని, రానున్న ఐదేళ్లలో ప్రజల అంచనాలను నిలబెడతానని, దేశం తనకు ఇచ్చిన ప్రేమ, నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. వినేశ్ ఫొగట్ విజయంపై జాతీయ రెజ్లింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ స్పందించారు. రెజ్లింగ్‌లో ఫొగట్ మోసంతో గెలిచేవారని, ఇక్కడా ఆమె మోసంతో గెలిచారని విమర్శించారు.



ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీసు వద్ద స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

జిలేబీ రాజకీయం!

హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తొలుత కాంగ్రెస్ జోరు కనిపించగానే.. ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం పెద్ద ఎత్తున జిలేబీలు (జిలేబీ) తెప్పించి పంచిపెట్టింది! కట్ చేస్తే.. కాసేపట్లోనే సీన్ మారింది. ఫలితాల్లో కాంగ్రెస్ జోరు తగ్గి బీజేపీ సీట్ల సంఖ్య పెరగడం మొదలుపెట్టగానే.. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కూడా జిలేబీలతో నోరు తీపి చేసుకుని సంబరాలు చేసుకున్నారు! ఈ జిలేబీలకో ఫ్లాష్ బ్యాక్ ఉంది. ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కాజా తరహాలో.. హరియాణాలో 'గోహానా జిలేబీ' ప్రఖ్యాతి గాంచిన మిఠాయి! ఆ ప్రాంతానికి చెందిన మాతూరామ్ అనే వ్యక్తి 1958 నుంచి జిలేబీలు విక్రయించడం ప్రారంభించారు. అనతికాలంలోనే అదో బ్రాండ్‌గా మారిపోయింది. ఈ క్రమంలోనే.. రాహుల్‌గాంధీ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా జిలేబీల బాక్సును చేతిలో పట్టుకుని.. నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా మాతూరామ్ వంటి వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని.. తాము అధికారంలోకి వస్తే వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని.. ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ జిలేబీని ఇతర రాష్ట్రాల్లోనూ అమ్మగలిగితే? ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే? మరో 20 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి దొరుకుతుంది కదా" అన్నారు! అప్పట్నుంచీ ఎన్నికలు ముగిసేదాకా.. ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తన గెలుపు సంబరాలను జిలేబీతో ప్రారంభించగా.. ఆ పార్టీని వెక్కిరిస్తున్నట్టుగా బీజేపీ తన సంబరాలను జిలేబీతో ముగించింది!!

హరియాణా ఫలితాన్ని ఆమోదించం

ప్రజల ఆకాంక్షలకు ఇది భిన్నం

- కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్‌ఖేరా



న్యూఢిల్లీ, అక్టోబరు 8: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాన్ని తాము ఆమోదించబోమని, రాష్ట్రంలో మార్పును కోరుకున్న ప్రజల అభిమతానికి భిన్నంగా ఈ ఫలితం ఉందని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఎన్నికల ఫలితం దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థల సమగ్రతపైనే తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొంది. ప్రజల తీర్పును కాలరాసిన కుట్రలకు విజయం దక్కిందని ఆరోపించింది. ఎన్నికల ఫలితాల వెల్లడి, ఈవీఎం బ్యాటరీల్లో ఉన్న చార్జింగ్‌పై తీవ్రమైన అనుమానాలున్నాయని తెలిపింది. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరాతో కలిసి పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'హరియాణా ఫలితాలు పూర్తిగా ఆశ్చర్యకరం, ఊహాతీతం. ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌండ్లవారీ ఫలితాల వెల్లడిలో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. కనీసం 14 నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరుపై తమ పార్టీ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై త్వరలో ఈసీకి ఫిర్యాదు చేస్తాం. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) స్థానిక అధికారులపై విపరీతమైన ఒత్తిడి తెచ్చింది. తొలి రౌండ్లలో మంచి ఆధిక్యతలో ఉన్న మా అభ్యర్థులు 50, 100, 250 ఓట్ల తేడాతో ఓడిపోయారు' అని జైరాం తెలిపారు. హరియాణా ఫలితాన్ని ఆమోదించబోమని, ఈ విషయం ఇక్కడితో ముగియలేదని స్పష్టం చేశారు. పవన్ ఖేరా మాట్లాడుతూ, 'సాధారణంగా ఎక్కడైనా, కౌంటింగ్ నాటికి ఈవీఎంల బ్యాటరీల్లో చార్జింగ్ 60-70 శాతమే ఉంటుంది. హరియాణాలో మా పార్టీ గెలిచిన స్థానాల్లో ఉన్న ఈవీఎంల బ్యాటరీలు 60-70 శాతం చార్జింగ్‌తో ఉన్నాయి. కానీ, బీజేపీ అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్‌తో ఉన్నాయి. పోలింగ్ తర్వాత వాటిల్లో 99% చార్జింగ్ ఉండటం ఎలా సాధ్యం? అదీగాక బీజేపీ గెలిచిన అన్ని స్థానాల్లో ఒకే విధంగా 99% చార్జింగ్‌తో ఎలా ఉన్నాయి? అంటే, ఏదో జరిగింది. ఇది కుట్రల విజయం, ప్రజాస్వామ్య అపజయం' అని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు తొలుత తాము ఈసీ వద్దకు వెళ్తామని, ఆ తర్వాత ఏం చేయాలన్నది ఆలోచిస్తామని జైరాం చెప్పారు. కాగా, జమ్మూకశ్మీర్ ఫలితాలపై స్పందిస్తూ.. ఏదో విధంగా మెజారిటీ సాధించాలనుకున్న బీజేపీ కుతంత్రాలను ఆ రాష్ట్ర ప్రజలు ఓడించారన్నారు.

ఈసీకి కాంగ్రెస్ లేఖ

హరియాణాలో ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌండ్ల వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు వెల్లడించే విషయంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని అంతకుముందు ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఒక లేఖ రాసింది. ఈసీ స్పందిస్తూ.. ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగిందనటానికి ఎటువంటి ఆధారాలు లేవని తెలిపింది.

ప్రజాస్వామ్యం గెలిచింది

శ్రీనగర్, అక్టోబరు 8: తుపాకుల కాల్పులు.. బాంబుల మోతతో దద్దరిల్లే కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం గెలిచింది. మరీ ముఖ్యంగా లోయలో బంద్‌లు మాయమై పూర్తి మార్పు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ప్రజలు హుషారుగా పాల్గొని స్పష్టమైన తీర్పునిచ్చారు. గత ఐదేళ్లలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లను ముమ్మరంగా చేపట్టాయి. ఎన్నికల బహిష్కరణ పిలుపులు తగ్గాయి. ఉగ్రవాద ప్రభావం ఎక్కువగా ఉండే శ్రీనగర్, కుల్గామ్, సోపోర్, షోపియాన్‌లోనూ భారీ ఓటింగ్ నమోదైంది.

కశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా!

- నాడు లద్దాఖ్‌తో కూడిన రాష్ట్రానికి.. నేడు కశ్మీర్‌కు
- దాదాపు పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠంపైకి..!
- లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా అసెంబ్లీలో విజయం





శ్రీనగర్, అక్టోబరు 8: సరిగ్గా ఆరు నెలల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి చేతిలో పరాజయం పాలైన ఆయన.. ఆ దెబ్బ నుంచి కోలుకుని అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటారు. పోటీ చేసిన రెండుచోట్లా గెలిచి.. పదేళ్ల విరామం తర్వాత సీఎం పదవిని చేపట్టనున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన జమ్ము కశ్మీర్ అసెంబ్లీ తొలి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)-కాంగ్రెస్ కూటమిని విజయపథంలో నడిపించిన ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి కానున్నారు. ఒమర్ 2009-15 మధ్యన ఉమ్మడి జమ్మూకశ్మీర్‌కు సీఎంగా వ్యవహరించారు. ఈయన తాత షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లాలు చెరో మూడుసార్లు ముఖ్యమంత్రులుగా పనిచేయడం గమనార్హం.

28 ఏళ్లకు ఎంపీ.. 39వ ఏట సీఎం


ఒమర్ 1970 మార్చి 10న బ్రిటన్‌లో జన్మించారు. ఇంగ్లిష్ మహిళ మొలీని వివాహం చేసుకున్న ఫరూఖ్ ఇంగ్లండ్‌లోనే ఉండేవారు. తండ్రి షేక్ అబ్దుల్లా మరణం అనంతరం ఆయన భారత్‌కు తిరిగొచ్చారు. కాగా, ఒమర్.. శ్రీనగర్, ముంబైలలో చదివారు. స్కాట్లాండ్‌లో డిగ్రీ చేశారు. 1998లో 28 ఏళ్ల వయసులో శ్రీనగర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 39వ ఏట.. 2009 ఎన్నికల్లో విజయంతో సీఎం అయ్యారు. 1994లో పాయల్ నాథ్‌ను వివాహమాడిన ఒమర్ 2011లో విడిపోయారు. ఇక 2009లోనూ కాంగ్రెస్‌తో కూడిన ఎన్సీ ప్రభుత్వానికి సారథ్యం వహించిన ఒమర్ ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలో ఒమర్ 2001 నుంచి ఏడాదిన్నర పాటు విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. కుమారుడు ఒమర్ అబ్దుల్లానే కశ్మీర్ కాబోయే సీఎం అని ఫరూఖ్ అబ్దుల్లా మీడియాతో వ్యాఖ్యానించారు.

● ఒమర్.. బుద్గాంలో పీడీపీ అభ్యర్థి సయ్యద్ ముంతజీర్ మెహ్దీపై 18,485 ఓట్ల ఆధిక్యంతో, గందేర్బల్‌లో బషీర్ అహ్మద్ మిర్‌పై 10,574 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

కశ్మీరంలో అనూహ్యం

హంగ్ అంచనాలన్నీ తలకిందులు.. ఎన్సీ - కాంగ్రెస్ కూటమికి పట్టం.. 42 సీట్లు నెగ్గిన నేషనల్ కాన్ఫరెన్స్

డివిజన్	సీట్లు	ఇండియా	బీజేపీ	పీడీపీ	ఇతరులు
కశ్మీర్‌లోయ	47	41	0	3	3
జమ్మూ	43	8	29	0	6
మొత్తం	90	49	29	3	9



శ్రీనగర్, అక్టోబరు 8: హంగ్ ఖాయమనే అంచనాలు.. నామినేటెడ్ ఎమ్మెల్యేల ఓట్లు కీలకమనే ఆందోళనలు.. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నాలు తప్పవన్న సంకేతాలు..! కానీ, వీటికి తావు లేకుండా జమ్మూకశ్మీర్ ఓటర్లు తీర్పు చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)-కాంగ్రెస్ కూటమికి పట్టం కట్టారు. 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్సీ 51, కాంగ్రెస్ 32, సీపీఎం, జేకేఎన్‌పీపీ ఒక్కోచోట పోటీ చేశాయి. ఐదు చోట్ల ఎన్సీ, కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీకి దిగాయి. కాగా, కశ్మీర్ అసెంబ్లీకి ఐదుగురు ఎమ్మెల్యేలను గవర్నర్ నామినేటెడ్ చేయడంతో సంఖ్య 95కు పెరిగింది. కనీస మెజార్టీ 48గా మారింది. దీనినీ ఎన్సీ కూటమి అధిగమించింది. జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమికి తొలి విజయం కశ్మీర్ నుంచే అందినట్లైంది. హరియాణాలో దారుణంగా విఫలమైన ఆప్.. కశ్మీర్‌లోని దోడా స్థానాన్ని కైవసం చేసుకుని బోణీ కొట్టింది. మొత్తం ముగ్గురు మహిళలు ఎమ్మెల్యేలయ్యారు. సకీనా మసూద్, షమీమా ఫిర్దౌస్ (ఎన్సీ)తో పాటు బీజేపీ నుంచి షగున్ పరిహార్ గెలిచారు.

ఎన్సీ సూపర్.. పీడీపీ బేజార్


కశ్మీర్ ఎన్నికల్లో ఎన్సీ హవా సాగింది. సొంతంగా కనీస మెజార్టీకి 6 సీట్లు దూరంలో నిలిచింది. మొత్తం 23.43 శాతం ఓట్లు సాధించింది. గత ఎన్నికల కంటే (20.33) ఇది మూడు శాతం అధికం. ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బుద్గామ్, గందేర్బల్‌లో రెండుచోట్లా గెలుపొందారు. కశ్మీర్ అనగానే గుర్తొచ్చే మరో ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీపీ) దారుణ ప్రదర్శన కనబర్చింది. మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని ఈ పార్టీ గత ఎన్నికల్లో 28 సీట్లు నెగ్గగా ఇప్పుడు 25 కోల్పోయింది. ఓట్ల శాతం 22.67 నుంచి 8.87కు పడిపోయింది.

జమ్మూలో కమలం జోష్

జమ్మూలో హిందూ జనాభా ఎక్కువ. అదే సమయంలో కశ్మీర్‌లో ముస్లిం ప్రాబల్యం అధికం. ఉమ్మడి రాష్ట్రంలో 87 సీట్లుండేవి. ఆర్టికల్ 370 రద్దు చేశాక అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా జమ్మూకశ్మీర్ మిగిలింది. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. దీంతో జమ్మూలో సీట్ల సంఖ్య 37 నుంచి 43కి చేరింది. కశ్మీర్ లోయలో సీట్లు మాత్రం ఒక్కటే పెరిగి 47 అయ్యాయి. ఇక జమ్మూలోని 43 సీట్లకు గాను.. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీ 29 స్థానాలను ఖాతాలో వేసుకుంది. ఉమ్మడి కశ్మీర్‌లో 2014లో 23 శాతం ఓట్లతో బీజేపీ 25 సీట్లు నెగ్గింది. ఇప్పుడు ఓట్లు 25.64 శాతానికి పెరిగాయి. ఓట్ల శాతం ఎన్సీ కంటే బీజేపీకే ఎక్కువ కావడం గమనార్హం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రైనా పరాజయం పాలయ్యారు. కాగా, కశ్మీర్ పీసీసీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా మాత్రం విజయం సాధించారు. సీపీఎం అభ్యర్థి మొహమ్మద్ యూసుఫ్ తరిగామి కుల్గాంలో వరుసగా ఐదోసారి జయకేతనం ఎగురవేశారు.

హస్తం ప్రభావం శూన్యం

ఎన్సీతో జట్టు కట్టినా కశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన పేలవంగా ఉంది. పదేళ్ల కిందట 18 శాతం ఓట్లతో 12 సీట్లలో గెలవగా.. ప్రస్తుతం 12 శాతం ఓట్లే సాధించింది. ఇతరులు సాధించిన 30.09 శాతం ఓట్ల కంటే ఇది తక్కువ. జమ్మూలో 29చోట్ల బరిలో దిగి ఒకచోటనే హస్తం నెగ్గింది. లోయనే కాస్త ఆదుకుంది.



పార్టీ	సీట్లు
ఎన్సీ	42
బీజేపీ	29
కాంగ్రెస్	6
పీడీపీ	3
జేపీసీ	1
సీపీఎం	1
ఆప్	1
స్వతంత్రులు	7

అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ,చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ,
దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్



దసరా శుభాకాంక్షలతో...

సోనోవిజన్ దసరా సేల్

మీరెంతగానో అభిమానించి ఆదరించిన స్క్రాచ్ కార్డ్ స్కీమ్



ప్రతి ₹2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి
₹100/- నుండి ₹1,00,000/-
వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి. (సెలెక్టెడ్ మోడల్స్ పై)



BAJAJ FINSERV	HDB FINANCIAL SERVICES	IDFC FIRST Bank	HDFC BANK	
Upto 10000/- క్యాష్ బ్యాక్	Upto 21000/- క్యాష్ బ్యాక్	Upto 22500/- క్యాష్ బ్యాక్	Upto 10000/- క్యాష్ బ్యాక్	Upto 22.5% క్యాష్ బ్యాక్
1EMI Free	1EMI Free	1EMI Free	1EMI Free	క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుపై సెలెక్టెడ్ మోడల్స్, షరతులు వర్తిస్తాయి.
క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు. బజాజ్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు పేపర్ ఫైనాన్స్‌పై, షరతులు వర్తిస్తాయి.	క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు మరియు HDB పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి.	క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు మరియు IDFC పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి.	HDFC పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు. సెలెక్టెడ్ మోడల్స్, షరతులు వర్తిస్తాయి.	

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 1,00,000/- విజేత

శ్రీ యస్. జగదీష్ చంద్రప్రసాద్
బొల్లిగూడెం, హైదరాబాద్.
7780195487

రూ. 1,00,000/- విజేత

శ్రీ సుమంత్ చౌదరి
గాజువాక, విశాఖపట్నం.
7093717999

రూ. 1,00,000/- విజేత

శ్రీ సి.హెచ్. రవితేజ
విజయవాడ.
8919467487

రూ. 1,00,000/- విజేత

శ్రీ వెంకటేశ్వరరెడ్డి
నీలారెడ్డిపల్లి, అనంతపురం
8500397227

రూ. 1,00,000/- విజేత

శ్రీ యస్. సోమిరెడ్డి
గులాబితోట పార్క్ రోడ్, విజయవాడ.
9866059777

రూ. 1,00,000/- విజేత

శ్రీ పి. శ్రీనివాసరావు
అక్కయ్యపాలెం, విశాఖపట్నం.
9490109278

రూ. 1,00,000/- విజేత

శ్రీ పి. గంగాధర
మొగల్‌రాజపురం, విజయవాడ.
9849593606

రూ. 1,00,000/- విజేత

శ్రీ షేక్ రబ్బాని
కొత్తూరు, నెల్లూరు.
8096067733

రూ. 1,00,000/- విజేత

శ్రీమతి షేక్ హసీన
గాంధినగర్, గుంటూరు.
9701232221

రూ. 1,00,000/- విజేత

శ్రీ యం. వెంకటరామారావు
వెలుగుబండ విలేజ్, రాజమండ్రి.
8500002002

రూ. 50,000/- విజేత

శ్రీ సీరా నర్సింగ్ రావు
అరిలోవ చినగదిలి, విశాఖపట్నం
8712332367

రూ. 50,000/- విజేత

శ్రీ దగ్గుమటి శేషయ్య
పాలేటిపాడు, ఒంగోలు
9705929909

రూ. 50,000/- విజేత

శ్రీ అట్టడ రమణ
నెల్లిమర్ల, విజయనగరం.
9866986071

రూ. 50,000/- విజేత

శ్రీ బి. శివప్రసాద్
వి.ఆర్.కాలని, కర్నూలు.
9494222989

రూ. 50,000/- విజేత

శ్రీమతి జుబేదా
హైదరాబాద్.
8238136343

రూ. 50,000/- విజేత

శ్రీమతి బి. వరలక్ష్మి
రామలింగేశ్వరనగర్, విజయవాడ.
9908395773

రూ. 50,000/- విజేత

శ్రీమతి జి. వెంకటలక్ష్మి
కృష్ణలంక, విజయవాడ.
9396790383

రూ. 50,000/- విజేత

శ్రీ షేక్ మొహియుద్దీన్
పెదకాకాని మండల్, గుంటూరు
7075756886

రూ. 50,000/- విజేత

శ్రీ పి. వర ప్రసాద్
పిఠాపురం, కాకినాడ.
8977887787

రూ. 50,000/- విజేత

శ్రీ ఈ. కోటేశ్వరరావు
కాపుశెట్టివాని పాలెం, గోపాలపట్నం
9701184885

రూ. 50,000/- విజేత

శ్రీ పి. సురేష్
ఇనం కొత్తూరు విలేజ్, తిరుపతి.
9652307185

రూ. 50,000/- విజేత

శ్రీమతి కొనపాక సునీత
నాగేంద్రటెంపుల్ దగ్గర, మిర్యాలగూడ.
8374921263

రూ. 25,000/- విజేత


శ్రీ మొహమ్మద్ గౌస్‌మియా
చమన్‌పల్లి, కరీంనగర్.
8790733703


రూ. 25,000/- విజేత

శ్రీ కట్టా రాజశేఖర్
కాటూరు, గుడివాడ.
8790500330

LG Life's Good

LG OLED
Home Theatre
4K 65 SMART TV
208 Cm (83") Ultra HD 4K OLED
165 Cm (65") Ultra HD 4K QLED

SAMSUNG **SONY**

189 Cm (75") LED 4K Ultra UHD
164 Cm (65") LED 4K Ultra HD Smart

iPhone

16, 16+ Upto 5000/- Cash Back
16 Pro, 16 Pro Max Upto 4000/- Cash Back
Smart WATCH 9/0, 12/0, 12/4 Schemes Available
24/0, 9/0, 12/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)

SAMSUNG
S-24 Ultra 5G
Upto 12000/- Cash Back

A-55 5G
9/0, 12/0, 24/0 Schemes Available

vivo 5G V-40, V-40 Pro

Upto 4000/- Cash Back
7/1, 6/0, 9/0, 12/0, 24/0 Schemes Available

oppo 5G Reno 12 Pro, 12 Pro+

6/0, 8/0, 11/2 Schemes Available

ONEPLUS 5G 12 & 12 Pro

Instant CashBack ICICI Credit Card
12/4 Scheme Available

realme 5G 13 Pro, 13 Pro+

6/0, 8/2, 10/3 Schemes Available

mi Redmi 5G Note13, Note 13 Pro

6/0, 8/0, 10/2, 12/4 Schemes Available


hp LAPTOP 12/4 Scheme Available
DELL LAPTOP 15/4 Scheme Available
ASUS LAPTOP 12/4 Scheme Available
MacBook LAPTOP 24/0 Scheme Available 10000/- Cash Back

Conditions Apply

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.	విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202	విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184	విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640

విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702	విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209	గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628	విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,	శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626	పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47	కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368	గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79	మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త విజయాలు

హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో ఓటర్లు మంగళవారం ఇచ్చిన తీర్పు బీజేపీకి కొత్తశక్తిని ఇవ్వడం ఖాయం. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో మూడోమారు కేంద్రంలో అధికారం దక్కినప్పటికీ, అది సొంతకాళ్ళమీద కాక, మిత్రపక్షాల ఊతంతో సాధ్యపడిన స్థితిలో బీజేపీకి ఈ రెండు ఫలితాలు సమధికోత్సాహాన్నిస్తాయి. హర్యానాలో మూడోమారు మంచిస్కోరుతో అధికారంలోకి రావడం, జమ్మూకశ్మీర్‌లో పదేళ్ళ తరువాత ఎన్నికలు జరిగినా, గతంలో కంటే ఘనంగా తన ఉనికిని చాటుకోవడం మెచ్చదగ్గ విషయం. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి యోధుడిని మార్చి, ఆ స్థానంలో ఎవరికీ అంతగా తెలియని ఓబీసీ నేత నయాబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిగా బీజేపీ కూచోబెట్టిన సాహసోపేతమైన వ్యూహం ఇప్పుడు సత్ఫలితాన్నిచ్చింది. సీఎంను మార్చడంతో ఆరంభమైన ఆ ప్రక్షాళన ఆ తరువాత అధికశాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, మంత్రులకు టిక్కెట్లు ఇవ్వకపోవడం, ఆఖరునిముషం దాకా అభ్యర్థుల జాబితాలు తిరగరాయడం వరకూ కొనసాగింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అతి తక్కువ ఎంపీసీట్లతో చతికిలబడిన తరువాత, ఎగ్జిట్ పోల్స్ సైతం ఎదురుగాలి వీస్తున్నదని తేల్చేశాక, మూడోమారు హర్యానాలో బీజేపీ విజేతగా నిలుస్తుందని ఎవరూ ఊహించలేదు.

హర్యానాలో నరేంద్రమోదీ ఉధృతంగా ప్రచారం చేయకపోవడానికి కారణాలు ఏమైనప్పటికీ, అగ్నివీర్, రైతువ్యతిరేక చట్టాలు, మహిళా మల్లయోధుల ఉద్యమం, మద్దతుధర హామీలు ఇత్యాదివి ప్రభావం చూపుతాయని చాలామంది అంచనావేశారు. హర్యానా కొత్త సీఎంకు మొదట లోక్‌సభ, ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికల కోడ్‌లతో తన ప్రభావాన్ని చూపడానికి పెద్దగా సమయం చిక్కలేదన్నమాట నిజం. కానీ, రెండువిడతల పాలనలో తన పార్టీ బాగా పరువుకోల్పోయిన స్థితిలో, నష్టాన్ని పూడ్చేందుకు కొన్ని పథకాలు ప్రకటించారు. అగ్నివీర్‌లకు ప్రత్యేక ఉపాధి, పాతికరకాల పంట ఉత్పత్తులను ప్రభుత్వమే నేరుగా కొనడం, సబ్సిడీ గ్యాస్, మహిళలకు ప్రత్యేక ఉపాధి వంటివి అనేకం అందులో ఉన్నాయి. ఓబీసీ సైనీని ఎంపికచేయడంతో పాటు, అనేక జాట్‌యేతర కులాలను తనవైపు తిప్పుకోవడంలోనూ బీజేపీ విజయం సాధించింది. కిసాన్, జవాన్, పహెల్వాన్ అన్న కాంగ్రెస్ నినాదం పూర్తిగా జాట్‌లను ఉద్దేశించినట్టుగా, ఆ పార్టీ వారి చుట్టూ తిరుగుతున్నట్టుగా మిగతా కులాలకు అనిపించిందట. ఇక, క్షేత్రస్థాయిలో బీజేపీ, దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు పడిన శ్రమ, అట్టడుగువరకూ విస్తరించిన కులచీలికల వ్యూహాలు ఊహకు అందనివి.

జమ్మూకశ్మీర్‌లో సైతం ఫలితాలు ఆశ్చర్యం కలిగించేవే. అబ్దుల్లాల విజయం ఎలా ఉన్నా, ముఫ్తీలు ఇంతగా చతికిలబడిపోవడం వారి పార్టీ చరిత్రలో ఇదే ప్రథమం. పదేళ్ళక్రితం మెహబూబా ముఫ్తీతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, అది కూలడం, రాష్ట్రపతి పాలన, ప్రత్యేక ప్రతిపత్తి రద్దునుంచి సుదీర్ఘకాలం సాగిన నిర్బంధం వరకూ ప్రజలు ఏ ఘట్టాన్నీ మరిచిపోయినట్టు లేదు. కశ్మీరానికి హిందూ పాలకుడిని ఇవ్వాలన్న బీజేపీ ఆశయం నెరవేరకపోవచ్చును కానీ, హిందూ ఆధిపత్య జమ్మూలో దాని పట్టు బాగానే ఉంది. కానీ, ముప్పై రెండుస్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ కశ్మీర్‌లోయలో ఐదు, జమ్మూలో ఒకటి మాత్రమే గెలవడం హర్యానా ఓటమికి తోడు మరో శరాఘాతం. అత్యధికం పీడీపీ స్థానాలను నేషనల్ కాన్ఫరెన్స్ ఇప్పుడు గెలుచుకోవడం లోయలో ప్రజాభిప్రాయానికి అద్దంపడుతున్నది. జమ్మూలో బీజేపీ బలం ఎంత హెచ్చినా దానిని అధికారానికి దూరంగా ఉంచడం లోయ ప్రజల అభీష్టం కావచ్చు. తాను గతంలో తిట్టిపోసి, జైళ్ళలోకి నెట్టి, ఆస్తులను సైతం స్వాధీనం చేసుకున్న పలువురు వేర్పాటువాదులను బీజేపీ రంగంలోకి దించినా, అనేక చిన్నాచితకాపార్టీలు ఓట్లను చీల్చేందుకు శాయశక్తులా కృషిచేసినా, కాంగ్రెస్ కొంతమేరకు నష్టపోయిందేమో కానీ, అబ్దుల్లాల పక్షాన ప్రజలు గట్టిగా నిలబడటం విశేషం.

అత్యధికస్థానాలు గెలుచుకున్న పార్టీ నాయకుడుగా ఒమర్ అబ్దుల్లా సునాయాసంగా ముఖ్యమంత్రి కాబోతున్నారు. కాంగ్రెస్ మద్దతు కూడా ఉన్నది కాబట్టి, ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసే అధికారాన్ని దఖలు పరుచుకున్న లెఫ్టినెంట్ గవర్నర్ అడ్డుతోవలు తొక్కకపోవచ్చు. కానీ, కశ్మీర్ చరిత్రలో అత్యంత బలహీనమైన, ఎటువంటి నిర్ణయాధికారాలూ లేని అసెంబ్లీకి సారథ్యం వహిస్తూ ఇకపై నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం నిత్యం గవర్నర్‌తో ఘర్షణపడాల్సి ఉంటుంది. భవిష్యత్తు పరిణామాలను అటుంచితే, పదేళ్ళ తరువాత ఎన్నికలు ప్రశాంతంగా జరగడం, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావడం, తమకు నచ్చినవారిని ఎన్నుకోవడం మెచ్చదగ్గ విషయం.

హర్యానాలో బీజేపీ ఎలా గెలిచింది?





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

భారతీయ జనతా పార్టీతో ముఖాముఖి తలపడే రాష్ట్రాల్లో అనేక చోట్ల కాంగ్రెస్ పార్టీ ఎందుకని గట్టి పోటీనివ్వకపోతోంది? బీజేపీని ఎదుర్కొనేందుకు అవసరమైన అస్త్ర శస్త్రాలు కాంగ్రెస్ వద్ద లేవా? 2022లో హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీతో కాంగ్రెస్ ముఖాముఖి పోటీపడి విజయం సాధించగలిగింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలో బీజేపీకి 17 సీట్లు లభిస్తే కాంగ్రెస్‌కు 9 సీట్లు మాత్రమే లభించాయి. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం నాలుగు సీట్లు బీజేపీకే దక్కాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికంగా మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసిన స్థానాల్లోనే విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో మిత్రపక్షాల వల్ల కాంగ్రెస్ ఓటు శాతం పెరిగింది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సంఖ్యాబలం 240కి తగ్గిపోయిన తర్వాత బీజేపీని ముఖాముఖి ఢీకొనే అవకాశం కాంగ్రెస్‌కు ఇప్పుడు హర్యానాలో లభించింది. నిజానికి లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌కు టేకాఫ్ దశ ప్రారంభమైందని చాలా మంది భావించారు. ప్రతిపక్ష నేత హోదా సాధించిన రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్‌కు మాత్రమే బీజేపీని ఢీకొనే శక్తి ఉన్నదనే ప్రచారం జరిగింది. లోక్‌సభలో ఇతర మిత్రపక్షాలతో కలిసి బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేసిన రాహుల్‌గాంధీ విస్తృతంగా ప్రజల్లో ప్రవేశించడమే కాక విదేశాలకు వెళ్లి కూడా తాను మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడుగా నిరూపించుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన స్వంత భావజాలం సృష్టించుకుంది. దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు తామే ప్రాతినిధ్యం వహించగలమని చెప్పుకుంది. బీజేపీని సంపన్న వర్గాల పార్టీగా తమది పేదల పార్టీగా చిత్రీకరించింది. కులజనగణన, రైతుల సమస్యలు, నిరుద్యోగం, అధిక ధరలు మొదలైన అనేక అంశాలను లేవనెత్తింది. నరేంద్రమోదీని రాహుల్ గాంధీ విమర్శించినంత తీవ్రంగా మరే నేతా విమర్శించలేదు. ప్రతిపక్షాలు కూడా రాహుల్‌తో ఏ మాత్రం విభేదించలేదు. పైగా ఆయనను ప్రోత్సహించాయి. లోక్‌సభలో ఆయన వెన్నంటి నిలిచాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదరని రాష్ట్రాల్లో కూడా ప్రతిపక్షాలు రాహుల్‌ను వ్యక్తిగతంగా విమర్శించకుండా ఇండియా కూటమిలో కొనసాగుతూ వచ్చాయి.

అయితే బీజేపీతో ముఖాముఖి పోటీ చేసే రాష్ట్రాల్లో కాంగ్రెస్ దాన్ని ఓడించగల శక్తిని, వ్యూహరచనను సమకూర్చుకోలేదని హర్యానా ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. నిజానికి హర్యానాలో పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. రైతుల ఆందోళన, మల్లయోధుల నిరసనతో పాటు అనేక స్థానిక అంశాలు బీజేపీకి వ్యతిరేకంగా మారాయి. హర్యానాలో తిరిగిన ప్రతి జర్నలిస్టూ అక్కడ మార్పు సంభవిస్తోందని భావించారు. హర్యానాలో ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన ఏడు ప్రధాన సంస్థలు చెప్పిన ఫలితాలను సగటున బేరీజు వేసి చూస్తే 90 సీట్లలో 55 సీట్లు కాంగ్రెస్‌కు దక్కుతాయని, బీజేపీకి 26 సీట్లు దక్కుతాయని తేలింది. కాని ఇప్పుడు ఫలితాలు చూస్తే అందుకు భిన్నంగా ఉన్నాయి. బీజేపీ మూడోసారి హ్యాట్రిక్ చేసి అధికారంలోకి రాగలిగింది.

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఎన్నికల కమిషన్‌ను, ఈవీఎంలను విమర్శించడం ప్రతి పార్టీ చేస్తుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే ఫలితాలను వెంట వెంటనే ప్రకటించడం లేదని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అందుకు ఎన్నికల కమిషన్ వెంటనే స్పందిస్తూ అందుకు ఆధారాలేమీ లేవని, ప్రతి అయిదు నిమిషాలకూ ఫలితాలను ప్రకటిస్తూనే వచ్చామని స్పష్టం చేసింది. అంటే కాంగ్రెస్‌కు తాము ఎందుకు ఓడిపోయామో ఏ మాత్రం అర్థం కాలేదన్న విషయం తేటతెల్లమవుతోంది. మేము ఈ ఫలితాలను ఆమోదించం అని ప్రకటించినంత మాత్రాన ఏమి జరుగుతుంది?

ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదలయిన తర్వాత బీజేపీతో జరిగిన ఒప్పందంలో భాగంగా హర్యానాలో తమ అభ్యర్థులను రంగంలోకి దింపారని ఒక ప్రచారం జరుగుతోంది. రాజకీయాల్లో ఎవరూ శాశ్వత శత్రువులు కానీ శాశ్వత మిత్రులు కానీ ఉండరు. కేజ్రీవాల్‌తో బీజేపీ అలాంటి ఒప్పందమే నిజంగా కుదుర్చుకుని ఉంటే అందుకు ఆ పార్టీ వ్యూహకర్తలను ప్రశంసించాల్సి ఉంటుంది కాని తప్పుపట్టలేము. తమిళనాడులో డిఎంకెకు కూడా బీజేపీ స్నేహహస్తం చాస్తోందని ఇటీవల మరో ప్రచారం మొదలైంది. నవంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు సమీపించేసరికి బీజేపీ ఏ వ్యూహరచన చేస్తుందో, లేక ఇప్పటికే చేసిందో చెప్పడం కష్టం. దేశంలో తన ఆమోద యోగ్యత పెంచుకునేందుకు, తాను బలహీనపడ్డానన్న విమర్శలను దూరం చేసేందుకు, పూర్తి టర్మ్ అధికారంలో కొనసాగేందుకు మోదీ ఏ వ్యూహాన్నైనా అవలంబించవచ్చు. దక్షిణాదిన తెలుగుదేశం, జనతాదళ్ (ఎస్)తో చేతులు కలిపాక బీజేపీ ఆమోదయోగ్యత పెంచుకుంది. తెలంగాణలో ఆ పార్టీ ఏమి చేస్తుందో కొద్ది నెలల్లో తేలనుంది.

ఎటొచ్చీ హర్యానాలో గెలుపుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి దేశ రాజకీయాల్లో తన పార్టీకి బలమైన నాయకత్వం అందించగలరని నిరూపించుకుని ఆయన ఓటమిని ఆకాంక్షిస్తున్నవారు వెనక్కు తగ్గేలా చేశారు. జమ్ము కశ్మీర్‌తో పాటు హర్యానా ఎన్నికల్లో ఓడి ఉంటే మహారాష్ట్రలోనూ, పొరుగున ఉన్న ఢిల్లీలోనూ మోదీ తన బలం నిరూపించుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. అ తర్వాత మోదీకి ప్రత్యామ్నాయం గురించి కూడా దేశంలో తీవ్ర చర్చ జరిగేది. ప్రస్తుతానికి ఆ చర్చ అప్రస్తుతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికల తర్వాత తాను పుంజుకున్నానని నిరూపించేందుకు కాంగ్రెస్‌కు లభించిన ఒకే ఒక్క అవకాశాన్ని హర్యానాలో పోగొట్టుకుంది. తెలంగాణలో రేవంత్ రెడ్డిని రంగంలోకి దింపినట్లు కొత్తరక్తాన్ని, కొత్త నేతలను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా అందుకు ప్రయత్నించే ధైర్యం చేయలేదు. మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ లాంటి ఒకరిద్దరిని నిలబెట్టినా మొదటి జాబితాలోనే 28 మంది సిట్టింగ్ అభ్యర్థులను రంగంలోకి దించారు. బీజేపీ కొందరు రాష్ట్ర మంత్రులకు కూడా సీట్లు నిరాకరించే ధైర్యం చేస్తే కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి అయిదారు మంది పోటీపడ్డా సర్దుబాటు చేయలేని పరిస్థితిలో పడింది. ముఖ్యమంత్రి పదవిని ఆశించిన పీసీసీ అధ్యక్షుడు ఉదయభాను కూడా ఓడిపోయారు. రాహుల్, ప్రియాంక ఇద్దరూ హర్యానాలో విస్తృతంగా ప్రచారం చేశారు. వారి సభలకు జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాని వారిని ఓటు బ్యాంకుగా మళ్లించే వ్యూహరచన కాంగ్రెస్ చేయలేకపోయింది.

ఒకవైపు యువతను ఆకర్షించేందుకు నిరుద్యోగం వంటి వాటిని కాంగ్రెస్ ప్రస్తావించినప్పటికీ యువ నేతలకు సీట్లు ఇవ్వకపోతే ఏమి ప్రయోజనం? కులజనగణన, దళితుల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించి ఉండవచ్చు కాని మూడో వంతు సీట్లను జాట్లకు ఎందుకు కేటాయించాల్సి వచ్చింది? అయినా జాట్ల ఆధిపత్యం ఉన్న సీట్లలో కూడా కాంగ్రెస్ మెజారిటీ సీట్లు ఎందుకు సాధించలేకపోయింది? 1966లో హర్యానా ఏర్పడిన నాటి నుంచి 33 ఏళ్ల జాట్ ముఖ్యమంత్రులే పారిపాలించారు. ఒక్క భజన్‌లాల్ తప్ప జాట్ కాని వారు ఎక్కువకాలం పాలించలేకపోయారు. రాష్ట్రంలో 33 శాతం ఉన్న బీసీలు, 22 శాతం ఉన్న దళితులపై బీజేపీ పూర్తిగా దృష్టి కేంద్రీకరించి మూడోవంతు సీట్లను జాట్లు కాని వర్గాలకు కేటాయించింది. బీసీలకే 22 సీట్లు దక్కాయి. ఆరు నెలల క్రితమే బీసీ వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిగా నియమించిన బీజేపీ బ్రాహ్మణులు, పంజాబీ ఖత్రీలు, రాజపుత్రులు, వైశ్యులను కూడా దరిచేర్చుకుంది. అంతేకాక, క్రీమీలేయర్ పద్ధతిని సమర్థంగా ఉపయోగించి బీసీల్లో బాగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే చర్యలు చేపట్టింది. నిజానికి దేశ వ్యాప్తంగా ఓబీసీ ఓటు బ్యాంకును తమ వైపునకు తిప్పుకునేందుకు బీజేపీ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. సాధ్యమైనంత మేరకు ముఖ్యమంత్రులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులను ఓబీసీ వర్గాలనుంచే నియమిస్తోంది. జాట్ కాని వారందర్నీ సంఘటితం చేసే ప్రయత్నంలో బీజేపీ విజయవంతం కావడమే హర్యానాలో ఆ పార్టీ గెలుపునకు కారణమని అంటున్నారు.

> ఆరు నెలల క్రితమే బీసీ వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిగా నియమించిన బీజేపీ-బ్రాహ్మణులు, పంజాబీ ఖత్రీలు, రాజపుత్రులు, వైశ్యులను కూడా దరిచేర్చుకుంది. క్రీమీలేయర్ పద్ధతిని సమర్థంగా ఉపయోగించి బీసీల్లో బాగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే చర్యలు చేపట్టింది. జాట్ యేతర సామాజిక వర్గాలను సంఘటితం చేసే ప్రయత్నంలో బీజేపీ విజయవంతం కావడమే హర్యానాలో ఆ పార్టీ గెలుపునకు కారణమని అంటున్నారు.

బీజేపీకి గత లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు మాత్రమే వచ్చాయని ఆనందిస్తున్న కాంగ్రెస్, ఆ పార్టీకి ఓట్లు 37.3 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే తగ్గాయని గుర్తించాలి. అఖిల భారత స్థాయిలో బీజేపీ ఆదరణ అనుకున్నంత తగ్గలేదు. కనుక బీజేపీతో ఆ పార్టీ ఇంకా సుదీర్ఘ కాలం బలంగా పోరాడాల్సి ఉంటుంది. ఒకరకంగా హర్యానాలో కాంగ్రెస్ బాగానే ఘర్షించి, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్న అధికార పార్టీకి ముచ్చెమటలు పుట్టించిందనే చెప్పాలి. కాని విజయం సాధించదగ్గ ప్రణాళికను కాంగ్రెస్ అమలు చేయలేకపోయింది. ఒడిషాలో అధికారం సాధించి, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ ఓటు బ్యాంకు పెంచుకుంటే కాంగ్రెస్ తాను బలంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా నిలదొక్కుకోలేకపోతోంది. మరో ఒకటి రెండునెలల్లో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఢిల్లీల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తే కాంగ్రెస్ శ్రేణులు మరింత నీరుకారిపోక తప్పదు. అప్పుడు ఇండియా కూటమిలో కూడా లుకలుకలు ఏర్పడుతాయి. 'హర్యానా చిన్న రాష్ట్రమైనా ఒక కీలక సమయంలో జరిగిన ఆ రాష్ట్ర ఎన్నికలు మోదీకి తిరుగులేని బలాన్ని చేకూర్చాయి. ఈ విజయం ప్రాతిపదికగా ఆయన మహారాష్ట్రలో కూడా గెలిచేందుకు ప్రతిపక్ష శిబిరాన్ని కకావికలు చేసేందుకు మరిన్ని ప్రయత్నాలు చేస్తారు' అని ఒక ముఖ్యమంత్రి మంగళవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ తన భవిష్యత్ కార్యాచరణపై మరింత ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వ్యవసాయ ఉత్పత్తులా? కాలకూట విషాలా?

ఆహార భద్రత, పోషకాహారంపై 2011లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఒక పరిశీలన ప్రారంభించింది. భారతదేశ జనాభాలో 74.1 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందటం లేదని తేల్చింది. గత ఏడాది విడుదలైన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానం (మొత్తం 125 దేశాల్లో)లో ఉంది.

ఈ శతాబ్ది మధ్య నాటికి దేశ జనాభా 172 కోట్లకు చేరుకుంటుంది. ఇందుకు అనుగుణంగా తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆహారధాన్యాలు, కూరగాయలు, పాల ఉత్పత్తి పెరగాలి. వాతావరణ మార్పులు సంభవిస్తే ఉత్పత్తిపై ప్రభావం ఉండొచ్చు. ఉదాహరణకు 2021లో 113 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా, 2022లో 107 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఉత్పత్తి తగ్గిపోతే దాని ప్రభావం ఆకలిపై పడుతుంది. 2050 నాటికి ఆకలితో బాధపడే వారి సంఖ్య 11 నుంచి 20 శాతం వరకు పెరగవచ్చు. దేశంలో 2022 నుంచి తీవ్రమైన వడగాడ్పులు సర్వసాధారణమైపోయాయి.

ఈ ఉష్ణోగ్రతకు కారణాలు నవీన నాగరికత పేరుతో ఎన్నో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు, పురుగు మందుల కంపెనీలు. అలాగే స్వతంత్ర భారతావనిలో హరిత విప్లవం, క్షీర విప్లవం వల్ల వాతావరణ కాలుష్యంతో భూమి వేడెక్కడం ఆరంభమైంది. 1960లలో ఆరంభమైన హరిత విప్లవం ప్రజల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపింది. ఆహార కొరత తీర్చాలంటే ఉత్పాదకత పెరగాలని ఎక్కడో మెక్సికోలో సంకరం చేసిన కొత్త వంగడాల్ని తీసుకొచ్చి పంజాబ్, హర్యానాలలో మన దేశవాళీ వంగడాలతో సంకరం చేసి కొత్త వంగడాల్ని తయారుచేసి ఉత్పాదకత ఎక్కువ వస్తుందని రైతులకు ఆశచూపి నూతన వంగడాలు వేయించారు. వాటికి మెల్లగా రసాయన ఎరువులు వాడించారు. ఈ వంగడాలకు రోగనిరోధక శక్తిలేక తెగుళ్లు వస్తే పురుగు మందులు చల్లించారు. ముందు రైతులు ఒప్పుకోకపోయినా తరువాత అలవాటు పడిపోయారు. దాంతో నిదానంగా అన్ని రాష్ట్రాలలో ఆహార ధాన్యాలను సంకరం చేసి వాడించారు. ఆ విషపూరిత ఆహార పదార్థాలు తినడం వల్ల రోగగ్రస్త భారతావని తయారయింది. ప్రభుత్వాలు, పార్టీలు ఎన్ని మారినా ఈ రోజు వరకూ ఈ అనారోగ్యాలకు మూలకారణాలు పట్టించుకోవడం లేదు. భూమి విషపూరితమవుతూనే ఉంది. 147 మిలియన్ హెక్టార్ల భూమి ఇప్పటికే సారాన్ని కోల్పోయింది. వాతావరణ మార్పులు దీనికి మరింత ఆజ్యం పోస్తున్నాయి.



ఈ నేపథ్యంలో 2050 నాటికి వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం బీడుగా మారే ప్రమాదం పొంచి ఉంది. అంతిమంగా అది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుంది. భూమిలో లవణాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా ఆహారభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, దీంతో ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2012–14లో వేసిన ఓ అంచనా ప్రకారం భూమిలో లవణాలు పేరుకుపోవడంతో అప్పటికి 16.84 మిలియన్ టన్నుల వ్యవసాయోత్పత్తులకు నష్టం చేకూరింది. పులిమీద పుట్రలా జలవనరుల లభ్యత కూడా తగ్గిపోతోంది. హరిత విప్లవంతో రైతులు గోధుమ, వరి పండించడం వల్ల ఎక్కువ నీటి వాడకం జరుగుతోంది. దేశంలో లభ్యమవుతున్న భూగర్భ జలాల్లో 89 శాతం వ్యవసాయానికే ఖర్చు అవుతున్నాయి.

జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులు పెరగకపోతే మన ఎగుమతులు తగ్గించుకోవడంతో పాటు, నిత్యావసరాలను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇది మన విదేశీ వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే మనం పప్పులు, వంటనూనెలు పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నాం. ఓ అంచనా ప్రకారం జనాభా అవసరాలు తీర్చాలంటే 2030 నాటికి 311 మిలియన్ టన్నులు, 2050 నాటికి 350 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను మన దేశం ఉత్పత్తి చేయాలి. అందుకోసం ఉత్పాదకతనైనా లేదా సాగుభూమినైనా పెంచాలి. భవిష్యత్తులో ఆకలి కేకలు నివారించేందుకు ప్రభుత్వాలు వాస్తవాలు గ్రహించాలి.

1980 తర్వాత దాదాపుగా ప్రకృతి వ్యవసాయం కనుమరుగైంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, సంకరజాతి విత్తనాల వల్ల పండించిన పంటలు, కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు తినడం వల్ల దేశ జనాభాలో 80 శాతానికి మధుమేహం, కాలేయవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్లు, ఇంకా అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. వీటి బారి నుంచి బయటపడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. దేశీ వంగడాల్ని మాత్రమే వాడేలా చూడాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిలో పేరుకుపోయిన లవణాలు రెండు మూడేళ్లలో నిర్మూలించవచ్చు. అలాగే విషరహిత ఆహారాన్ని పండించడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన భారతావనిని తయారు చేయవచ్చు. అందుకే రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి ఆరోగ్యానికి మార్గదర్శకులు కావాలి.

• శిరిపురపు లలితాప్రసాద్
రక్షణ రంగ విశ్రాంత ఉద్యోగి

జైళ్లలో కుల సంకెళ్లు సిగ్గుచేటు

దేశంలోని జైళ్లలో కుల వివక్ష కొనసాగడం దౌర్భాగ్యం. ఖైదీలకు కులాల వారీగా పనుల అప్పగింత, వసతి ఏర్పాటు నేటికీ అధికారికంగా కొనసాగుతుందని తెలిసినప్పుడు ఆశ్చర్యమేసింది. పౌరులంతా సమానమేనంటూ రాజ్యాంగం రాసుకొని దశాబ్దాలైనా ఈ విష సంస్కృతి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడిచిపోవడం దారుణం. సుప్రీంకోర్టు ఇటీవల అన్ని రాష్ట్రాలకూ, కేంద్రానికీ ఈ విపరీత పోకడ కొనసాగరాదని, అందుకు అవసరమైన మార్పుల్ని జైలు మాన్యువల్స్‌లో ప్రవేశపెట్టాలని తాఖీదునివ్వడం అభినందనీయం. జైలు గోడల మధ్య జరిగే కుల వివక్ష దృష్టికి వస్తే, దాన్ని విచారణకు అర్హమైన కేసుగా పరిగణించాలని కోర్టులకు, అధికార యంత్రాంగానికి సూచించడం మంచి పరిణామం. సమాజం కుల రహితంగానో, అన్ని కులాల్ని సమానంగా చూసే స్థితికి చేరడంగానో అయ్యేందుకు సమయం పడుతుంది. అంత బలమైన వ్యవస్థను మార్చడానికి ఎన్నో సంస్కరణలు రావాలి. చట్టాల ద్వారా, చైతన్యం ద్వారా ఆ మార్గంలో నడిచేందుకు రాజ్యాంగం వీలు కల్పించింది. అంటరానితనం నేరంగా పరిగణించినా, సమానత్వ హక్కులు, ప్రత్యేక హక్కులు పొందుపర్చినా ఆ కృషిలో భాగమే. వాటిని కాపాడి, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వాలు ఇలాంటి వివక్షాపూరిత నిబంధనల్ని కొనసాగించడం సమాజాన్ని వెనక్కి నడిపించడమే. 'సుప్రీం' ఈ తప్పుని సరిచేసింది

– డివిజి శంకరరావు, విజయనగరం

రేపు బహుజనుల సమావేశం

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి కృష్ణా-గుంటూరు, పూర్వపు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు 2025 మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. అదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు కూడా ఎన్నికలు జరుగుతాయి. దీనికి సంబంధించి ఓటర్ల నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ ఆరు వరకు కొనసాగుతుంది. బహుజన పట్టభద్రులందరూ తక్షణమే తమ ఓట్లు నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఓటర్లుగా నమోదు చేయించుకోకపోతే ఎన్నికల పోరాటంలో బహుజనులు బలహీనమవుతారని గ్రహించాలి.

ఇప్పటికీ బహుజనులకు ఒక బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వతంత్ర ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను కూడ తీసుకోవాలి. దీనినొక రాష్ట్రస్థాయి కార్యక్రమంగా భావించి సన్నాహాలు చేయాలి. అందుకోసం ఒక సమావేశం జరగాలి. ఎన్నికల్లో పాల్గొంటున్న లక్ష్యాన్నీ ప్రణాళికను నిర్ధారించుకోవాలి. బహుజన (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ)లకు రాజ్యాధికారం లేకపోవడం వల్ల పీడన, అణచివేత, దోపిడీలకు గురవుతున్న విషయం తెలిసిందే. బహుజనులకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ రాజ్యాధికార లక్ష్యంతో సద్వినియోగం చేసుకోవడం విజ్ఞత అవుతుంది. ఒక సంవత్సర కాలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా బహుజనులు స్వతంత్ర శక్తిగా పాల్గొని సత్తా చాటాలి. రాజకీయ ప్రాతినిధ్యాలు సాధించుకోవాలి. ఆ విధంగా 2029లో జరిగే సాధారణ ఎన్నికల నాటికి ఒక బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బహుజనులు రూపొందాలి.

ఈ నేపథ్యంలో 'బహుజన రాజకీయ పార్టీల, సంస్థల ప్రతినిధుల, ప్రముఖుల రౌండ్ టేబుల్ సమావేశం' ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగనున్నది. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సమావేశానికి బహుజన రాజకీయ పార్టీల, సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, మేధావులు తప్పక పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.

– వై.కె
కన్వీనర్ – సామాజిక న్యాయకేంద్రం

బీసీల అభివృద్ధే కాన్షీరామ్ లక్ష్యం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతి కాలంలో భారత రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసి, తన జీవితం మొత్తాన్ని వెనకబడిన తరగతులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికే అంకితం చేసిన మహానుభావుడు కాన్షీరామ్. ఈ అణగారిన వర్గాలన్నింటినీ ఏకతాటి మీదకు తీసుకొచ్చి, భారతీయ సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన అగ్రకుల రాజకీయ ఆధిపత్యాన్ని సవాలు చేయాలన్నదే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడైన కాన్షీరామ్ లక్ష్యం. సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక సాధికారత అనే ఆలోచనలతోనే బీసీల ఎదుగుదల సాధ్యమన్నది ఆయన దార్శనికత. భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, జ్యోతిబా పూలే, సాహు మహారాజ్, నారాయణ గురు, పెరియార్‌లు కాన్షీరామ్ వైఖరిపై సైద్ధాంతికంగా, వ్యూహాత్మకంగా తీవ్ర ప్రభావం చూపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతర అణగారిన వర్గాలతో కలిపి.. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి విశాల ఉద్యమంగా మార్చగలగడం కాన్షీరామ్ నాయకత్వ సామర్థ్యానికి మచ్చుతునక. సామాజిక న్యాయం, రాజకీయ అధికారం కోసం పోరాటంలో ఈ వర్గాలన్నింటినీ ఏకం చేసే రాజకీయ వేదికను సృష్టించడమే ఆయన ఉత్తరప్రదేశ్‌లో సాధించిన ఘన విజయం.

కాన్షీరామ్‌పై అంబేడ్కర్ ప్రభావం లోతైనది, శాశ్వతమైనది. భారతదేశంలో ఎస్సీ, ఇతర బహుజనుల హక్కుల కోసం గళం వినిపించిన అంబేడ్కర్.. కుల వ్యవస్థను, అది కొనసాగిస్తున్న సామాజిక అసమానతలను, రుగ్మతలను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించే తరుణంలో న్యాయ, సంస్థాగత సంస్కరణల ద్వారా అణగారిన వర్గాల హక్కులను పరిరక్షించడంపై ఆయన దృష్టి సారించారు. భారతదేశ పురోభివృద్ధికి కుల నిర్మూలన, సామాజిక న్యాయం సాధన అత్యంత అవసరమని అంబేడ్కర్ విశ్వసించారు. బీసీలు, ఇతర అణగారిన వర్గాల సాధికారత కోసం కాన్షీరామ్ చేసిన ప్రయత్నాలకు 'విద్యావంతులు, ఉద్యమించండి, సంఘటితం కండి' అనే ఆయన మంత్రం మార్గదర్శక సూత్రంగా మారింది.

కాన్షీరామ్ అవలంబించిన కీలక పాఠాల్లో అంబేడ్కర్ గట్టిగా వాదించిన రాజకీయ ప్రాతినిధ్యం ఒకటి. రాజకీయాధికారం లేకపోతే భారత ప్రజాస్వామ్యంలో అణగారిన వర్గాల గొంతు వినిపించకుండా పోతుందని అంబేడ్కర్ గుర్తించారు. అలాగే రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయి ఆ వర్గాలు సామాజిక ఉనికిని కూడా కోల్పోతాయని అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల కోసం ఆయన చేసిన ప్రయత్నం వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పట్టు ఉండేలా చూడడంలో ఒక మంచి ముందడుగు. కాన్షీరామ్ ఈ విధానంతో ప్రేరణ పొంది, రాజకీయ ప్రాతినిధ్యాన్ని కేవలం చేరిక సాధనంగా కాకుండా పరివర్తనకు ఒక సాధనంగా చూశారు.

అణగారిన వర్గాలకు, ముఖ్యంగా బీసీలకు కాన్షీరామ్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్‌ని సీఎం పీఠంపై కూర్చోపెట్టడం అందుకు తార్కాణం. 'బహుజన' అనే పదానికి మెజారిటీ అని అర్థం. అణగారిన వర్గాలన్నింటినీ ఒకే రాజకీయ గొడుగు కిందకు తీసుకురావాలనే కాన్షీరామ్ ఆలోచనను ఇది ప్రతిబింబించింది. భారత జనాభాలో గణనీయ భాగమైన బీసీలు చారిత్రకంగా సామాజిక-రాజకీయ శ్రేణిలో వెనుకబడి ఉన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించడానికి, నిజమైన సమానత్వాన్ని నిర్ధారించడానికి బీసీల సాధికారత కీలకమని కాన్షీరామ్ గుర్తించారు.

> బీసీల సాధికారత విషయంలో కాన్షీరామ్ అనుసరించిన విధానం మౌలికంగా రాజకీయమే. రాజకీయాధికారం లేకపోతే ఏ సామాజిక సంస్కరణలతో సంబంధం లేకుండా బీసీలు అణచివేతకు గురవుతూనే ఉంటారని ఆయన విశ్వసించారు. బీసీల్లో సంఖ్యాబలం, సమిష్టి రాజకీయ కార్యాచరణ సామర్థ్యంపై అవగాహన కల్పించడం ఆయన వ్యూహం.



బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కింద ఎస్సీ, ఎస్టీ, బీసీల ఏకీకరణ కాన్షీరామ్ భారత రాజకీయాలకు చేసిన అత్యంత ముఖ్యమైన సహకారం. ఎస్సీ, బీసీలు మాత్రమే కాకుండా ముస్లింలు, గిరిజనులు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలతో కూడిన బహుజన ఉద్యమం – అణగారిన వర్గాల సంకీర్ణాన్ని సృష్టించడం ఆయన వ్యూహం. ఈ సమూహాల సంఖ్యాబలంపై దృష్టిపెట్టడం ద్వారా, కాన్షీరామ్ అగ్రకులాల ఆధిపత్యాన్ని, ముఖ్యంగా హిందీ మాట్లాడే ప్రాంతాల్లో సవాలు చేయగల మెజారిటీని స్థాపించడానికి ప్రయత్నించారు. ఆ క్రమంలోనే ముందుగా ములాయంసింగ్ యాదవ్, ఆ తరువాత మాయావతి సీఎం అయ్యారు.

బీసీల సాధికారత విషయంలో కాన్షీరామ్ అనుసరించిన విధానం మౌలికంగా రాజకీయమే. రాజకీయాధికారం లేకపోతే ఏ సామాజిక సంస్కరణలతో సంబంధం లేకుండా బీసీలు అణచివేతకు గురవుతూనే ఉంటారని ఆయన విశ్వసించారు. బీసీల్లో సంఖ్యాబలం, సమిష్టి రాజకీయ కార్యాచరణ సామర్థ్యంపై అవగాహన కల్పించడం ఆయన వ్యూహం. బీసీలు జనాభాలో గణనీయమైన భాగం అయినా, రాజకీయ ప్రాతినిధ్యం లేదని, అంతర్గత విభేదాల కారణంగా తరచూ చీలిపోయారని ఆయన అర్థం చేసుకున్నారు. బీసీలను సంఘటితం చేయడానికి కాన్షీరామ్ చేసిన ప్రయత్నాలు కుల విభేదాలకు అతీతమైన రాజకీయ చైతన్యాన్ని సృష్టించడంపై దృష్టి సారించాయి.

అంబేడ్కర్ లాగే కాన్షీరామ్ కూడా సాధికారత సాధనంగా విద్యకు పెద్దపీట వేశారు. విద్య అందుబాటులో లేకపోతే బీసీలు పేదరికం, అణచివేత చట్రంలో కూరుకుపోతారని ఆయన గ్రహించారు. విద్య అనేది బీసీలకు ఆర్థిక అవకాశాలను అందించడమే కాకుండా శతాబ్దాలుగా వారిని అణగదొక్కుతున్న సామాజిక శ్రేణులను సవాలు చేయడానికి సహాయపడుతుందని ఆయన విశ్వసించారు.

మండల్ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం ఫలితంగా వీపీ సింగ్ ప్రభుత్వం దిగి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు దశాబ్దాలకు 1993లో ఓబీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. కాన్షీరాం తమ మద్దతు వీపీ సింగ్ ప్రభుత్వానికి ఉపసంహరిస్తానని అనడంతోనే ఓబీసీ రిజర్వేషన్లు సాధ్యమయ్యాయి. కానీ బీజేపీ కమండల్ ఉద్యమంతో బీసీలకు చేటు చేసింది. మోదీ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల ఇచ్చి బీసీలకు ఇవ్వాల్సిన 50 శాతం రిజర్వేషన్లకి ఎగనామం పెట్టింది. కుల జనగణన చేయకుండా తాత్సారం చేస్తున్నది. ఇక్కడే బీసీలు కాన్షీరాం పోరాట పద్ధతుల్ని ఆకళింపు చేసుకొని కార్యక్షేత్రంలో దిగాలి. బీఎస్పీ పార్టీతో కలిసి నడవాలి. బీసీలకు విద్యతో పాటు ఆర్థిక సాధికారత ప్రాధాన్యాన్ని కాన్షీరామ్ గుర్తించారు. బీసీలు సహకార సంఘాలు, చిన్న వ్యాపారాల్లాంటి సొంత ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని కాన్షీరామ్ నొక్కి చెప్పారు.

కాన్షీరామ్ ఎంతగా ప్రయత్నించినా బీసీలను ఒకే రాజకీయ వేదిక కింద ఏకం చేసే పని అనేక సవాళ్లతో కూడుకున్నది. బీసీ సామాజికవర్గంలోనే అంతర్గత విభేదాలు ఇందుకు ప్రధాన అడ్డంకిగా మారాయి. బీసీలు ఏకశిలా సమూహం కాదు. వారిలో అనేక ఉపకులాలు ఉన్నాయి. ప్రతి ఒక్కటీ తన సొంత సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ఈ విభజనలు బీసీలందరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఏకీకృత రాజకీయ ఉద్యమాన్ని సృష్టించడం కష్టతరం చేశాయి. అంతేకాక కుల వ్యవస్థ, దాని కఠినమైన వారసత్వం, సామాజిక శ్రేణితో బీసీలను చిరకాలంగా విచ్ఛిన్నం చేస్తూనే ఉంది. ఎన్ని సవాళ్లు ఎదురైనా బీసీలు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జరిగే ఉద్యమాలకు కాన్షీరామ్ వారసత్వం స్ఫూర్తినిస్తూనే ఉంది. రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక సాధికారత, సామాజిక ఐక్యతపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యత నేటికీ సముచితంగానే ఉంది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటాన్ని భావితరాలు కొనసాగించడానికి కాన్షీరామ్ కృషి పునాది వేసింది.

కాన్షీరామ్, ఆ తర్వాత మాయావతి నాయకత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో గణనీయమైన రాజకీయ విజయాన్ని సాధించింది. కొన్నేళ్లుగా పార్టీ భవితవ్యం ఒడిదుడుకులకు లోనైనా బీసీలను, ఇతర అణగారిన వర్గాలను రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో దాని పాత్ర ఎంతైనా ఉంది. బహుజన సమాజానికి గొంతును ఇచ్చే రాజకీయ వేదికను సృష్టించడానికి కాన్షీరామ్ చేసిన ప్రయత్నాలు భారత రాజకీయాలపై చెరగని ముద్ర వేశాయి.

అంతేకాక, బీసీల సాధికారతకు కాన్షీరామ్ ముందుచూపు ఇతర రాజకీయ ఉద్యమాలు, పార్టీలను సైతం ప్రభావితం చేసింది. అవి కూడా అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం పోరాడడం మొదలుపెట్టాయి. క్షేత్రస్థాయి రాజకీయ సంస్థలు రావాలని, స్థానిక నాయకత్వం అభివృద్ధి చెందాలని ఆయన నొక్కి చెప్పిన పలు అంశాలను ఇతర ఉద్యమాలు అందిపుచ్చుకున్నాయి. ఇలా బహుముఖంగా జరిగే పోరాటం బహుజనులకు, ముఖ్యంగా బీసీలకు పూర్తి సాధికారతను అందిస్తుంది.

■ డా. జె. పూర్ణచంద్రరావు
రిటైర్డ్ డీజీపీ, బీఎస్పీ ఏపీ కో-ఆర్డినేటర్
(నేడు కాన్షీరామ్ వర్ధంతి)



గరుడసేవకు హాజరైన భక్తజనం

కమనీయం గోవిందుడి గరుడోత్సవం

- ఇష్ట వాహనంపై భక్తకోటికి సర్వాంతర్యామి దర్శనం
- వజ్ర, స్వర్ణాభరణాలతో తేజోమూర్తిగా మలయప్ప
- మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి దాదాపు 2 లక్షల మంది
- భక్తులు దూసుకురావడంతో తోపులాటలు
- ఉదయం మోహినీ అవతారంలో స్వామి విహారం

తిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడ వాహనసేవ మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. సర్వాంతర్యామి రూపంలో మలయప్ప వజ్రవైఢూర్యాభరణాల అలంకరణతో తన ఇష్టవాహనమైన గరుడుడిని అధిరోహించి భక్తకోటికి దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకే నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆ తర్వాత మాడవీధుల గేట్లను మూసివేశారు. సాయంత్రం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో మలయప్పకు పట్టుపీతాంబరాలు, వజ్ర, స్వర్ణాభరణాలను అలంకరించి విశేష సమర్పణ అనంతరం వాహన మండపానికి వేంచేపు చేశారు. మలయప్పను గరుడుడిపై అధిష్ఠింపజేసి విశేషమైన ఆభరణాలు, భారీ గజమాలతో తేజోమయంగా అలంకరించారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈసారి గరుడ వాహనసేవను సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించారు. వాహన మండపం తెరతీయగానే ఒక్కసారిగా భక్తులు పెద్దపెట్టున చేసిన గోవింద నామస్మరణతో సప్తగిరులు మార్మోగాయి.

అదనపు క్యూలైన్ల వద్ద తోపులాటలు

దాదాపు 2లక్షల మంది గ్యాలరీల్లోకి చేరడంతో ప్రవేశ మార్గాలన్నీ మూసివేశారు. ఎలాగైనా మాడవీధుల్లోకి ప్రవేశించాలని కొంతమంది గేట్లు ఎక్కి దూకగా, మరికొంతమందిని పోలీసులు అడ్డుకున్నారు. ఎస్వీ మ్యూజియం ప్రాంతంలో భక్తులను విపరీతంగా నెట్టారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు అని కూడా లేకుండా లాగేయడంతో మాడవీధుల్లోకి రాలేకపోయిన భక్తుల్లో కొంతమంది భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. గ్యాలరీలలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో భక్తులు గరుడ వాహన దర్శనం కోసం ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్లపైనే ఆధారపడ్డారు. భారీగా ప్రవేశమార్గాల వద్దకు చేరుకున్నారు. వల్లభాచార్యమఠం, రాఘవేంద్రమఠం ముందున్న ఎంట్రీ పాయింట్ల వద్ద చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర అగచాట్లు పడ్డారు. లోపలికి ప్రవేశించేందుకు భక్తులు ముందుకు దూసుకురావడంతో తోపులాటలు జరిగాయి. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడి భరించలేక పలువురు భక్తులు ఆర్తనాదాలు చేశారు. సుమారు గంటన్నర పాటు ఈ పరిస్థితి కొనసాగింది. తర్వాత పోలీసు ఉన్నతాధికారులు రద్దీని క్రమబద్ధీకరించారు.


గరుడ వాహనంపై వేంచేసిన మలయప్ప స్వామికి హారతి

శృంగార రసాధి దేవతగా స్వామి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామి శృంగారరసాధి దేవతగా భక్తకోటికి దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అతిలోకసుందరి అయిన మోహినీ రూపాన్ని దాల్చి మలయప్ప శ్రీకృష్ణస్వామి సరసన తిరువీధుల్లో విహరించారు. కలియుగ దేవదేవుడు నాచ్చియార్ తిరుకోళంగా పిలిచే బంగారు చిలుకను చేతపట్టుకున్నారు. శ్రీవిల్లిపుత్తూరు మాలలను ధరించారు. శ్వేత వస్త్రధారణతో దంతపల్లకీలో ఆసీనులయ్యారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామి హనుమంత వాహనం, రాత్రి గజ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. సాయంత్రం 4నుంచి 5 గంటల మధ్య స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు.

వాహన సేవల్లో పాల్గొన్న జస్టిస్ వేణుగోపాల్


తిరుమల ఆలయం ముందు జస్టిస్ వేణుగోపాల్

తిరుమల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో మంగళవారం ఉదయం జరిగిన మోహినీ అవతారం.. రాత్రి గరుడ వాహన సేవల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మీ దేవిగా కనకదుర్గమ్మ



విజయవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. అమ్మవారి జన్మ నక్షత్రం మూల రోజున సరస్వతీదేవిగా కనిపించే కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలిరానున్నారు.

కాత్యాయనీదేవిగా భ్రమరాంబ



శ్రీశైలం, అక్టోబరు 8: దసరా మహోత్సవాల్లో భాగంగా నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబిక దేవి ఆరో రోజు మంగళవారం కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం హంస వాహనంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి విహరించారు.

రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదం

- ప్రముఖ న్యాయవాది ఎస్ఆర్పీ సతీమణి దుర్మరణం
- విహారయాత్రకు వెళ్లిన న్యాయవాదులు
- ట్రక్‌ను ఢీ కొట్టిన బస్సు.. పలువురికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు, మృతి చెందిన సుంకర జోత్స్న

విజయవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విహారయాత్ర కోసం రాజస్థాన్ వెళ్లిన విజయవాడ న్యాయవాదుల బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ప్రముఖ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, సేఫ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జ్యోత్స్న దుర్మరణం చెందారు. కోర్టులకు దసరా సెలవులు ఇవ్వడంతో బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు విహార యాత్ర కోసం రాజస్థాన్ వెళ్లారు. 77 మంది న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు విజయవాడ నుంచి ఈ నెల రెండో తేదీన రైలులో రాజస్థాన్ వెళ్లారు. మూడో తేదీన జైపూర్ నుంచి ట్రావెల్స్ కంపెనీకి చెందిన రెండు బస్సుల్లో పర్యటించారు. బస్సులు సోమవారం జోధ్‌పూర్ నుంచి జైపూర్ వెళుతుండగా.. ముందు వెళ్తున్న బస్సు ఆగి ఉన్న ఓ లారీని ఢీ కొట్టింది. ఆ తర్వాత మరో లారీని కూడా ఢీ కొట్టింది. రాజేంద్రప్రసాద్, ఆయన సతీమణి జ్యోత్స్న డ్రైవర్ వెనుక సీట్లలో కూర్చున్నారు. ప్రమాదంలో వారి సీటు వద్ద ఉన్న కిటికీ అద్దం పగిలిపోగా అక్కడ నుంచి జ్యోత్స్న కిందపడి చనిపోయారు. స్థానికులు, వెనుక బస్సుల్లో ఉన్న న్యాయవాదులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌ను సీఎం కార్యాలయం అప్రమత్తం చేసింది. చంద్రబాబు రాజస్థాన్ సీఎంతో ఫోన్‌లో మాట్లాడారు.

సీఎం దిగ్భ్రాంతి

జ్యోత్స్న మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహిళా సాధికారత కోసం ఉద్యమించిన జ్యోత్స్న మృతి తీవ్రంగా కలిచి వేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. జ్యోత్స్న మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ఎస్ఆర్పీ భార్య జ్యోత్స్న మరణం విచారకరం. గాయపడిన న్యాయవాదులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

ఐలూ సంతాపం

రాజేంద్రప్రసాద్ భార్య జోత్స్న మృతికి ఐలూ సంతాపం తెలిపింది. ఐలూ ప్రెసిడెంట్ కె.కుమార్, జనరల్ సెక్రటరీ నల్లూరి మాధవరావు తదితరులు సంతాపం తెలిపారు. జోత్స్న మృతదేహాన్ని బుధవారం సాయంత్రం వరకు ప్రజల సందర్శనార్థం పుష్ప హోటల్ రోడ్డులోని నివాసంలో ఉంచుతారని తెలిపారు.

విజేతలకు జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానం


మిథున్ చక్రవర్తి


నిత్యా మీనన్


అభిషేక్ అగర్వాల్, నిఖిల్

జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. 2022 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసిన విషయం విదితమే. ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి (కాంతార), ఉత్తమ నటి అవార్డును నిత్యా మీనన్ (తిరుచిత్రంబలం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) సంయుక్తంగా రాష్టపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నిత్యా మాట్లాడుతూ 'దాదాపు పదిహేనేళ్ల కష్టానికి తగిన ప్రతిఫలం ఇది. నా సహ నటీనటులు, 'తిరుచిత్రంబలం' యూనిట్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నా' అన్నారు.

ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎన్నికైన 'కార్తికేయ 2' చిత్రానికి దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ అవార్డులు స్వీకరించారు. ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం) అవార్డును 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి గాను అందుకొన్నారు. 'నేను అందుకొన్న ఏడవ జాతీయ అవార్డ్ ఇది. ఇన్ని అవార్డులు తీసుకోవడానికి కారణమైన ఆ భగవంతుడికి, దర్శకనిర్మాతలకు నా కృతజ్ఞతలు' అన్నారు రెహమాన్. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా మిథున్ చక్రవర్తి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'ఈ రోజు దాదాపు 85 మంది అవార్డులు స్వీకరించారు. కానీ వాళ్లలో మహిళలు కేవలం 15 మందే ఉండడం విచారకరం. మహిళలు కూడా తమ ప్రతిభను ప్రదర్శించి చిత్ర పరిశ్రమలో తమ స్థానాన్ని బలపర్చుకోవాలి. సినిమాలు, సోషల్ మీడియా సమాజంలో మార్పు తీసుకువచ్చే మంచి సాధనాలుగా ఉపయోగపడాలి' అని అన్నారు.


రిషబ్ శెట్టి


ఏఆర్ రెహమాన్


మణిరత్నం


మానసి పరేఖ్


చందు మొండేటి

తగ్గేదేలా!



అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2.. ద రూల్' చిత్రం శరవేగంతో తయారవుతోంది. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప -ద రైజ్' ఘన విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టీ ఈ సినిమా మీదే ఉంది. అందుకే అంచనాలు అందుకొనేందుకు టీమ్ విశేషంగా కృషి చేస్తోంది. 'పుష్ప 2' ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేశామని అంటూ కీలకమైన అప్‌డేట్‌ను మంగళవారం విడుదల చేశారు మేకర్స్. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉందనీ, ప్రేక్షకులు ఎంత ఊహించుకున్నా అంతకు తగ్గేదేలే లా ఉందని అంటున్నారు. ఒక పక్క చిత్రీకరణ పూర్తి చేసుకుంటూనే మరో వైపు నిర్మాణానంతర పనులు శరవేగంతో జరుపుతున్నారు. డిసెంబర్ 6న చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు.

నిజమే గెలిచింది



తనతో పెళ్లికి నిరాకరించిందంటూ కథానాయిక మాల్వీ మల్హోత్రాపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనలో నిర్మాత యోగేశ్ సింగ్‌ను దోషిగా తేల్చిన ముంబై కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై మాల్వీ ఆనందం వ్యక్తం చేశారు. తన పోరాటం ఫలించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఈ పోరాటంలో ఎన్నో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొన్న నాకు తీర్పుతో ఉపశమనం లభించింది. నాలుగేళ్లుగా పోరాడుతున్నాను. ఎట్టకేలకు నిజం గెలిచింది. న్యాయం దక్కేవరకూ పోరాడే శక్తినిచ్చిన అమ్మవారికి ధన్యవాదాలు' అని మాల్వీ పేర్కొన్నారు. 2020లో తనతో పెళ్లికి నిరాకరించిందనే కారణంతో మాల్వీని అడ్డగించిన యోగేశ్ కత్తితో దాడి చేశాడు.

సమంతతో కలసి నటించాలనుంది


అలియా భట్

ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, ఆలియా భట్, సొమెన్ మిశ్రా నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను రాజమౌళి, రామ్‌చరణ్ విడుదల చేశారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా త్రివిక్రమ్, రానా దగ్గుబాటి, సమంత విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ "ఆలియా నటనంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల ప్రేమను అలియా ఈ సినిమాతో మరోసారి సంపాదించుకుంటారు" అని చెప్పారు. "ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్ సమంత ఓ హీరో. సమంతతో కలసి నటించాలనుంది. నాకు, ఆమెకు సరిపడా స్క్రిప్ట్‌ను త్రివిక్రమ్ రాస్తే బాగుండనిపిస్తోంది. ఇది యాక్షన్, డ్రామా, ఎమోషన్ ఉన్న ఇంటెన్స్ సినిమా" అని ఆలియా భట్ అన్నారు.

ఇద్దరూ నాకు ఇష్టమైన హీరోయిన్లే!



నాకు ఇష్టమైన ఇద్దరు హీరోయిన్లు అలియాభట్, సమంత ఇక్కడే ఉన్నారు. ఈ సినిమా ట్రైలర్ అదిరిపోయింది. ట్రైలర్ చూస్తుంటే సినిమా పక్కా బ్లాక్‌బస్టర్ అవుతుందని అనిపిస్తోంది. రజనీకాంత్ అన్ని భాషల్లోనూ అభిమానుల్ని సంపాదించుకున్నారని తెలిసిందే. సమంత కూడా అలాగే అన్ని భాషల్లోని అభిమానుల మనసును గెలుచుకున్నారని అనిపిస్తోంది. సమంత ముంబయిలోనే కాకుండా హైదరాబాద్‌కు కూడా అప్పుడప్పుడూ వస్తే బాగుంటుంది. సమంత నటిస్తానంటే.. ఆమె కోసం రాయడానికి సిద్ధం. 'అత్తారింటికి దారేది' లాగా.. సమంత హైదరాబాద్‌కు రావాలంటే 'హైదరాబాద్‌కు దారేది' అనాలేమో. సమంత మూవీ సెట్స్‌లో ఓ డైనమేట్‌లా ఉంటారు. ఈ కార్యక్రమంలో అలియా కూడా డైనమేట్‌లా కనిపిస్తున్నారు" అని చెప్పారు.

ప్రసాదంతో పాటు.. మొక్కలు ఇవ్వండి..

- డిప్యూటీ సీఎం పవన్‌కు షిండే సూచన



ఆలయాల్లో ప్రసాదంతో పాటు ఒక మొక్క కూడా భక్తులకు ఇస్తే పచ్చదనాన్ని పెంపొందించవచ్చు అనే షాయాజీ షిండే సూచనను స్వాగతిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ నటుడు షిండే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆలోచనలు విన్నపవన్‌కళ్యాణ్ ఇది అభినందనీయమైన ఆలోచన అని కొనియాడారు. ఆయనచేసిన సూచనల అమలుపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తామని చెప్పారు. వృక్షప్రసాద్ యోజనను మహారాష్ట్రలో మూడు ప్రముఖ ఆలయాల్లో అమలు చేస్తున్నారని షిండే వివరించారు. వాటి విశిష్టత గురించి మరాఠీలో రాసుకున్న కవితను పవన్‌కళ్యాణ్‌కు చదివి వినిపించారు. ఈ కవితను పవన్ కళ్యాణ్ ప్రశంసిస్తూ ఆ మరాఠీ కవితను తెలుగులో అనువదించి చెప్పారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

బామ్మను విమర్శించిన వ్యక్తికి అవార్డా?



కర్నాటక గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణకు ఈ యేడాది 'సంగీత కళానిధి' అవార్డును ప్రదానం చేయాలని మ్యూజిక్ అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, దివంగత కర్నాటక సంగీత దిగ్గజం ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మనవడు వి. శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తన బామ్మను తీవ్రంగా విమర్శించడంతో పాటు హేతువాదిగా ఉంటున్న కృష్ణన్‌కు ఆ అవార్డును ప్రదానం చేయడం తగదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని స్మరిస్తూ చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ, ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వాహకులు కలిసి 2005 నుంచి ప్రతియేటా ఆమె పేరుతో సంగీత కళానిధి అవార్డులను ప్రదానం చేయడం ఆనవాయితీ అని, అయితే ఆమెను తీవ్రంగా విమర్శించిన కృష్ణన్‌కు ఈ సారి అవార్డును ప్రదానం చేయకుండా ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టై జైల్లో ఉన్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను రంగారెడ్డి జిల్లా కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్‌కు లభించిన అవార్డును కమిటీ తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో తమకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ అవసరం లేదని ఆయన తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో జానీ మాస్టర్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్‌ను నార్సింగి పోలీసులు వెనక్కి తీసుకున్నారు. జాతీయ పురస్కార అందుకునేందుకు ఢిల్లీకి వెళ్లేందుకు ఈ నెల 6 నుంచి 9 వరకూ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. అయితే అవార్డును నిలిపివేయడంతో జానీ మాస్టర్ రిమాండ్‌లోనే కొనసాగుతున్నారు.

నాగసాధు పాత్రలో తమన్నా



'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న 'ఓదెల 2' చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. మహాదేవుని ఆశీస్సులతో వారణాసిలో ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఓదెల మల్లన్న క్షేత్రంలో జరుగుతోంది. తన కెరీర్‌లోనే తొలిసారిగా తమన్నా ఇందులో శివశక్తి(నాగసాధు) పాత్ర పోషిస్తున్నారు. ఆమెతో పాటు మురళీశర్మ, హెబ్బా పటేల్ తదితరులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. మల్లన్న ఆలయం, ఓదెల గ్రామంలోని అందమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది పర్యవేక్షణలో అశోక్ తేజ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని డి. మధు నిర్మిస్తున్నారు.

నవ్వుల్లో ముంచెత్తుతుంది


గోపిచంద్

"విశ్వం' సినిమాతో పాత శ్రీను వైట్లను మళ్లీ చూడబోతున్నారు. ఈ సినిమాలో యాక్షన్, ఫన్, కామెడీ అద్భుతంగా వచ్చాయి. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. 'విశ్వం' ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని హీరో గోపిచంద్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన చిత్రమిది. . టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ 'విశ్వప్రసాద్ గారి వల్ల సినిమాకు మరింత బలం చేకూరింది. శ్రీనువైట్ల స్క్రిప్ట్ మీద ఏడు నెలలు పని చేశారు. ఆయనతో పని చేయడాన్ని ఆస్వాదించాను' అని చెప్పారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ 'రెండున్నర గంటల్లో ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. విశ్వ ప్రసాద్, వేణు నిర్మాణంలో రాజీ పడలేదు. ఈ హిట్‌తో దసరాని ఎంజాయ్ చేయబోతున్నాం' అని చెప్పారు. 'నేను అమెరికాలో ఉన్నప్పుడే శ్రీను వైట్ల గారి సినిమాలు బాగా చూసేవాణ్ణి. ఇప్పుడు ఆయనతో ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమిది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. 'విశ్వం పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులకు పండుగ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది' అని కావ్యథాపర్ తెలిపారు.

మెషీన్ లెర్నింగ్‌కు భౌతిక శాస్త్ర నోబెల్

జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు


జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్

స్టాక్‌హోం, అక్టోబరు 8: భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లను వరించింది. కృత్రిమ నాడీ వ్యవస్థలతో మెషీన్ లెర్నింగ్‌ను సాధ్యం చేసేలా వీరిద్దరూ సిద్ధాంతపరమైన ఆవిష్కరణలకు రూపకల్పన చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను మరింత అభివృద్ధి చేసే దిశగా చేసిన కృషికి గానూ వీరిద్దరినీ నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్టు స్టాక్‌హోంలోని నోబెల్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఏఐ గాడ్‌ఫాదర్‌గా పేరొందిన హింటన్.. టొరంటో వర్సిటీలో పనిచేస్తున్నారు. ఆయనకు కెనడా, బ్రిటన్ పౌరసత్వం ఉంది. ఇక అమెరికాకు చెందిన హోప్‌ఫీల్డ్ న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ వర్సిటీలో పనిచేస్తున్నారు. నాడీ వ్యవస్థపై ఈయన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందాయి. వీరిద్దరూ అభివృద్ధి చేసిన మెషీన్ లెర్నింగ్ వ్యవస్థ హోప్‌ఫీల్డ్ నెట్‌వర్క్‌గా ప్రసిద్ధి చెందింది. హోప్‌ఫీల్డ్.. సమాచారాన్ని నిల్వ చేయగల, పునర్నిర్మించగల సామర్థ్యం కలిగిన ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించారు. హింటన్.. డేటాలోని లక్షణాలను సొంతంగా గుర్తించగల పద్ధతిని కనుగొన్నారు. భౌతికశాస్త్రంలో ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌ను అనేక రకాలుగా ఉపయోగిస్తారని, కొత్త పదార్థాలను అభివృద్ధి చేయడానికి వీరి పరిశోధనలు తోడ్పడతాయని నోబెల్ కమిటీ హెడ్ ఎలన్ మూర్స్ తెలిపారు.


ప్రయాణంలో తోడునీడగా..

హైవేల వెంట ఫుడ్‌కోర్టులు, ట్రామా సెంటర్లు, ఫార్మసీలు: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: జాతీయ రహదారిపై కార్లో వెళుతునప్పుడు సహజంగానే పిల్లలు ఆకలి అంటూ మారాం చేస్తుంటారు. వంటల్లో కల్తీ నూనె, నాసిరకమైన పదార్థాలు వాడతారనే భయంతో చిన్నారులపై పెద్దలు కస్సెర్ర చేస్తుంటారు. అయితే.. ఈ భయాలేవీ లేకుండా పిల్లలతో కలిసి పెద్దలు కూడా ఆ రోడ్డు పక్కనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫుడ్‌కోర్టులో భేషుగ్గా తినొచ్చు! అలాగే దారిలో అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు.. ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడకుండా రోడ్డు పక్కనే ట్రామా సెంటరూ ఉంటుంది! ఈటరీలు, ట్రామా సెంటర్లే కాదు.. ఇబ్బందుల్లేని, సుఖవంతమైన ప్రయాణం కోసం ఫార్మసీలు, పెట్రోలు బంకులు, ఏటీఎంలు, రిపేర్ షాపులు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఇలా ఎన్నో వసతులను పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయరహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల వెంబడి కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల వెంబడి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు ఉద్దేశించిన 'హమ్ సఫర్' పాలసీని మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. హమ్ సఫర్ సేవలు అందించేవాళ్లు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వారికి పలు మినహాయింపులు ఉంటాయి. ప్రయాణికులు 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ సాయంతో ఈ షాపుల లోకేషన్లను తెలుసుకోవచ్చు. అంతే కాకుండా షాపుల్లో, బంకుల్లో సేవలు, నాణ్యతపై ఈ యాప్ ద్వారా రేటింగ్ కూడా ఇవ్వొచ్చు. వీటిని తరచూ తనిఖీలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం ఉంటుంది. కాగా ఈ పాలసీ ఆవిష్కరణ సందర్భంగా గడ్కరీ మాట్లాడారు. రాన్నున్న రోజుల్లో రోడ్డు భద్రత, ప్రయాణ సౌకర్యాలకు 'హమ్ సఫర్' పర్యాయ పదంగా మారుతుందన్నారు. ఈ సౌకర్యాలన్నింటినీ పర్యావరణ హితమైన పద్ధతిలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హమ్ సఫర్ పాలసీతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు ఉద్యోగాల సృష్టి జరుతుందని గడ్కరీ చెప్పారు. "ఎవరైతే ప్రయాణికుల నుంచి టోల్ వసూలు చేస్తారో.. వాళ్లు ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలు కల్పించాలి" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పెట్రోలు బంకుల యజమానులు నిబంధనల ప్రకారం ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హైవేలపై ఉన్న పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడం తప్పనిసరని చెప్పారు. చాలా పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లకు తాళం వేసి ఉండటం తాను గమనించానని తెలిపారు. అలా ఉంటే పెట్రోల్ బంకులను మూసేస్తామని హెచ్చరించారు.



నేటి అలంకారం
శ్రీసరస్వతీదేవి
మూలానక్షత్రం






శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనకదుర్గమ్మ అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాత అయిన లక్ష్మీదేవిగా దర్శనమివ్వగా అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఒంటినిండా బంగారం, పుష్పాలంకరణలో ఐశ్వర్య ప్రదాయిని రూపాన్ని తిలకించి తరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కళాకారిణి నృత్య భంగిమ

కృష్ణమ్మకు హారతి



శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనం





దుర్గమ్మ నగరోత్సవం

ఐశ్వర్య ప్రదాయిని

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి ఆలయ పరిసరాలు, కంపార్ట్‌మెంట్లలో పోటెత్తిన భక్తులు



మంగళవారం పెరిగిన రద్దీ | సందడిగా క్యూలైన్లు, పరిసరాలు | శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మ దర్శనం

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రుల్లో ఆరో రోజు మంగళవారం ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు నిండిపోయాయి. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శివస్వామి, సినీనటి హేమ దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల నుంచి పట్టుచీర సమర్పించారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం సాధారణంగానే కనిపించింది. మామూలు రోజుల్లో ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తులు అధికంగా వస్తుంటారు. ఈ రోజుల్లో 50 వేల నుంచి 60 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటుంది. ఆ స్థాయిలోనే భక్తులు వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ రూ.500 క్యూలో వచ్చి రాజగోపురం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారి సందడి ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి కాణిపాకం దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనధికార దర్శనాలు పెరిగిపోవడంతో పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. వీఐపీలకు కేటాయించిన 9-11, 2-4 స్లాట్‌ల్లో కాకుండా ఇతర సమయాల్లో వస్తే వారిని వీఐపీ మార్గంలో దర్శనాలకు అనుమతించడంలేదు. వారిని రూ.500 క్యూలో పంపుతున్నారు. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మూలా నక్షత్రం.. అందరికీ సర్వదర్శనం



రైళ్లు ఫుల్..



జై దుర్గా భవానీ..

8లో

తమ్ముళ్ల సిండికేటు!



దోపిడీ, అక్రమాలకు తావులేకుండా కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని తమ్ముళ్లు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మద్యం షాపుల కోసం పోటీలు పడుతున్నారు. కొందరు నేతలు టెండర్లలో పాల్గొని షాపులు వస్తే వ్యాపారం చేసుకుందామనుకుంటుంటే మరికొందరు నేతలు సిండికేట్లను నడిపిస్తూ ఇతరులెవ్వరినీ దరఖాస్తులే వేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. అవసరమైతే గొడవలకు దిగి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే దరఖాస్తులు

- ఇతరులు దరఖాస్తు వేస్తే బెదిరింపులు
- కృష్ణాజిల్లా వ్యాప్తంగా సిండికేట్ల జోరు
- ఎన్టీఆర్‌లో 113 షాపులకు 6,121 దరఖాస్తులు
- కృష్ణాలో 123 దుకాణాలకు 1,038 మాత్రమే..

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు షాపులకు దరఖాస్తులు ఆహ్వానించిన నేపథ్యంలో కొందరు అధికార పార్టీ నేతలు దరఖాస్తుల ప్రక్రియను అవకాశంగా తీసుకుని దందాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలకు మంగళవారం నాటికి 6,121 దరఖాస్తులు వచ్చాయి. కృష్ణాజిల్లాలో 123 షాపులకు కేవలం 1,038 దరఖాస్తులే అందాయి. కృష్ణాజిల్లాలో మద్యం సిండికేట్‌ను అధికార పార్టీ నాయకులే నడిపిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వీరు చెప్పిన వారే మద్యం షాపులకు దరఖాస్తు చేస్తున్నారు. వేరే ఎవరైనా దరఖాస్తు చేసుకున్నా.. మున్ముందు వ్యాపారం చేయలేరంటూ బెదిరిస్తుండటంతో వారు దరఖాస్తుల కోసం డీడీలు తీసి క్యాన్సిల్ చేసుకుంటున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి.

- గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ మున్సిపాలిటీలో ఏడు దుకాణాలు ఉండగా, అన్ని దుకాణాలకు మూడు చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. గుడివాడ రూరల్ మండలంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ రెండు దుకాణాలు ఉండగా మూడు చొప్పున ఆరు దరఖాస్తులు వచ్చాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ దరఖాస్తులు చేసినట్లు సమాచారం. నందివాడలో నాలుగు మద్యం దుకాణాలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు రావడం గమనార్హం. గుడ్లవల్లేరు మండలంలో ఆరు దుకాణాలు ఉండగా 13 దరఖాస్తులు వచ్చాయి.
- పెడన నియోజకవర్గంలో పొరుగు జిల్లాకు చెందిన వ్యక్తి కనుసన్నల్లో టెండర్ల దరఖాస్తు వ్యవహారం నడుస్తోంది. భీమవరానికి చెందిన ఈయన తాను ఎమ్మెల్యే సామాజికవర్గానికి చెందినవాడినంటూ.. తనకు ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నాయని స్థానిక టీడీపీ నాయకులనూ బెదిరిస్తూ దరఖాస్తులు వేయనివ్వడం లేదని తెలిసింది. ఆన్‌లైన్‌లో వేసినా మున్ముందు మీరు వ్యాపారం చేసుకోలేరంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో మొత్తం ఏడు షాపులకు ఈయన మాత్రమే దరఖాస్తు వేయడం గమనార్హం. బంటుమిల్లిలో మూడు దుకాణాలకు 11 దరఖాస్తులు రాగా, కృత్తివెన్ను మండలంలో నాలుగు దుకాణాలకు 12 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.
- పామర్రు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నేతలు కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పి ఎవ్వరినీ దరఖాస్తు చేసుకోనివ్వడం లేదని తెలిసింది. అధికార పార్టీ నాయకులే సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేస్తున్నారని సమాచారం. పామర్రు మండలంలో నాలుగు దుకాణాలు ఉండగా 30 దరఖాస్తులు వచ్చా యి. తోట్లవల్లూరులో మూడు దుకాణాలకు 25, పమిడి ముక్కలలో రెండు దుకాణాలకు 41, పెదపారుపూడిలో 2 దుకాణాలకు 29 దరఖాస్తులు అందాయి.
- పెనమలూరు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ సిండికేట్ పొరుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులనూ తమ నియోజకవర్గ పరిధిలోకి రానివ్వడం లేదు. ఉయ్యూరులో తొమ్మిది దుకాణాలు ఉండగా 28 దరఖాస్తులు వచ్చాయి. కంకిపాడులో ఏడు దుకాణాలకు 55 దరఖాస్తులు రాగా, వైఎస్సార్ తాడి గడప మున్సిపాలిటీ పరిధిలోని మూడు దుకాణాలకు 98, పెనమలూరు మండలంలోని ఐదు దుకాణాలకు 33 దరఖాస్తులు వచ్చాయి.
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నియోజకవర్గం మచిలీపట్నంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. ఇక్కడ ఎనిమిది దుకాణాలు ఉండగా 98 దరఖాస్తులు వచ్చాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోనూ ఎవరికి వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సిండికేట్ల వ్యవహారం పెద్దగా కనిపించడం లేదు.
- గన్నవరం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో సిండికేట్ నడుస్తోంది. మద్యం షాపుల కోసం టీడీపీలోనే ఆధిపత్య పోరు తీవ్రమైంది. గన్నవరం మండలంలోని తొమ్మిది దుకాణాలకు 103, బాపులపాడు మండలంలోని తొమ్మిది షాపులకు 14, ఉంగుటూరు మండలంలో ఐదు దుకాణాలకు 13 దరఖాస్తులు వచ్చాయి.

గన్నవరంలో రోడ్డెక్కిన తమ్ముళ్లు

గన్నవరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద గత రెండు రోజులుగా మద్యం షాపులకు టెండర్ వేసేందుకు వచ్చేవారిని అధికార పార్టీ నాయకుల పేరుతో కొందరు అడ్డుకుంటుండటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది. మంగళవారం అధికార పార్టీ నాయకుల్లోని రెండు వర్గాలు దరఖాస్తులు వేసే విషయంలో ఘర్షణకు దిగారు. మద్యం షాపు కోసం దరఖాస్తు వేసేందుకు ముస్తాబాదకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కంచర్ల ఈశ్వరరావు వెళ్లారు. కారు ఆపి దిగగానే తెలుగు యువత నాయకుడు పరుచూరి నరేష్ మరికొంతమంది యువకులు వచ్చి 'ఏంట్రా నా కొడక నీ వెనుక ఎవరు న్నార్రా?' అని ఘర్షణ పడ్డారు. అయ్యప్ప స్వామి మాలలో ఉండి కూడా ఆ మాటలేంటని ఈశ్వరరావు ప్రశ్నించడంతో నరేశ్ మరింత రెచ్చిపోయి ఆయనపై దాడికి దిగి టెండరు దరఖాస్తును చించేయడంతో వారు చేసేది లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు వచ్చేవారిని స్టేషన్ బయట ఆపి టెండర్‌లు వేయవద్దని.. వేసినా ఫలితం ఉండదని బెదిరిస్తున్నారు. టెండర్ వేస్తే డీడీలు వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరిస్తున్నారు.

దరఖాస్తుల వెల్లువ

ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మండలాల్లో సగటున దుకాణానికి 46 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 113 దుకాణాలకు గాను మంగళవారం నాటికి 6,121 దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ నగరంలో ఎంపిక చేసిన దుకాణాలకు మాత్రమే ఓ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో సిండికేట్ అతి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంది. ఇలాంటి దుకాణాలు ఎనిమిది వరకు ఉంటాయి. ఈ దుకాణాలకు సింగిల్ డిజిట్‌లోనే దరఖాస్తులు రావడం గమనార్హం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 39 షాపులు ఉన్నాయి. వీటికి 4,312 దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ రూరల్‌లో 10 షాపులు ఉండగా 120 దరఖాస్తులు వచ్చాయి.



దసరా పండుగకు కంపెనీలు అందిస్తున్న ఆఫర్లతో ఎలక్ట్రికల్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేయాలనుకున్న వారికి రవాణా శాఖ అధికారుల అలసత్వం తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. ఈవీపై రోడ్డు ట్యాక్స్‌ను మినహాయిస్తూ ప్రభుత్వం రెండు వారాల కిందట జారీ చేసిన జీవోను అమలు చేయాల్సిన అధికారులు తమ పోర్టల్‌కు అప్‌లోడ్ అవ్వలేదని తప్పుకుంటున్నారు. ఈవీలను కొనుగోలు చేయటానికి షోరూమ్‌లకు వెళ్లిన కొనుగోలుదారులకు రోడ్డు ట్యాక్స్ కట్టాలని చెప్పడంతో నిరుత్సాహంగా వెనుతిరుగుతున్నారు. పండుగ దగ్గరకొస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు చేస్తున్నారు.

దసరా టెన్షన్!

కొత్త వాహనాల కొనుగోలుపై ఉత్కంఠ

- ఎలక్ట్రికల్ వాహనాలపై రోడ్డు ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ
- రెండు వారాలైనా అమలు చేయని రవాణాశాఖ అధికారులు
- జీవో అమలుకాకపోతే వాహనదారులపై రూ.15 వేల వరకు భారం
- పండుగ ఆఫర్లు కోల్పోతున్నామంటూ వినియోగదారుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరాను ప్రజలంతా సంతోషంగా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా కొత్త వాహనాలు కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తారు. ఇటీవల పెట్రోల్ ధరలను తట్టుకోలేక అందరూ ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి చూపిస్తున్నారు. వీటి ధరలు చూస్తే ఆకాశంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్డు ట్యాక్స్‌ను తగ్గిస్తూ జీవో తెచ్చింది. దీని వల్ల ఒక్కో ఎలక్ట్రికల్ వాహనంపై రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వం జీవో ఇవ్వడంతో దసరా పండుగ ఆఫర్స్‌తో ఇంకా తక్కువ ధరకు ద్విచక్రవాహనాలు కొనుక్కోవచ్చు అనుకున్న వారి ఆశలపై అధికారులు నీళ్లు చల్లారు. ప్రభుత్వం జీవో జారీ చేసినా.. క్షేత్ర స్థాయిలో అమలు చేయకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

రోడ్డు, లైఫ్ ట్యాక్స్‌లతో పెరిగిన ధరలు

కిందటి జూలై 8వ తేదీ నుంచి ఎలక్ట్రికల్ వాహనాలపై కూడా రోడ్డు ట్యాక్స్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. ఈవీలకు అంతకుముందే లైఫ్ ట్యాక్స్‌ను అమల్లోకి తీసుకురావటంతో ధరలు పెరిగాయి. దీనికి తోడు రోడ్డు ట్యాక్స్‌ను కూడా అమలు చేయడంతో రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు ధరలు పెరిగిపోయాయి. ఈ ధరలతో గత కొంత కాలంగా ఈవీల అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. కంపెనీలు తమ పరిధిలో కొంత వరకు మార్జిన్‌ను తగ్గించుకుంటున్నా.. పెరుగుతున్న పన్నుల భారంతో ఈవీలు కొండెక్కి కూర్చుంటున్నాయి. ప్రస్తుతం సగటున 150 కిలోమీటర్ల రేంజ్‌ను ఇచ్చే ఈవీల ధరలు రూ. 1.50 లక్షలు పలుకుతోంది. వీటిలో అదనపు ఫీచర్లు, బ్యాటరీ సామర్థ్యం, మైలేజీ సామర్థ్యం మేరకు చూస్తే రూ.2 లక్షలు ఆపైన కూడా ఈవీల ధరలు ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రోడ్డు ట్యాక్స్‌ను మినహాయిస్తూ పక్షం రోజుల కిందట జీవో ఇవ్వడంతో వాహనదారులు హర్షించారు. వరుస పండుగలు ఉండటంతో మంచి ఆఫర్లు కూడా చూసుకుని ఈవీలు కొందామనుకున్న వారికి రవాణా శాఖ అధికారుల నిర్వాకం తీవ్ర అసహనానికి గురి చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయకపోవడం పట్ల వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండుగ దగ్గర పడుతున్నా జీవోను అమలు చేయకపోవడం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. దసరా అయిన ఇరవై రోజులకే దీపావళి కూడా వస్తుందని.. పండుగలన్నీ అయిపోయే వరకు రోడ్డు ట్యాక్స్‌ను ఎత్తివేయరా అని వాహనదారులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో రూ.49 లక్షలకుపైగా టోకరా!

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

8లో

ఐదోరోజు ఆదాయం
రూ.58.97లక్షలు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు సోమవారం నాటికి ఐదురోజులు ముగిశాయి. సోమవారం మహాచండీ అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. ఐదోరోజు భక్తుల నుంచి రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.23,71,500, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.5,97,000, రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.5,06,300 ఆదాయం సమకూరింది. 33,282 లడ్డూల విక్రయం ద్వారా రూ.4,99,230, ఆరు లడ్డూలు ప్యాకింగ్ ద్వారా రూ.16,20,900 ఆదాయం సమకూరింది. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన రూ.3000 టికెట్ల ద్వారా రూ.84వేలు, రూ.5000 టికెట్ల ద్వారా రూ.25వేలు ఆదాయం వచ్చింది. పరోక్ష ప్రత్యేక చండీహోమం టిక్కెట్ల ద్వారా రూ.60వేలు, శ్రీచక్ర నవావరణార్చన టికెట్ల ద్వారా రూ.15వేలు ఆదాయం సమకూరింది. ప్రత్యేక ఖడ్గమాలార్చన టిక్కెట్ల ద్వారా రూ.10,232, ఇతరత్రా రూ.1,650లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,110లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ టిక్కెట్ల ద్వారా రూ.1,01,360లు ఆదాయం వచ్చింది. ఐదోరోజు సోమవారం మొత్తంగా కనకదుర్గమ్మవారికి రూ.58,97,282లు ఆదాయం సమకూరింది.




క్యూలలో భక్తుల రద్దీ..


అంతరాలయంలో..


నగరోత్సవంలో..




కాణిపాకం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవస్థానం ఈవో పట్టెం గురుప్రసాద్

కనకదుర్గమ్మకు కాణిపాకం నుంచి
పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, అక్టోబరు 8 : దసరా మహోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవస్థానం ఈవో పట్టెం గురుప్రసాద్ తదితరులు మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో రామారావు, తదితరులు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటాలు అందజేశారు. ఇదే సమయంలో ఈవో రామారావుకు కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం తరఫున శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడుతూ, ప్రతీఏడాది దసరా మహోత్సవాల్లో కాణిపాకం దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈఏడాది తనకు ఈ అవకాశం రావటం పూర్వజన్మ సుకృతమని అన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతిఒక్కరికీ కలగాలని కోరుకున్నానన్నారు.

మూల నక్షత్రం
నేడు అందరికీ సర్వదర్శనం

- అవసరమైన చోట ట్రాఫిక్ నియంత్రణలు
- సీఎం రాక సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు
- 1100 మంది పోలీసులతో టీమ్‌లు

వన్‌టౌన్, అక్టోబరు 8 : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో కీలక ఘట్టం నేడు జరగనుంది. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించనుండగా ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేశామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. మంగళవారం దుర్గగుడి మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు వివిధ విభాగాల అధికారులతో ఆయన మూలా నక్షత్రం నాడు ఏర్పాట్లు, ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, సామాన్య జనానికి ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనాలను కల్పించటంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు సులభతరంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. పాలు, మజ్జిగ, తాగునీరు, అవసరమైన ప్రతిభక్తుడికి క్యూలలో అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో మూడు క్యూలలో భక్తులను దర్శనానికి అనుమతించటం జరుగుతుందన్నారు. ఏ ఒక్క భక్తుడు కూడా ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. బుధవారం అమ్మవారి దర్శనం టిక్కెట్ల జారీని నిలిపివేశామని, అందరికీ ఉచిత దర్శనమేనని తెలిపారు. బుధవారం తెల్లవారుజాము నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం రెండు, మూడు గంటల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ముఖ్యమంత్రిని ఇప్పటికే దేవస్థానంలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించామన్నారు. ఎవరికీ అంతరాలయ ప్రవేశం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగం సూచించిన కొద్ది మంది ప్రజాప్రతినిధులకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుందన్నారు. దర్శనానంతరం చంద్రబాబుకు వేదాశీర్వచనం, శేషవస్త్ర సమర్పణ తదితరాలు ఉంటాయన్నారు. ఇటీవల నగరంలో కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడి సంభవించిన ప్రమాదాలకు చెందిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నామని ముఖ్యమంత్రి సమయాన్ని బట్టి ఈ ఎగ్జిబిషన్‌ను చూసే అవకాశం ఉందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని తెలిపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమయానుకూలంగా ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. కనకదుర్గా ఫ్లైఓవర్ మీద ఎటువంటి ఆంక్షలు లేవని, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఫ్లై ఓవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించామన్నారు. ఇప్పటికే విధులలో 4,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా, అదనంగా మరో 1100 మంది పోలీసులను 110 బృందాలుగా ఏర్పాటుచేసి హోల్డింగ్ టీమ్‌లుగా విధులు కేటాయించినట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన కార్యక్రమంలో పాల్గొన్నారు.


కుంకుమ పూజలో దంపతులు


దుర్గమ్మ సేవలో మంత్రి ఆనం

మరణంలోనూ..
వీడని బంధం

- రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భర్త
- భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం
- స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఇంటికి వెళ్లి ఆత్మహత్య

విజయవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవితంలో అనుకున్న పరిణామం జరిగినప్పుడు ఆనందాలకు హద్దు ఉండదు. ఆ ఆనందం ఆవిరైతే తట్టుకోవడమూ కష్టమే. ఇలా ఆనందాలు అల్లుకున్న ఇంట్లో విధి నిండు విషాదాన్ని నింపింది. రెండు కుటుంబాలను కన్నీటి సంద్రంలో


నాగరాజు, ఉష (ఫైల్)

ముంచేసింది. ఎన్నో కలలతో భవిష్యత్తుకు బాటలు వేసుకున్న దంపతుల కలలను చిన్నాభిన్నం చేసింది. ప్రేమించి పెద్దలను ఒప్పించి తాళికట్టిన వాడు ప్రాణాలతో లేడని తెలుసుకున్న యువతి మరణంలోనూ అతడితోనే ప్రయాణం చేయాలని నిర్ణయించుకుని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నగరంలో మంగళవారం జరిగింది. అయోధ్యనగర్ శివాలయం మెయిన్‌రోడ్డులో ఉంటున్న రాచపూడి నాగరాజు (29) ఎనికేపాడులోని బొమ్మరిల్లు రెస్టారెంట్‌లో దోశ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి కొంతదూరంలో ఉండే చల్లా ఉషా (22) అనే యువతిని ప్రేమించాడు. ప్రేమ విషయాన్ని ఇంట్లో పెద్దలకు చెప్పి ఒప్పించుకున్నారు. 18 నెలల క్రితం కుటుంబ పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఇద్దరూ కలిసి సమీపంలోని సూర్య స్కూల్ వద్ద నివాసం ఉంటున్నారు. నాగరాజు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు రెస్టారెంట్‌కు వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి వస్తాడు. సోమవారం రాత్రి పని ఎక్కువగా ఉండడంతో తెల్లవారుజామున 4గంటలకు ఇంటికి బయలుదేరాడు. బీఆర్టీఎస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఇద్దరు యువకులు వేగంగా వాహనంపై వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో నాగరాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఆ ఇద్దరు యువకులకు కాళ్లు విరిగిపోయాయి. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి సెల్‌ఫోన్ పరిశీలించి భార్య ఉషకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. ఆమె తన తల్లిదండ్రులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుంది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైంది. తర్వాత గుణదల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆమె పీఎస్‌లో ఫిర్యాదు చేస్తుండగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం చేయడానికి వైద్యులు 10 గంటలకు వస్తారని, తాము ఫోన్ చేసినప్పుడు మార్చురీకి రావాలని చెప్పి స్టేషన్ నుంచి పంపేశారు. తర్వాత ఇంటికి వెళ్లిపోయిన ఉష తల్లిదండ్రుల ఇంటి వద్ద కొద్దిసేపు ఉంది. ఉదయం 9గంటల ప్రాంతంలో అత్తింటికి వెళ్లి వస్తానని వెళ్లి ఎంతకూ తిరిగిరాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు అత్తింటికి వెళ్లారు. ఇక్కడికి రాలేదని చెప్పడంతో వెంటనే ఉష ఉంటున్న ఇంటికి వెళ్లారు. ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందికి దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరగాలి

మచిలీపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల కేటాయింపును పారదర్శకంగా చేయాలని కలెక్టర్ బాలాజీ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈనెల 11వ తేదీన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిన కేటా యించే ప్రక్రియకు సంబంధించిన చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలుసూచనలు చేశారు. మద్యం దుకాణాల కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి వివరాలను మొబైల్‌ఫోన్‌లకు సమాచారం పంపాలన్నారు.

హోమగుండం కోసం..

- దీక్షల విరమణకు.. 3 లక్షల మంది భవానీల ఎదురుచూపు
- ఏర్పాటుపై స్పష్టత రాకపోవటంతో.. ఉత్సవాలలో కానరాని భవానీలు
- 13న లక్షన్నర మంది వస్తారని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్)

దసరా ఉత్సవాలలో భవానీలు దీక్షల విరమణ చేపట్టే విషయంలో హోమగుండం ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రాలేదు. గతేడాది కంటే రికార్డుస్థాయిలో భవానీ దీక్షధారుల సంఖ్య గణనీయంగా పెరిగినా.. ఉత్సవాల రోజుల్లో ఈ సంఖ్య కనిపించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా జిల్లా యంత్రాంగం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. భవానీలు దీక్షలను విరమించిన తర్వాత ఇరుముడులను హోమగుండంలో వేస్తేనే తమ దీక్షకు పరిపూర్ణత ఉంటుందని భావిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2019 వరకు హోమగుండాలను ఏర్పాటు చేయటం ద్వారా దసరా ఉత్సవాల సమయంలో భారీ సంఖ్యలో భవానీలు వచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోనాకు ముందు, తర్వాత కూడా హోమగుండాలను ఏర్పాటు చేయటం ఆపివేశారు. నాడు భవానీలు ఎంతో పవిత్రంగా భావించే



హోమగుండాన్ని ఏర్పాటు చేయలేదన్న విమర్శలు వచ్చాయి. భవానీలు, గురుభవానీలు అధికారుల చర్యలను తప్పుబట్టేవారు. హోమగుండాలు ఏర్పాటు చేయకపోవటం వివాదాలకు దారి తీసేది. ప్రస్తుతం ప్రభుత్వం మారటంతో హోమగుండాల ఏర్పాటు జరుగుతుందని భావించిన భవానీలకు ఇప్పటివరకు స్పష్టత రాలేదు. భవానీదీక్షలకు సంబంధించి విరమణల సందర్భంలో రెండు సంఘాలు క్రియాశీల పాత్ర పోషిస్తుంటాయి. ఆలిండియా భవానీదీక్షల ఛారిటబుల్ ట్రస్ట్, ఏపీ భవానీ దీక్షా సంఘం. రెండూ కూడా దీక్షల విరమణను చేపడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఆలిండియా ఛారిటబుల్ ట్రస్ట్‌ను పక్కన పెట్టారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో, హోమగుండం ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ఆలిండియా భవానీ దీక్షల ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తిరుగుతున్నారు. ఇప్పటి వరకు స్పష్టత లేకపోవటంతో భవానీలలో ఆందోళన నెలకొంటోంది. హోమగుండం ఏర్పాటు దసరా ఉత్సవాలలో కుదరకపోవచ్చునని, ఉత్సవాల తర్వాత రోజు నుంచి ఏర్పాటుచేస్తామని దేవస్థాన అధికారుల నుంచి సంకేతాలు రావటంతో.. భవానీలంతా దసరా ఉత్సవాలకు దూరంగా ఉంటున్నారు. గత నాలుగు రోజులుగా భవానీలు కనిపించటం లేదు. మంగళవారం స్వల్పంగా కనిపించినా.. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు 60 వేలలోపు మాత్రమే రావచ్చని తెలుస్తోంది. కిందటేడాది కంటే రికార్డుస్థాయిలో 3 లక్షలమంది భవానీలు దీక్ష చేపట్టారు. దసరా ఉత్సవాలలో విరమణలు చేసే వారిసంఖ్య ఇది. ఈనెల 13వ తేదీన ఒక్క రోజే అమ్మ సన్నిధిలో దీక్షా విరమణలు చేయటానికి 1.50 లక్షల మంది రానున్నట్టు గురుస్వాములు చెబుతున్నారు. మిగిలిన ఐదు రోజుల్లో 50 వేలమంది చొప్పున చూస్తే ఈసారి 2లక్షల మందికి సంఖ్య పెరుగుతోంది. దసరా ఉత్సవాల తర్వాత రోజుల్లో హోమగుండం ఏర్పాటు చేసిన తర్వాత మరో లక్ష మందికి పైగా వస్తారని గురుస్వాములు చెబుతున్నారు. ఈ సారి దసరా ఉత్సవాలలో 70 వేల మంది భవానీలు కూడా దాటడం కష్టంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. హోమగుండం ఏర్పాటుపై దేవస్థాన అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెత్త నుంచి సంపద తేవాలి

- తడి చెత్తతో కంపోస్టు ఎరువులు
- మునిసిపల్ రీజినల్ డైరక్టర్ నరసింహారావు



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 8 : చెత్తనుంచి సంపదను తయారు చేసేందుకు ప్రతీ మునిసిపాలిటీ విధిగా ప్రణాళికను రూపొందించాలని మునిసిపల్ రీజినల్ డైరక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు సూచించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మునిసిపల్ కమిషనర్లతో మంగళవారం మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో తడిచెత్త, పొడి చెత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో చెత్తసేకరణ, స్థలం, కాంట్రాక్టర్ల వివరాలపై చర్చించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. వచ్చే గురువారం నాటికి మునిసిపల్ కమిషనర్లు పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. మచిలీపట్నం డంపింగ్ యార్డు నుంచి చెత్తను గుంటూరుకు చెందిన జిందాల్ ప్లాంటుకు తరలిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ, నగరంలో ప్రతిరోజూ 84 టన్నుల చెత్త వస్తుండగా.. డంపింగ్ యార్డులో లక్ష టన్నుల చెత్త ఉందన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ ద్వారా రూ 3 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో తాడిగడప, పెడన, కొండపల్లి, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికుల రద్దీ

రైళ్లు ఫుల్!

- ఉత్తరాంధ్ర భక్తుల కోసం 16 స్పెషల్ రైళ్లు
- పీఎన్‌బీఎస్‌లోనూ ప్రయాణికుల సందడి
- 11 స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా పండుగ సమీపిస్తుండటంతో ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. మంగళవారం పండగ ప్రయాణాలతో విజయవాడ రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. ఏ ప్లాట్‌ఫామ్‌పై చూసినా ప్రయాణికుల రద్దీనే. రైళ్లు నిండుగా నడిచాయి. బోగీలలో తోపులాటలు జరిగాయి. రైళ్లకోసం ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌ల మీదనే పడిగాపులు పడ్డారు. నగరంలోని వలస కూలీలు పెద్దసంఖ్యలో కుటుంబసభ్యులతో కలిసి సొంతూళ్లకు వెళ్లటానికి తరలిరావటంతో స్టేషన్ కిటకిటలాడిపోయింది. దీనికితోడు ప్రైవేటు కళాశాలలకు వరుసగా అవుటింగ్‌లు ఇస్తుండటంతో దూర ప్రాంతాలు వెళ్లేవారంతా రైళ్లలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణించారు. దీంతో మంగళవారం స్టేషన్‌లో అసాధారణ రద్దీ కనిపించింది. విజయవాడలో జరిగే దసరా ఉత్సవాలకు కూడా పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు రైళ్లలో వస్తున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి భారీసంఖ్యలో భక్తులు వస్తున్నారు. కనకదుర్గమ్మ భక్తులను దృష్టిలో ఉంచుకుని విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య 16 దసరా స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు మంగళవారం రైల్వే అధికారులు ప్రకటించారు. అమ్మవారి మూలానక్షత్రం రోజునుంచి ఈ నెల 18వ తేదీవరకు విజయవాడ-శ్రీకాకుళం రోడ్ (07215), శ్రీకాకుళంరోడ్-విజయవాడ (07216)లను నడపనున్నట్టు ప్రకటించింది. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే వారికోసం ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17వ తేదీలలో వరుసగా ఈ స్పెషల్ రైళ్లు నడుస్తాయి. అలాగే విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లటానికి వీలుగా ఈనెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీలలో స్పెషల్ రైళ్లను నడపనున్నారు.

బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సందడి..

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అసాధారణ రద్దీ కనిపించనప్పటికీ.. ప్రయాణికులతో సందడిగా మారింది. రెగ్యులర్ బస్సులన్నీ దాదాపుగా ఫుల్ అయ్యాయి. మూలా నక్షత్రం ముందురోజు కాబట్టి భారీసంఖ్యలో ప్రయాణాలు ఉంటాయన్న ఉద్దేశ్యంతో మంగళవారం 80బస్సుల వరకు అధికారులు సిద్ధం చేశారు. ప్రయాణికుల రద్దీ ఆ మేరకు కనిపించకపోవటంతో 40 బస్సుల వరకు వెనక్కు పంపించారు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 11 స్పెషల్ సర్వీసులను నడిపినట్టు ఆర్టీసీ పీఎన్‌బీఎస్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నర్రా శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మూలానక్షత్రం రోజున ప్రయాణికుల డిమాండ్ అనూహ్యంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో దానికి తగ్గట్టుగా ప్లాన్ చేశామని ఆయన చెప్పారు.

న్యూస్ బాక్స్

కిడ్నీ మహమ్మారికి మరొకరు బలి

ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలంలో కిడ్నీ మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. డయాలసిస్ చేయించుకోలేక వ్యాధి తీవ్రతతో మరొకరు మృతి


గుగులోతు చిన్న

చెందారు. కుమ్మరకుంట్ల గ్రామానికి చెందిన గుగులోతు చిన్న (55) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల సలహామేరకు కొద్ది రోజులు మందులు వాడినా ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగింది. భయంతో డయాలసిస్ చేయించుకోలేదు. ఇటీవల సీరమ్ క్రియాటిన్ శాతం 9కి చేరి మంగళవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో
రూ. 49 లక్షలకు పైగా టోకరా!

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెనమలూరు, అక్టోబరు 8 : ఆన్‌లైన్‌లో షేర్లు ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలొస్తాయంటూ రూ.49 లక్షలకు పైగా మోసం చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకికి చెందిన వెంకట కోటేశ్వరరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తాడు. అతడి ఫోన్‌కు వాట్సాప్‌లో ఆన్‌లైన్ షేర్స్ ట్రేడింగ్ పేరుతో ఒక లింక్ వచ్చింది. అందులో ఖాతా తెరిచి ఆన్‌లైన్‌లో షేర్లు ట్రేడింగ్ చేసురేంటే అధిక లాభాలొస్తాయని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన వెంకట కోటేశ్వరరావు ఖాతా తెరిచి కొన్ని షేర్స్ ట్రేడ్స్, ఐపీవోలలో 49.20లక్షలు విడతల వారీగా పెట్టుబడి పెట్టాడు. సదరు మొత్తం వారు పంపిన ఆరు ఖాతాలకు అతను, వారి బంధువు కందుల లక్ష్మణకుమార్ జమచేశారు. తర్వాత కొద్ది రోజులకు మీరు పెట్టుబడి పెట్టిన డబ్బు లాభాలతో కలిపి రూ.2.82కోట్లు అయిందని.. సదరు డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే 20శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంటుందని, తమ కంపెనీ పదిశాతం చెల్లిస్తుందని, మిగిలిన పది శాతం సొమ్ము రూ.28,26,649 ఖాతాదారు చెల్లించాలని, లేనిపక్షంలో ఖాతాదారు సొమ్ము విత్‌డ్రా అవదని వెబ్‌సైటు నిర్వాహకులు తెలిపారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న వెంకట కోటేశ్వరరావు పెనమలూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

లయోలాలో రోబోటిక్స్‌పై సదస్సు

భారతీనగర్, అక్టోబరు 8: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం రోబోటిక్స్ అంశంపై అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో చీఫ్‌ట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫౌండర్, డైరెక్టర్ నితిన్ పాల్గొని విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో నూతన టెక్నాలజీలు, డిజైన్‌ల వంటి తదితర అంశాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల సహాయ డైరెక్టర్ ఫాదర్ డి బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కాండీ డికునా, ఈఈఈ విభాగాధిపతి జి.నవీన్‌కుమార్, 50మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవిగా జగన్మాత



మహాలక్ష్మీ అలంకారంలో విజయదుర్గా అమ్మవారు



కొత్తపేట గంగానమ్మ అమ్మవారు



సంతోషిమాత అలంకారంలో మహాలక్ష్మీ అమ్మవారు



మహాలక్ష్మీ దేవిగా కాళీమాత

చిట్టినగర్, అక్టోబరు 8: కొత్తపేటలో ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని మంగళగౌరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు సంతోషిమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయదుర్గా అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. కేఎల్ రావునగర్‌లో ఉన్న శ్రీ జంబులాంబదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎంసీ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. పాలఫ్యాక్టరీ నాగమ్మ సత్రం వీరాంజనేయస్వామి ధ్యానమందిరంలోని కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

మహాలక్ష్మీ దేవిగా కాళీమాత

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు మంగళవారం భక్తులకు మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుం పూజలు నిర్వహించారు. విశేష హారతుల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

లబ్బీపేట: రాణిగారితోట లోని శ్రీశ్రీశ్రీ మహాశక్తి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీగా అమ్మవారు

మొగల్రాజపురం: మధురానగర్ మెయిన్ రోడ్డులో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలలో మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. మొగల్రాజపురం ధన కొండ మీద అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు.

భారతీనగర్: కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనీయ దేవస్థానంలో శ్రీమహాలక్ష్మీ దేవిగా అలంకరించి, అమ్మవారికి పూజలు చేశారు.



కేదారేశ్వరపేటలో..



ఊర్మిళానగర్‌లో పోలేరమ్మ



పాతశివాలయంలో...



వెంకటేశ్వరస్వామి ఆలయంలో

శ్రీ మహాలక్ష్మీ దేవిగా మరకత రాజరాజేశ్వరి

పటమట : దత్తపీఠంలో మరకత రాజరాజేశ్వరి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారికి పాయసం నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం బంగారు పుష్పాలతో విశేషమైన అర్చన సాగింది. పటమట దర్శిపేటలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించగా, 500 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాండవ రంగలక్ష్మి పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవిగా భ్రమరాంబదేవి

వన్‌టౌన్: స్థానిక పాత శివాలయంలో జరుగుతున్న దసరా మహోత్సవాల సందర్భంగా మూల విరాట్ భ్రమరాంబదేవి మంగళవారం మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. అమ్మవారికి, మల్లేశ్వర స్వామికి యాథావిధిగా హోమాలు, కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నటరాజ్ షణ్ముగం, ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొమ్ము మధు, సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారికి, అమ్మవారికి పంచహారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధాన్యలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిగా దర్శనం ఇచ్చిన పద్మావతి అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

పొట్టిశ్రీరాములు కళాశాలలో ...

పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం దసరా మహోత్సవ వేడుకలను సంతోష సంరంబాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా బతుకమ్మ, దాండియా, తదితర నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గర్బా డ్యాన్స్ తదితరాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

కరెన్సీతో మహాలక్ష్మీ దేవిగా దర్శనం

కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు పర్యవేక్షించారు. భక్తులు చండీయాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

లలితాత్రిపుర సుందరిగా పోలేరమ్మ

భవానీపురం: ఊర్మిళానగర్‌లోని పోలేరమ్మ ఆరో రోజు లలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ప్రసాదంగా పులిహోరను భక్తులకు పంపిణీ చేశారు. హెచ్‌బి కాలనీలోని సంకల్ప సిద్ధి షిర్డి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీ దేవీగా శివకాళేశ్వరి

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేట శ్రీ శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుండే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులందరికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పెద్దలు వివి. రమణరావు, కేటీ రాజు, చింతల లక్ష్మయ్య, వై. రత్న, ఆర్. రాజు, వీకే పద్మనాభం, కన్నా రాజు పాల్గొన్నారు.



రాణిగారితోట మహాశక్తి దేవస్థానంలో



మధురానగర్ మెయిన్ రోడ్డు రత్నాగార్డెన్స్ లో



కరెన్సీనగర్‌లో



దత్తపీఠంలో



కేదారేశ్వరపేట రైతుబజార్‌లో, భవానీపురం రైతుబజార్‌లో టమాటాల కోసం బారులు తీరిన వినియోగదారులు

రూ. 50కే సబ్సిడీ టమాటాల విక్రయాలు

పాతరాజరాజేశ్వరి పేట, అక్టోబరు 8 : స్థానిక కేదారేశ్వరపేట రైతుబజార్‌లో మంగళవారం నుంచి ప్రభుత్వం ఆదేశాల మేరకు సబ్సిడీపై టమాటాలను ప్రజలకు అందిస్తున్నారు. కేదారేశ్వరపేట రైతుబజార్ ఎస్టేట్ అధికారి రమేష్ మంగళవారం ఉదయం నుంచే సబ్సిడీ టమాటాలను అమ్మకాలు చేపట్టారు. టమాటాలను కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఉత్సాహం చూపారు. టమాటా ధర మంగళవారం రూ.65లు ఉండగా ప్రభుత్వం రూ.15లు తగ్గించి, సబ్సిడిపై రూ.50రూ లకే అందిస్తుందని ఈవో రమేష్ తెలిపారు. రోజుకు 15 క్వింటాళ్ల చొప్పున సబ్సిడీ టమాటాలను అందిస్తామన్నారు.

భవానీపురం: భవానీపురం రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాల విక్రయాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కాలంలో వరదల తర్వాత కిలో రూ.100 బహిరంగ మార్కెట్‌లో పలికింది. ఈ ధరతో వినియోగదారులు ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని కొద్ది రోజుల క్రితం రూ66కు రైతుబజార్లలో విక్రయాలు చేయగా, సబ్సిడీ భరిస్తూ ప్రభుత్వం రూ.50కే ప్రజలకు విక్రయించడం ప్రారంభించింది. భవానీపురం రైతుబజార్ ఈవో పీ బాలాజీ పర్యవేక్షణలో టమాటాల విక్రయాలను ప్రారంభించగా కొనుగోలుదారులు ఎగబడి గంటలోనే బారులు తీరి కొనేశారు.

మర్యాదపూర్వక కలయిక

పటమట, అక్టోబరు 8 : విజయవాడ సౌత్‌జోన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన యు బంగార్రాజుని యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిరీష్, పసుసులేటి బాలు, వినయ్‌లు పాల్గొన్నారు.



స్కందమాతగా అమ్మవారు



విజయవాడ కల్చరల్, అక్టోబరు 8 : విజయవాడ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో జరుగుతున్న వంటి దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆరో రోజు అమ్మవారు స్కందమాతగా దర్శనమిచ్చారు. శత చండీహోమాలు, మహారుద్రాభిషేకం దశమహావిద్యాహోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం గోపూజ, గురుపూజ అనంతరం సంకల్పం శతచండీహోమం సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. సామూహిక లలిత సహస్ర నామ పారాయణం తదనంతరం అమ్మవారికి దశావిధ హారతులు నిర్వహించారు.

బాధితులందరికీ పరిహారాన్ని జమచేశాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



కాల్వలో చెత్తను తీయిస్తున్న గద్దె రామ్మోహన్

లబ్బీపేట, అక్టోబరు 8: గత ప్రభుత్వం మాదిరిగా ఉత్తుత్తిగా బటన్‌లు నొక్కడం కాకుండా వరద బాధితులందరికి వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా పరిహారాన్ని జమ చేశామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 18వ డివిజన్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుని, మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తను దగ్గరుండి పారిశుధ్య సిబ్బందితో తీయించా రు. అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లో డ్రెయినేజీ సమస్యను సాధ్యమైనంత వరకు త్వరగా పరిష్కరిస్తానని, మురుగు కాల్వలో చెత్త, వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిల్స్ వేయకుండా ఉండాలని, ఈ విషయమై స్థానికుల్లో అవగాహన కల్పించాలని అన్నారు. వరద బాధితులకు, రైతులకు పరిహారాన్ని శరవేగంగా వారి ఖాతాల్లో జమ అయ్యేలా చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారని, 11రోజుల పాటు ఆయన ఇంటికి కూడా వెళ్లకుండా కలెక్టరేట్‌లోనే ఉంటూ ప్రతి ఒక్క బాధితుడికి సహాయం అందేలా చూశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, ఆదిబాబు, సునాబీ తదితరులు పాల్గొన్నారు.

ఊర్మిళానగర్‌లో గంజాయి, మందుబాబుల హల్‌చల్

● అనధికారిక బస్టాప్, ప్రధాన కూడళ్లలో పోకిరిల టీజింగ్



ఊర్మిళానగర్‌లో అనధికారిక బస్టాప్‌లో తిష్టవేసిన గంజాయి, మద్యం ప్రియులు

భవానీపురం, అక్టోబరు 8: 43వ డివిజన్ మెయిన్‌రోడ్డులో అనధికారిక బస్టాప్, పోలేరమ్మ గుడి సమీపంలోని వీధుల్లో ఇళ్ల వద్ద, మెట్ల వద్ద యువకులు, పోకిరి గ్యాంగ్, గంజాయి,మద్యం సేవించి హల్‌చల్ సృష్టిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, బీట్ పర్యవేక్షించే సిబ్బంది వీరి ఆగడాలకు కళ్లెం వేయలేకపోతున్నారు. యువతులు, మహిళలు ఇటువైపుగా వెళ్లాలంటే హడలిపోయేలా పరిసరాలు మారాయి. గంటల తరబడి ఇక్కడ బస్టాప్‌లో తిష్ట వేసుకుని గంజాయి, మందుబాబులు కూర్చొని ఉంటున్నారు. ఇది గంజాయిబాబుల అడ్డాగా మారిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిన్న,మొన్నటి వరకు పార్కులు, ఖాళీస్థలాల్లో గంజాయి సేవించే వారు ఇప్పుడు ప్రజల మధ్య తాగుతూ హింసకు పాల్పడుతున్నారంటున్నారు. సమీపంలోనే సిద్ధం కృష్ణారెడ్డి వీఎంసీ ఎలిమెంటరీ పాఠశాల, లోపల ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు వీరి చేష్టలతో చెడిపోయే ప్రమాదం ఉత్పన్నం అవుతుందని తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసులకు ఎన్నిసార్లు చెప్పినా ఒకరోజు బెదిరిస్తే గంజాయిబాబులు పక్కకు వెళ్లి మరుసటి రోజు నుంచి నిత్య రోడ్లపైనే తాగుతూ హల్‌చల్ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ బస్టాప్, పబ్లిక్ ప్రాంతాల్లో భయానక పరిస్థితులను సృష్టిస్తున్న ఆకతాయిల ఆగడాలకు భవానీపురం పోలీసులు చెక్ పెట్టాలని ఊర్మిళానగర్ ప్రాంత వాసులు మొరపెట్టుకుంటున్నారు.

మద్యం షాపులకు 282 దరఖాస్తులు

ఉయ్యూరు, అక్టోబరు 8 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సర్కిల్ పరిధిలో మద్యం షాపులకు మంగళ వారం నాటికి 282 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు గాను 30 షాపులకు దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణ బుధవారంతో ముగియనుంది. స్వీకరణ ప్రారంభించి, ఐదు రోజులు గడుస్తున్నా ఆశించినంత మేర రాకపోవడంపై సర్వత్రా చర్చ నెలకొంది.

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 9 అక్టోబరు 2024

మహిళల వరల్డ్ కప్

స్కాట్లాండ్ X దక్షిణాఫ్రికా
మ. 3.30 నుంచి

భారత్ X శ్రీలంక
రా.7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

గెలవాలి.. అదిరేలా!

లంకతో భారత్ కీలక పోరు నేడు



జట్లు (అంచనా)

భారత్: షఫాలీ వర్మ, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా, రిచా ఘోష్, సజన, దీప్తి, అరుంధతి, శ్రేయాంక, శోభన, రేణుక.

శ్రీలంక: విష్మి గుణరత్నె, చమరి ఆటపట్టు (కెప్టెన్), హర్షిత, కవిష, నీలాక్షి, హాసిని, అనుష్క, సుగంధిక, ప్రియదర్శిని, ఇనోక రణవీర, ప్రబోధిని.

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో మిశ్రమ ఫలితాలను చవిచూసిన భారత్.. సెమీస్ రేసులో నిలవాలంటే భారీ విజయాలతో నెట్ రన్‌రేట్‌ను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ క్రమంలో బుధవారం గ్రూప్-ఎలో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన బరిలోకి దిగనుంది. భారీ అంచనాలతో పొట్టి కప్ బరిలోకి దిగిన భారత్.. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 58 పరుగుల తేడాతో ఘోరంగా ఓడడంతో నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఆ తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 105 పరుగుల స్వల్ప స్కోరును కూడా కష్టంగా ఛేదించింది. టీమిండియా ప్రస్తుత పరిస్థితికి బ్యాటర్ల వైఫల్యమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. డాషింగ్ ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ధనాధన్ ఆరంభాన్ని అందించలేకపోతున్నారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో వర్మ 2, 32 పరుగులు చేయగా.. మంధాన 12, 7 రన్స్ మాత్రమే స్కోరు చేసింది. పాక్‌తో మ్యాచ్‌లో మెడ నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హర్మన్ ఫిట్‌గా ఉన్నట్టు సమాచారం. మందకొడి వికెట్లపై జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ ధాటిగా ఆడలేకపోవడం మైనస్‌గా మారింది. గత మ్యాచ్‌లో మూడు వికెట్లతో రాణించిన పేసర్ అరుంధతి నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తుండగా.. రేణుక నుంచి తగిన సహకారం అవసరం. కాగా, స్పిన్ విభాగానికి ఎంతో కీలకమైన దీప్తి అంతగా ప్రభావం చూపలేక పోవడం ఆందోళన కలిగించే విషయం. గ్రూప్‌లో ఆఖరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉండడంతో అన్ని రంగాల్లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేయాల్సిందే. మరోవైపు రెండు వరుస ఓటములతో సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకొన్న లంక గెలుపు బోణీ చేయాలనే కసితో ఉంది. బ్యాటింగ్‌లో ఆటపట్టుతో పాటు గుణరత్నె, హర్షిత, నీలాక్షిక అండగా నిలుస్తున్నారు. ఇరుజట్లకూ గెలుపు కీలకం కావడంతో.. మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

బంగ్లా పోటీనిచ్చేనా?

సిరీస్‌పై భారత్ గురి
నేడు రెండో టీ20

రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్18లో



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న బంగ్లాదేశ్ జట్టు ఇప్పటి వరకు పెద్దగా పోటీ ఇచ్చింది లేదు. టెస్టు సిరీస్‌ను కోల్పోవడంతో పాటు పొట్టి ఫార్మాట్‌ను కూడా పేలవంగా ఆరంభించింది. అటు ఆతిథ్య టీమిండియా మాత్రం రెట్టించిన ఉత్సాహంతో మరో సిరీస్‌పై కన్నేసింది. సీనియర్లకు విశ్రాంతినిచ్చి యువ ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేసినా.. బంగ్లాపై తొలి టీ20లో అన్ని విభాగాల్లోనూ పైచేయి సాధించింది. ఈనేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు కీలక రెండో టీ20 జరుగనుంది. కోచ్ గంభీర్ సొంత మైదానంలో మరో మ్యాచ్ ఉండగానే చక్కటివిజయంతో సిరీస్ అందుకోవాలని సూర్యకుమార్ సేన తాపత్రయపడుతోంది. పర్యాటక జట్టు మాత్రం గెలుపే ధ్యేయంగా బరిలోకి దిగనుంది. ఎందుకంటే ఇక్కడ గెలిస్తేనే సిరీస్‌లో సజీవంగా ఉంటుంది.

అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా..: ఈ సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ శాంసన్ ఆకట్టుకున్నాడు. 2015లో అరంగేట్రం చేసినా నిలకడలేమితో జట్టులోకి వస్తూపోతూ ఉన్న సంజూ చక్కటి స్ట్రోక్‌ప్లేతో పవర్‌ప్లేలో చెలరేగాడు. మరో ఓపెనర్ అభిషేక్‌తో కలిసి నేటి మ్యాచ్‌లో మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాలనుకుంటున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగుతుండగా.. హార్దిక్ అటు బంతితో ఇటు బ్యాటుతో రాణిస్తున్నాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్ అరంగేట్రంలోనే అదుర్స్ అనిపించుకున్నాడు. అర్ష్‌దీప్ ఆరంభం.. చివర్లో వికెట్లు నేలకూల్చడంతో బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఇక మూడేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లతో వెన్నువిరిచాడు. ఈ మ్యాచ్‌లోనూ అతడు రాణిస్తే బంగ్లా బ్యాటర్లకు తిప్పలు తప్పవు.

ఒత్తిడిలో బంగ్లా: ఇక్కడి బ్యాటింగ్ పిచ్‌పై సూపర్ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లను నిలువరించాలంటే బంగ్లా బౌలర్లు చెమటోడ్చాల్సిందే. వెటరన్ ప్లేయర్ మహ్మదుల్లాకు పొట్టి ఫార్మాట్‌లో ఇదే చివరి సిరీస్ కానుంది. దీంతో అతడికి ఘనంగా ఫేర్‌వెల్ ఇవ్వాలనుకుంటే జట్టు ఈ మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది. అదీగాకుండా గతంలో అరుణ్ జైట్లీ స్టేడియంలోనే భారత్‌పై ఏకైక టీ20 విజయాన్ని బంగ్లా సాధించింది. ఆ ఉత్సాహంతో మరోసారి గెలుపు రుచి చూడాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో మిరాజ్, షంటో మాత్రమే రాణిస్తుండగా, లిట్టన్ జట్టుకు శుభారంభాన్ని అందివ్వాల్సి ఉంది. ఇక బౌలర్లంతా తొలి టీ20లో ధారాళంగా పరుగులిచ్చుకున్నారు.

సూర్యకుమార్ మరో 39 పరుగులు సాధిస్తే టీ20ల్లో అత్యంత వేగం (73 మ్యాచ్‌లు)గా 2500 రన్స్ పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా కోహ్లి రికార్డును సమం చేస్తాడు. బాబర్ ఆజమ్ (67) టాప్‌లో ఉన్నాడు.

పిచ్

అరుణ్ జైట్లీ స్టేడియం సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఇక్కడ జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ 200+ పరుగులు నమోదయ్యాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), నితీశ్ కుమార్, హార్దిక్, రియాన్, రింకూ సింగ్, వాషింగ్టన్,వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్.

బంగ్లాదేశ్: లిట్టన్ దాస్, పర్వేజ్ హొస్సేన్, షంటో (కెప్టెన్), తౌహీద్, మహ్మదుల్లా, జకీర్ అలీ, మిరాజ్, రిషాద్, తన్జీమ్ హసన్, టస్కిన్, ముస్తాఫిజుర్, షోరిఫుల్.

సల్మాన్ ఆగా శతకం

పాక్ తొలి ఇన్నింగ్స్ 556


సల్మాన్ ఆగా (104 నాటౌట్)

ముల్తాన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ తరఫున మూడో శతకం నమోదైంది. రెండో రోజు మంగళవారం ఆటలో సల్మాన్ ఆగా (104 నాటౌట్) రాణించాడు. దీంతో పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసింది. లీచ్‌కు మూడు.. కార్స్, అట్కిన్సన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి 96/1 స్కోరుతో ఉంది. ఓపెనర్ క్రాలే (64 బ్యాటింగ్), రూట్ (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

సఫారీలకు ఐర్లాండ్ షాక్

అబుధాబి: దక్షిణాఫ్రికాకు ఐర్లాండ్ మరోసారి షాకిచ్చింది. ఇప్పటికే రెండో టీ20లో సఫారీలను ఓడించిన ఐర్లాండ్ సోమవారం రాత్రి జరిగిన మూడో వన్డేలో 69 పరుగుల తేడాతో చిత్తుచేసింది. అయితే ఈ సిరీస్‌ను మాత్రం 2-1తో సఫారీలు గెలుచుకున్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 50 ఓవర్లలో 284/5 స్కోరు చేసింది. కెప్టెన్ స్టిర్లింగ్ (88), టెక్టర్ (60) రాణించారు. విలియమ్స్‌కు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 46.1 ఓవర్లలో 215 పరుగులకు కుదేలైంది. జేసన్ స్మిత్ (91) ఒక్కడే రాణించాడు. హ్యూమ్, యంగ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.

ఫుట్‌బాల్‌కు ఇనియెస్టా వీడ్కోలు



న్యూఢిల్లీ: స్పెయిన్ ఫుట్‌బాల్ దిగ్గజం ఆండ్రెస్ ఇనియెస్టా (40) రిటైర్మెంట్ ప్రకటించాడు. 2010 వరల్డ్‌కప్‌లో ఇనియెస్టా విన్నింగ్ గోల్‌తో స్పెయిన్ విశ్వవిజేతగా నిలిచింది. 22 ఏళ్ల కెరీర్‌లో 2 యూరోపియన్ చాంపియన్‌షిప్ టైటిళ్లు, 4 చాంపియన్స్ లీగ్ ట్రోఫీలు గెలిచాడు. బార్సిలోనా తరఫున కూడా ఆడాడు.

టీ20లకు మహ్మదుల్లా గుడ్‌బై

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మహ్మదుల్లా (38) టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు తన కెరీర్‌లో చివరివని తెలిపాడు. 2021లోనే టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పిన మహ్మదుల్లా.. వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నట్టు చెప్పాడు. బంగ్లా తరఫున 139 టీ20లు ఆడిన మహ్మదుల్లా 2395 పరుగులు చేయగా.. 40 వికెట్లు పడగొట్టాడు.



ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ పోటీల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ముంబైలో జరిగింది. భారత్, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఆస్ట్రేలియా జట్లు తలపడే ఈ లీగ్ నవంబరు 17 నుంచి భారత్‌లో జరగనుంది. ఈ వేడుకలో సచిన్, మోర్గాన్, లారా, రోడ్స్, కలువితరణ, వాట్సన్ పాల్గొన్నారు.

పంగాలియా శతకం

చెన్నై: హర్వాంశ్ పంగాలియా (117) సెంచరీతో అదరగొట్టడంతో.. ఆస్ట్రేలియా అండర్-19తో అనధికార టెస్ట్‌లో భారత్ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 316/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 492 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆసీస్ 142/3 స్కోరు చేసింది.

గ్యాంజీస్‌కు మరో ఓటమి

లండన్: గ్లోబల్ చెస్ లీగ్‌లో గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్‌కు మరో ఓటమి ఎదురైంది. ఏడో రౌండ్‌లో గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్ 5-14తో అలాస్కన్ నైట్స్ చేతిలో పరాజయం పాలైంది. కాగా, అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ 11-5తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. అమెరికన్ గాంబిట్స్, త్రివేణి కాంటినెంటల్‌పై నెగ్గింది. 7 రౌండ్లు ముగిసేసరికి 18 పాయింట్లతో నైట్స్ టాప్‌లో ఉంది.

సింధు పరాజయం

వంటా (ఫిన్లాండ్): భారత స్టార్ క్రీడాకారిణి పి.వి. సింధు ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో పరాజయం పాలైంది. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 16-21, 10-21తో మిచెల్ లీ (కెనడా) చేతిలో ఓటమి పాలైంది. మరో మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 23 సుంగ్ షు యున్ (చైనీస్ తైపీ)కి మాళవిక షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ ముందంజ వేయగా, సతీష్ కుమార్ ఇంటిముఖం పట్టాడు.

ఆస్ట్రేలియా ఘనవిజయం


షుట్ (3/3)

మహిళల టీ20 వరల్డ్‌కప్

షార్జా: న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగిన మహిళల టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 60 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. బెత్ మూనీ (40), ఎలిస్ పెర్రీ (30), హీలీ (26) రాణించారు. అమెలియా కెర్‌కు నాలుగు.. హల్లీడే, మెయిర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్‌ను పేసర్ మెగాన్ షుట్ (3/3) వణికించింది. దీంతో ఈ జట్టు 19.2 ఓవర్లలో 88 పరుగులకు కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మెగాన్ షుట్ నిలిచింది.

బిజినెస్

రూ.7.51 లక్షల కోట్ల లాభం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. వేల్యూ బైయింగ్‌తో ప్రామాణిక సూచీలు మంగళవారం మెరుగైన లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 713.28 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 584.81 పాయింట్ల వృద్ధితో 81,634.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217.40 పాయింట్లు పెరిగి 25,013.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.76 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం 3.42 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం బలపడ్డాయి. టాటా స్టీల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ మాత్రం రెండు శాతానికి పైగా క్షీణించాయి. కాగా, బీఎస్‌ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.86 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం పుంజుకున్నాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ మినహా అన్నీ పెరిగాయి. సర్వీసెస్ 3.25 శాతం ఎగబాకగా.. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, పవర్, టెలికాం రెండు శాతానికి పైగా పుంజుకున్నాయి. కొనుగోళ్ల జోరుతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.51 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.459.50 లక్షల కోట్లకు (5.47 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో లాభాలు రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి.
- ఇంటర్నేషనల్ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర ఒక దశలో 1.84 శాతం తగ్గి 79.44 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.400 తగ్గి రూ.78,300కు దిగివచ్చింది. కిలో వెండి ఏ మార్పు లేకుండా రూ.94,000 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,655.80 డాలర్లు, సిల్వర్ 31.43 డాలర్ల వద్ద ట్రేడైంది.

హ్యుండయ్ ఐపీఓ ధరల శ్రేణి రూ.1,865-1,960 !?

దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుండయ్‌కి భారత అనుబంధ విభాగమైన హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.25,000 కోట్ల మెగా ఐపీఓ ధరల శ్రేణిని రూ.1,865-1,960 శ్రేణిలో నిర్ణయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ 14 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నెల 22న కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుందని రాయిటర్స్ కథనం పేర్కొంది.

పడి లేచిన ఓలా షేరు

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు మంగళవారం భారీగా ఊగిసలాడింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రాధికార సంస్థ సీసీపీఏ షోకాజ్ నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కంపెనీ షేరు ఉదయం ట్రేడింగ్‌లో 6.17 శాతం వరకు క్షీణించి రూ.85.21 వద్దకు జారుకుంది. మళ్లీ కాసేపటికే తేరుకుని క్రమంగా పుంజుకుంది. చివరికి 5.15 శాతం లాభంతో రూ.95.50 వద్దకు చేరుకుంది.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు సెబీ ఆమోదం

ప్రముఖ డిపాజిటరీ సేవల సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. ఎన్ఎస్‌డీఎల్‌తో పాటు తెలంగాణకు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, జింకా లాజిస్టిక్స్ ఐపీఓలకూ పచ్చజెండా ఊపింది. సెబీకి సమర్పించిన డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా ఎన్ఎస్‌డీఎల్ తన వాటాదారులైన ఎస్‌బీఐ, ఎన్ఎస్ఈ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వాటాకు చెందిన 5.72 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

గ్రీన్‌కో ఎనర్జీకి జీఐసీ గుడ్‌బై!

50% వాటా విక్రయ యోచనలో సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన సంస్థ గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో తనకున్న 50 శాతం వాటాను విక్రయించాలని సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్ జీఐసీ పీటీఈ భావిస్తున్నట్లు సమాచారం. ఈ వాటా విలువ 500 కోట్ల డాలర్ల (రూ.42,000 కోట్లు) స్థాయిలో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంటే, ఈ లెక్కన మార్కెట్లో గ్రీన్‌కో 1,000 కోట్ల డాలర్ల (రూ.84,000 కోట్లు) విలువ చేయనుంది.. గ్రీన్‌కో ఎనర్జీలో తన వాటాను పూర్తిగా లేదా పాక్షికంగా విక్రయించే విషయంపై జీబీసీ ఇప్పటికే ఫైనాన్షియల్ అడ్వైజర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. గ్రీన్‌కో ఎనర్జీ ప్రస్తుతం దేశంలోని 15 రాష్ట్రాల్లో 7.5 గిగావాట్ల పవన విద్యుత్, సోలార్, హైడ్రో పవర్ ప్రాజెక్టులను కలిగి ఉంది. సంస్థలో జీఐసీతో పాటు అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జపాన్‌కు చెందిన ఓరిక్స్ గ్రూప్ కూడా పెట్టుబడులు కలిగి ఉన్నాయి.

హైదరాబాద్‌లో వికీమీడియా టెక్నాలజీ సదస్సు

హాజరైన 130 మంది డెవలపర్లు, రీసెర్చర్లు

హైదరాబాద్: ఇండిక్‌మీడియా వికీ డెవలపర్స్ యూజర్ గ్రూప్, వికీమీడియా ఫౌండేషన్ మద్దతుతో ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ నిర్వహించిన 'వికీమీడియా టెక్నాలజీ సదస్సు 2024' ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 130 మంది డెవలపర్లు, రీసెర్చర్లు, కమ్యూనిటీ లీడర్లు, వివిధ కాలేజీలకు చెందిన వికీక్లబ్ విద్యార్థులు హాజరయ్యారు. ఓపెన్‌సోర్స్ టెక్నాలజీలో ఇటీవలి నవకల్పనలు, వికీమీడియా ప్రాజెక్టుల గురించి ఈ సదస్సులో చర్చించారు. మూడు రోజుల సదస్సులో ఒక రోజు ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ క్యాంపస్‌లో హ్యాకథాన్ జరిగింది. ఇండిక్ లాంగ్వేజీ కమ్యూనిటీలకు అందుబాటులో ఉన్న వివిధ టెక్నాలజీల గురించి మిగతా రెండు రోజుల సదస్సులో చర్చించినట్టు ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి తెలిపారు. ఇండిక్ లాంగ్వేజి వికీమీడియా తయారీలో కృత్రిమ మేథ (ఏఐ) ప్రభావం పైనా ఈ మూడు రోజుల సదస్సులో చర్చ జరిగింది.

స్పైస్‌జెట్‌కు మరో 10 విమానాలు

న్యూఢిల్లీ: వచ్చే నెలకల్లా మరో 10 కొత్త విమానాలు తమ ఫ్లీట్‌లో చేరనున్నాయని స్పైస్‌జెట్ ప్రకటించింది. వాటిలో తొలి విమానం గురువారం అందుబాటులోకి రానుంది. వీటిలో 7 విమానాలను లీజుకి తీసుకుంటుండగా గతంలో వివిధ కారణాల వల్ల గ్రౌండ్‌కే పరిమితం చేసిన మూడు విమానాలను తిరిగి ప్రవేశపెట్టనున్నట్టు స్పైస్‌జెట్ తెలిపింది.

మార్కెట్లోకి బీవైడీ ఈ-మాక్స్ 7



న్యూఢిల్లీ: చైనాకు చెందిన విద్యుత్ కార్ల తయారీ కంపెనీ బీవైడీ కొత్త కారు ఈ-మాక్స్ 7ను దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ మల్టీపర్పస్ వెహికల్ (ఎంపీవీ) ధర రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యన ఉంటుంది. దీన్ని ఎకనామిక్ కమిషన్ ఫర్ యూరోప్ (ఈసీఈ) సర్టిఫికేషన్‌తో మార్కెట్లోకి తెచ్చారు. ఇది ఆరు సీట్లు, ఏడు సీట్ల వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది. భారత కస్టమర్లకు నవ్యత, సుస్థిరతతో కూడిన అత్యంత అధునాతనమైన వాహనాలు అందించాలన్న కట్టుబాటుకు ఇది నిదర్శనమని బీవైడీ ఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ చెప్పారు. విద్యుత్ వాహనాల తయారీలోకి టెస్లా వంటి ప్రపంచ శ్రేణి కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో గత మార్చిలో ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఈవీ విధానం కింద ప్రయోజనాలకు తాము దరఖాస్తు చేసుకోబోవడంలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చౌహాన్ స్పష్టం చేశారు.

ఇళ్ల అమ్మకాలు ధమాల్

హైదరాబాద్‌లో 19% డౌన్: ప్రాప్‌టైగర్

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం నివాస గృహాల మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,01,221 యూనిట్ల నివాస గృహాలు అమ్ముడుపోగా.. ఈ ఏడాది అదే త్రైమాసికంలో విక్రయాలు 5 శాతం తగ్గి 96,544 యూనిట్లకు పడిపోయింది. ప్రాపర్టీ బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్‌పై ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 14,191 యూనిట్ల ఇళ్లు అమ్ముడుపోగా, ఈ ఏడాది 19%తగ్గుదలతో 11,564 యూనిట్లకు పడిపోయాయి.

ధరా'ఘాతం': కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇళ్ల సరఫరా తగ్గడంతో పాటు ధరల పెరుగుదల కూడా సెప్టెంబరు త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలను దెబ్బతీసింది. ఈ సమయంలో దేశంలోని ఎనిమిది నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 20 శాతం పెరిగాయి.

మారుతి సుజుకీ గ్రాండ్ విటారా డొమినియన్ లిమిటెడ్ ఎడిషన్



మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) మార్కెట్లోకి గ్రాండ్ విటారా డొమినియన్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఆల్ఫా, జెటా, డెల్టా వేరియంట్లలో పెట్రోల్, సీఎన్‌జీతో ఇది అందుబాటులో ఉండనుంది. పండగల సీజన్‌ను పురస్కరించుకుని ఈ ప్రత్యేక ఎడిషన్‌ను తీసుకువచ్చినట్లు ఎంఎస్ఐ తెలిపింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ వేరియంట్లలో వరుసగా రూ.52,699, రూ.49,999, రూ.48,599 వరకు విలువ గల యాక్సెసరీస్ కిట్స్‌ను కాంప్లిమెంటరీగా అందించనున్నట్లు మారుతి సుజుకీ వెల్లడించింది.

మన రెగ్యులేటర్ల తీరు భేష్

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

ముంబై: దేశంలోని ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు "ప్రపంచ శ్రేణి" ప్రమాణాలతో పని చేస్తూ వ్యవస్థలో మరింత పారదర్శకత తెస్తున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. రెగ్యులేటర్ల వైఖరులను ప్రశ్నించడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే వారు ఆర్థిక రంగానికి చేస్తున్న విశిష్ట సేవల గురించి కూడా స్పష్టంగా తెలుసుకోవాలని ఆమె సూచించారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకు అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో వెలికి వస్తున్న వాస్తవాలను కూడా ప్రతి ఒక్కరూ పరిశీలించాలని ఆమె సూచించారు. రెగ్యులేటర్లకు సంబంధించిన ఏ అంశం చర్చించాలన్నా వాస్తవాలను కచ్చితంగా పరిశీలించాలని తాను సూచిస్తున్నట్టు చెప్పారు. అయితే తన వ్యాఖ్యలను సెబీ వ్యవహారంతో ముడిపెట్టి చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

క్యాన్సర్ ఔషధంపై రెండో దశ పరీక్షలు

ఆరిజీన్ అంకాలజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ నుంచి మరో క్యాన్సర్ ఔషధం రానుంది. ఎముకల మజ్జలో ఏర్పడే క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం కంపెనీ అనుబంధ సంస్థ ఆరిజీన్ అంకాలజీ లిమిటెడ్ (ఏఓఎల్) అభివృద్ధి చేస్తున్న రిబ్రేకాబ్టజీన్ ఆటోల్యూసెల్ (డీఆర్ఎల్-180) ఔషధం తొలి దశ క్లినికల్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇందుకోసం ఎనిమిది మంది రోగులపై జరిపిన క్లినికల్ పరీక్షలు ఆశావహంగా ఉన్నట్టు తెలిపింది. ఎముకల మజ్జ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులపై మన దేశంలో ఈ తరహా క్లినికల్ పరీక్షలు నిర్వహించడం ఇదే మొదటిసారి. తొలి దశ క్లినికల్ పరీక్షలు ఆశాజనకంగా ఉండడంతో మరింత మంది రోగులపై రెండో దశ క్లినికల్ పరీక్షలకు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) కంపెనీకి అనుమతి ఇచ్చింది. తొలి దశ పరీక్షలకు లోనైన ఎనిమిది మంది రోగుల్లో ఎలాంటి ప్రతికూల ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని ఏఓఎల్ తెలిపింది. ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ వైద్య సదస్సులోనూ ఈ తొలి దశ క్లినికల్ పరీక్షల ఫలితాలను ప్రకటించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▼	70,950 ▼	1,02,000 ▼
ముంబై	75,726 ▼	69,365 ▼	90,412 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	523	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		

50 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా

కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో నిరసనల్లో కీలక పరిణామం

కోల్‌కతా, అక్టోబరు 8: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలనే డిమాండ్లతో నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా దాదాపు 50 మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు ఉదయం జరిగిన డిపార్ట్‌మెంట్‌ల హెడ్‌ల సమావేశంలో నిర్ణయం జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శనివారం నుంచి నిరాహార దీక్ష చేస్తున్న పలువురు జూనియర్ వైద్యులకు సంఘీభావంగా 15 మంది సీనియర్ వైద్యులు మంగళవారం దీక్షలో కూర్చున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ. 46 లక్షలు లూటీ

ఇండోర్, అక్టోబరు 8: ఓ వైపు డిజిటల్ అరెస్టు అనేది మోసమని, కోర్టులు గాని దర్యాప్తు సంస్థలు గాని వీడియో కాల్‌లో అరెస్టులు చేపట్టవని సైబర్ క్రైమ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ ఆ తరహా దాడులు మాత్రం ఆగడం లేదు. తాజాగా మధ్యప్రదేశ్‌కి చెందిన ఓ మహిళ... అదే నేరశైలితో మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు చిక్కి రూ.46 లక్షలు పోగొట్టుకుంది. ఇండోర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొద్దిరోజుల క్రితం బాధిత మహిళ(65)కు సైబర్ ముఠాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ అధికారినని చెప్పాడు. ఆమె బ్యాంకు ఖాతాను డ్రగ్ ట్రాఫికింగ్, ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారని, కాబట్టి మనీలాండరింగ్ నేరం కింద డిజిటల్ అరెస్టు చేశామని చెప్పి 5 రోజుల పాటు చిత్రవధ చేశారు. దీంతో బాధితురాలు రెండు దఫాల్లో వారికి రూ. 46 లక్షలు బదిలీ చేసింది.

కందిలో గంజాయి సాగు.. 2కోట్ల సరుకు సీజ్

బెంగళూరు/గువాహటి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకాలో రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా ఉమర్గా తాలూకా హిప్పరగారావ్‌వాడి గ్రామస్థుడిని అరెస్టు చేశారు. నిందితుడు బసవకల్యాణ తాలూకా ఉజళంబ గ్రామంలో కందిపంట మధ్యలో గంజాయి సాగు చేశాడు. స్థానిక రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని, గంజాయి సాగు చేసినట్టు పోలీసులు గుర్తించారు. అతడి నుంచి 40 కేజీలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరాఠా పోలీసులిచ్చిన సమాచారంతో గంజాయి పంటను గుర్తించామని అధికారులు తెలిపారు. కాగా, అస్సాం రాష్ట్రంలోని బిస్వనాథ్, కాచర్ జిల్లాలలో వివిధ చోట్ల జరిపిన దాడుల్లో సుమారు రూ 11 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మంగళవారం ఎక్స్‌లో ప్రకటించారు. ఒక్క కామరూప్ జిల్లాలోని బోకో వద్ద జరిపిన సోదాల్లోనే 301 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

కమలా హారిస్ గెలిస్తే... నాకు జైలు తప్పదు!

» డెమొక్రాట్లు గెలిస్తే వలసదారులకు పౌరసత్వం: మస్క్

వాషింగ్టన్, అక్టోబరు 8: అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కనుక రానున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే తనకు జైలు తప్పదని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌తో ఓ బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఆయన సోమవారం ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "నాకు ఎన్నాళ్ల జైలుశిక్ష పడుతుందో... నా పిల్లలను తిరిగి చూస్తానో లేదో తెలీదు..." అన్నారు. "ఈ ఎన్నికల్లో ట్రంప్ గనుక గెలవకపోతే మనకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయి" అని పేర్కొన్నారు. లక్షలాదిగా వచ్చే వలసదారులను ప్రోత్సహిస్తోన్న హారిస్-బైడెన్ ప్రభుత్వం రానున్న కాలంలో వారికి పౌరసత్వం కూడా మంజూరు చేసి వారి ఓట్లను కొల్లగొడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోసారి డెమొక్రాట్ల పాలన వస్తే దేశంలో ఏక పార్టీ పాలన వస్తుందని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

సీఎం అభ్యర్థి ఎవరైనా ఓకే!

కాంగ్రెస్, ఎన్సీపీలు ఎవరిని ఎంపిక చేసినా మద్దతు: ఉద్ధవ్



» మహారాష్ట్ర రక్షణే లక్ష్యమని వెల్లడి

ముంబై, అక్టోబరు 8: త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా తమ మద్దతు ఉంటుందని శివసేన(యూబీటీ) పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు సీఎం అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా తమకు అభ్యంతరం లేదని, వారికి మద్దతిస్తామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మహారాష్ట్ర పరిరక్షణే తమ లక్ష్యమని, దీనికి సంబంధించి కూటమి పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా సమర్థిస్తామన్నారు. హరియాణాలో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బతగిలి, బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్ధవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహాయుతి ప్రభుత్వం తప్పుడు ప్రకటనల ద్వారా నకిలీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. 'లడ్కి బహిన్' పథకం కింద వెనుకబడిన వర్గాల్లోని మహిళలకు నెలకు రూ.1,500లు ఇస్తూ గొప్పలు చెబుతోందని, కానీ, వాస్తవానికి ప్రజల సొమ్మును ప్రజలకు ఇస్తూ.. వింత ప్రచారాలతో వారికి ద్రోహం చేస్తోందని దుయ్యబట్టారు. ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్న మహాయుతి ప్రభుత్వం.. అమలులోకి వచ్చేసరికి మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి వచ్చే నెలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని.. "నేను గతంలోనే చెప్పాను. ఇప్పుడు మరోసారి చెబుతున్నా.. కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు వేర్వేరుగా అయినా.. సంయుక్తంగా అయినా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించవచ్చు. వారు ఎవరిని ప్రకటించినా నా మద్దతు ఉంటుంది. ఎందుకంటే.. మహారాష్ట్ర అంటే నాకు ఇష్టం. ఈ రాష్ట్ర పరిరక్షణే నాకు ముఖ్యం. రాష్ట్రాన్ని కాపాడేందుకు ఏదైనా చేయాలన్నదే నా అభిమతం" అని ఉద్ధవ్ పేర్కొన్నారు. గుజరాత్‌కు-దేశంలోని ఇతర రాష్ట్రాలకు మధ్య అడ్డుగోడ నిర్మిస్తున్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలపై ఆయన విమర్శలు గుప్పించారు. గుజరాతీ-మరాఠీ అనే భాషా వివాదాలు మహారాష్ట్రలో లేవని తేల్చిచెప్పారు. తమ పార్టీ ఎవరినీ శత్రువులుగా చూడబోదని, అయితే, దేశ వ్యతిరేకులు, మహారాష్ట్ర వ్యతిరేకులపై మాత్రం తమ యుద్ధం కొనసాగుతుందన్నారు.

తేల్చాల్సింది ఆ పార్టీలే

కాగా, గత ఆగస్టులోనే ఉద్ధవ్ తన మనసులో మాటను చెప్పేశారు. ఎన్నికల ఫలితం వచ్చాక కాదు, ముందుగానే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని, ఎవరిని ఎంపిక చేసినా తన మద్దతు ఉంటుందని చెప్పారు. ఉద్ధవ్ వ్యాఖ్యలకు శివసేన(యూబీటీ) కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ మద్దతు పలికారు. ఆయన చాలా దూరదృష్టితో ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అయితే.. కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు మాత్రం ఎన్నికల ఫలితం వచ్చే వరకు ఈ విషయంపై స్పందించబోమని స్పష్టం చేశాయి. దీంతో ఇప్పుడు ఈ రెండు పార్టీలే తేల్చాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు టీడీపీలోకి బీద, మోపిదేవి

» చంద్రబాబు సమక్షంలో చేరికలు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఇద్దరు రాజ్యసభ మాజీ సభ్యులు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమక్షంలో బీద, మోపిదేవి చేరిక కార్యక్రమం ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మంచి ముహూర్తం కావడంతో ప్రస్తుతానికి వీరిద్దరినీ పార్టీలో చేర్చుకోవాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. తర్వాత వారి అనుచరులతో విడిగా సభ నిర్వహిస్తారని చెబుతున్నారు. మస్తాన్‌రావు, వెంకటరమణ వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వాలకు ఇటీవల రాజీనామా చేశారు. వీరి చేరిక కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు సతీసమేతంగా విజయవాడ కనకదుర్గ ఆలయానికి వెళ్లి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

మంత్రి నారాయణపై విష ప్రచారం

» కార్యకర్తల ఆగ్రహం

టీడీపీ నేతలపై జగన్ మీడియా విషం కక్కుతోందని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల టెండర్లలో మంత్రి నారాయణపై జగన్ సొంత మీడియా అక్కసు వెళ్లగక్కిందని మండిపడుతున్నారు. మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు తానే కడతానని, లాటరీలో దక్కించుకున్న షాపుల ద్వారా యువతకు ఉపాధి చూపిస్తానని టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ బహిరంగంగా మాట్లాడినట్లు జగన్ మీడియా ప్రచారం చేస్తోంది. మంత్రి నారాయణ ఆడియోను ఎడిట్ చేసి, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్లేందుకు జగన్ మీడియా విశ్వప్రయత్నాలు చేస్తోందని మంత్రి అనుచరులు, పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'పీఎం కుసుమ్'లో మేమూ చేరతాం!

» కేంద్రానికి రాష్ట్ర సర్కారు వినతి..

» ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం సమ్మతి

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుమ్) పథకంలో ఏపీని కూడా చేర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విన్నవించింది. ఈ పథకం కింద బంజరు భూములు, రైతుల పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, అన్నదాతలకు మేలు చేస్తామని వివరించింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో.. 'రాష్ట్రాల్లో సౌర విద్యుదుత్పత్తి లక్ష్యాలపై' కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ అధికారులు స్పష్టం చేశారు. 2019-24 కాలంలో పీఎం కుసుమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేదని, దీనివల్ల తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. ఈ పథకంలో ఏపీని చేర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్రం నుంచి జెన్కో, పునరుత్పాదక ఇంధనాభివృద్ధి కార్పొరేషన్ ఎండీ కేవీఎన్ చక్రధరబాబు పాల్గొన్నారు. పీఎం కుసుమ్ పథకంలో ఏపీని చేర్చుకోవాలని కోరుతూ లిఖిత పూర్వక ప్రతిపాదనను సమర్పించారు. రాష్ట్ర ప్రతిపాదనను స్వీకరించిన కేంద్రం.. బుధవారం పునరుత్పాదక విద్యుత్తు రంగంలో చేరుకోవాల్సిన లక్ష్యాలను వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్తు డిమాండ్ ఎంత? పునరుత్పాదక విద్యుత్తు ద్వారా ఎంత డిమాండ్‌ను తట్టుకుంటున్నాయో వివరించాలని కోరారు. పునరుద్పాదక విద్యుదుత్పత్తిలో రాష్ట్రాలు మమేకమైతే.. యూనిట్ 40 పైసలకే ఉత్పత్తి అయ్యే వీలుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో 17.5 లక్షల సోలార్ పంప్‌సెట్లకు కూడా ఈ విద్యుత్‌ను వాడుకునే అవకాశముందని పేర్కొన్నారు. కాగా.. రాష్ట్రంలో ఈ రంగంలో కల్పించే ఉద్యోగ అవకాశాలపై నివేదిక ఇవ్వాలని కేంద్రం కోరింది. వచ్చే నెలలో పునరుద్పాదక విద్యుత్తురంగంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్రం సమావేశాన్ని నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశం బుధవారం జరగనుంది

జగన్ చేసింది ఇదే!

వాస్తవానికి పీఎం కుసుమ్ పథకాన్ని గతంలోనే తీసుకువచ్చినా.. అప్పటి జగన్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేందుకు విముఖత వ్యక్తం చేసింది. అంతేకాదు, ఈ పథకానికి సంబంధించి రాష్ట్రం తరఫున ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదు. రైతులకు చౌకగా లభించే సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై రాష్ట్రం దృష్టి సారించలేదు. మరోవైపు అధిక ధరలకు సెకీ నుంచి 7000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని చేసుకున్నారు. దీంతో అత్యంత కీలకమైన సౌర విద్యుత్ పథకానికి గత ఐదేళ్లు ఏపీ దూరమైంది.

ఏంటీ పథకం?

పీఎం కుసుమ్ పథకం పూర్తిగా సౌర విద్యుదుత్పత్తికి సంబంధించింది. ఇది రైతులకు ఎంతో మేలు చేసే పథకం. కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేసే ఈ పథకం కింద.. దేశంలో 10,000 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేయాలన్నది ప్రధాన లక్ష్యం. రాష్ట్రాలు తమ బంజరు భూములను సౌర విద్యుత్తు ప్లాంట్లుగా మార్చుకోవచ్చు. అదేవిధంగా రైతులు తమ పొలాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. సోలార్ ప్యానళ్ల తయారీ.. విద్యుదుత్పత్తికి డిస్కమ్‌లు ప్రోత్సాహాన్ని అందిస్తాయి.

ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' విఫలం!

హెజ్‌బొల్లా రాకెట్లను అడ్డుకోలేకపోయిన గగనతల రక్షణ వ్యవస్థ

» హైఫాలో ఐడీఎఫ్ శిబిరాలే లక్ష్యంగా దాడులు



బీరుట్, అక్టోబరు 8: హిజ్బుల్లా రాకెట్లు, క్షిపణి దాడులను అడ్డుకోవడంలో తమ గగనతల రక్షణ వ్యవస్థ (ఐరన్ డోమ్) విఫలమైందని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని హైఫాలో ఇజ్రాయెల్ భద్రతా దళాలు, రెండు ఐడీఎఫ్ శిబిరాలే లక్ష్యంగా ఆదివారం హెజ్‌బొల్లా దాడులు చేసింది. రాకెట్లు, క్షిపణులతో 18 దాడులు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. రాకెట్ దాడుల ప్రభావం, ప్రాణ, ఆస్తి నష్టంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులను తీవ్రతరం చేస్తామని హెజ్‌బొల్లా తాత్కాలిక అధినేత షేక్ నయీం కాసెం హెచ్చరించారు. తమ బలగాలు చెక్కుచెదరకుండా, చాలా దృఢంగా ఉన్నాయని చెప్పారు. సీనియర్ కమాండర్ల స్థానాలన్నింటినీ భర్తీ చేశామని వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా చీఫ్ సహా పలువురు అగ్రనేతలు, సీనియర్ కమాండర్‌లు హతమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హెజ్‌బొల్లా బలహీనపడిందన్న వార్తలు వచ్చాయి. కాగా, గత వారం ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ భూభాగంలోకి చొరబడిన సంగతి తెలిసిందే. అయితే ఇజ్రాయెల్ దళాలు అంతకుమించి ముందుకు రాలేకపోతున్నాయని నయీం చెప్పారు. "మేం వందలాది రాకెట్లు, పదుల సంఖ్యలో డ్రోన్లతో దాడులు చేస్తున్నాం. ఇజ్రాయెల్ దళాల శిబిరాలు, పలు నగరాలపై దాడులు చేస్తున్నాం" అని నయీం తెలిపారు. ఇజ్రాయెల్‌ను సమర్థంగా ఎదుర్కోగలమని, తమ ఫైటర్లను భారీ సంఖ్యలో మోహరించామని చెప్పారు. మంగళవారం బీరుట్‌లో చేసిన దాడిలో హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ సుహైల్ హుస్సేనీని హతమార్చినట్లు ఐడీఎఫ్ వర్గాలు ప్రకటించాయి. దీనిపై హెజ్‌బొల్లా స్పందించలేదు. కాగా, సెప్టెంబరులో ప్రారంభమైన ఈ పోరులో లెబనాన్‌లో ఇప్పటి వరకు 1300 మందికిపైగా మరణించారు. 10 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

టీడీపీకి అనుకూలంగా ఉన్నందుకు

రౌడీ షీట్!

» వైసీపీ అరాచకాలపై రైతు ఆవేదన

» ఎన్టీఆర్ భవన్‌లో వినతులు స్వీకరించిన మాజీ మంత్రులు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాన్య రైతునైన తనపై వైసీపీ పాలనలో రౌడీ షీట్ పెట్టి వేధించారని క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పూజల కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పల్లె రఘునాథరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 'మేం మా గ్రామంలో టీడీపీకి అనుకూలంగా ఉన్నామని ఒక మహిళతో అక్రమ కేసు పెట్టించారు. స్టేషన్ స్టేషన్‌కు తిప్పి పోలీసులతో దారుణంగా కొట్టించారు. ఇవి అక్రమ కేసులని తేలడంతో కోర్టు కొట్టివేసింది. అయినా నాపై రౌడీ షీట్ పెట్టారు. వారం వారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇబ్బంది పెడుతున్నారు' అని కోటేశ్వరరావు వాపోయారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడినందుకు తనతోపాటు తన భార్య, కుమారుడిపై కూడా అక్రమ కేసులు పెట్టారని సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అంచుల నరసింహరావు ఫిర్యాదు చేశారు. ఈ కేసుల వల్ల తన కొడుకు అమెరికా ప్రయాణం ఆగిపోయిందని తెలిపారు. కరోనాతో చనిపోయిన తన అన్న వదినలకు మూగ చెవిటి సమస్య ఉన్న 15ఏళ్ల కూతురు ఉందని, ఆమె కొద్దిపాటి భూమిని రమణా రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడని నెల్లూరు జిల్లా ఇందుకూరిపేట మండలం జేజే పేట గ్రామానికి చెందిన పీలం రవీంద్ర ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో భర్తీ చేయబోయే కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్ టీచర్ల నియామకాల్లో గతంలో పనిచేసిన తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కంప్యూటర్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంటి శేఖర్ విజ్ఞప్తి చేశారు. ఇల్లు కట్టించి ఇస్తానని రూ.45 లక్షలు తీసుకొని మోసం చేశాడని విజయవాడకు చెందిన మాచినేని కోటేశ్వరరావుపై తెలంగాణలోని మణుగూరుకు చెందిన అడుసుమల్లి గోపాల కృష్ణ కుమార్ ఫిర్యాదు చేశారు. ఇంకా అనేకమంది తమ వ్యక్తిగత సమస్యలపై అర్జీలందించి పరిష్కరించాలని కోరారు.

నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

» 'పిఠాపురం బాలిక' అత్యాచారం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందన

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): "పిఠాపురం పట్టణానికి చెందిన బాలికపై మాధవపురం చెత్త డంపింగ్ యార్డు వద్ద అఘాయిత్యం జరిగిందని తెలిసి చాలా బాధపడ్డాను. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. "ఈ అమానుష చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అప్రమత్తంగా ఉండాలి. వైద్య సేవలు అందించాలని జిల్లా అధికారులను ఆదేశించా. బాధితురాలికి, ఆమె కుటుంబసభ్యులకు సహాయసహకారాలు అందిస్తాం. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

నోటితో తిడితే రూ.కోటితో కొట్టారు!

ఫైబర్‌నెట్ పద్దు కింద నాడు 6కోట్ల నజరానా.. జగన్ పైశాచిక ఆనందానికి పరాకాష్ఠ

» నాగార్జున యాదవ్‌కు నెలకు 1.10లక్షల వేతనం

» బాబు కుటుంబం, పవన్‌లను తిట్టడమే డ్యూటీ

» కూటమి సర్కారులోనూ మారని ఫైబర్‌నెట్ తీరు

» వారంక్రితమే ఓ వైసీపీ కార్యకర్తకు ఉద్యోగపత్రం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో ప్రతిపక్షాలను తిట్టినందుకు రూ. కోట్లలో ప్రజాధనం చెల్లించారు. పేటీఎం బ్యాచ్‌లకు అప్పట్లో ఫైబర్‌నెట్‌లో ఉద్యోగ పత్రాలు ఇచ్చి.. నెలకు రూ. 12,000 నుంచి రూ. 1,11,000 వరకు వేతనాలు ఇచ్చారు. అదుపు తప్పి ఏకవచనంతో ప్రతిపక్ష నేతలను, వారి కుటుంబంలోని మహిళలను తిట్టడమే అర్హతగా ఫైబర్‌నెట్, డిజిటల్ నెట్, డ్రోన్ కార్పొరేషన్లలో చేర్చుకున్నారు. ఇలా మూడేళ్లలో దాదాపు రూ. ఆరు కోట్లకుపైగా పేటీఎం బ్యాచ్‌లపై వెచ్చించారు. సరే..పోనీ అది జగన్ అరాచక పోకడ అనుకుంటే, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆయ విభాగాల్లో వారే తిష్ఠ వేసుకుని ఉన్నారు. పైగా, కొత్తగా జగన్ మనుషులు ఉద్యోగ పత్రాలతో ఫైబల్‌నెట్‌లో ఎంచక్కా చేరిపోతున్న తీరు చర్చనీయాంశంగా మారింది. జగన్ తన ఐదేళ్ల పదవీకాలమంతా రాజకీయ కక్ష సాధింపులను, వ్యక్తిత్వ హనన చర్యలను ప్రోత్సహించారు. ఉదాహరణకు వయోబేధం, లింగబేధం లేకుండా ఏది పడితే అది మాట్లాడేస్తారంటూ ఆరోపణలున్న యనమల నాగార్జున యాదవ్ అనే వ్యక్తికి ఫైబర్‌నెట్‌లో ఉద్యోగం ఇచ్చారు. సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు హోదాలో ఆయన 2020 అక్టోబరు ఒకటో తేదీ నుంచి 2023 నవంబరు 30వ తేదీదాకా, మూడేళ్లపాటు - నెలకు రూ.1,10,000 చొప్పున 36 నెలలకు 39,60,000 అందుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా యనమల నాగార్జున యాదవ్ ఫైబర్‌నెట్ ద్వారా రాష్ట్రానికి అందించిన సేవలేవీ లేవు. ప్రతిరోజూ ఉదయమూ .. సాయంత్రమూ నీలి మీడియా నిర్వహించే చర్చల్లో పాల్గొంటూ .. వయస్సులోనూ.. రాజకీయానుభవంలోనూ ఎంతో పెద్దవారైన చంద్రబాబును కూడా ఏకవచనంతో సంబోధిస్తూ తిట్టడమే నాగార్జున యాదవ్ డ్యూటీ. గత ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ నుంచి నాగార్జున యాదవ్‌ను వైసీపీ అభ్యర్థిగా జగన్ నిలపాలనుకున్నారు. కానీ, ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే అభ్యర్థులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. ఫైబర్‌నెట్‌లోని మరో వైసీపీ నాయకుడు మనోహర్ నాయుడుకు నెలకు రూ.80, 000 చెల్లించారు. వీరు ఏనాడూ కార్యాలయంలో అడుగుపెట్టలేదు. వీరికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన మాజీ ఎండీ మధుసూదనరెడ్డికి పరిచయమే లేదు. జగన్ చెప్పారు...మధుసూదనరెడ్డి పాటించారు... అంతే..

కొసమెరుపు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా, ఇప్పటికీ ఫైబర్‌నెట్‌లో జగన్ నీలి మీడియా కుటుంబం ఉన్నత స్థానాల్లోనే కొనసాగుతోంది. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు సన్నిహితుడైన ఓ కార్యకర్తను వారంరోజుల కిందటే ఫైబర్‌నెట్‌లోకి తీసుకున్నారు. నిజానికి, ఆయన జగన్ హయాంలో ఫైబర్‌నెట్‌లో చేరి... కూటమి ప్రభుత్వం ఏర్పడేవరకు ఉన్నారు. ఆ తర్వాత మూడునెలలకు మరోసారి ఆయనకు తిరిగి అపాయింట్‌మెంట్ ఇవ్వడం గమనార్హం. ఉద్యోగంలో చేరిన మొదటిరోజు నుంచీ ఆయన...ఫైబర్‌నెట్ కార్యాలయ సమాచారాన్ని వైసీపీకి తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ఇదంతా చూసినవారు, ఫైబర్‌నెట్‌లో జగన్ ప్రభుత్వమే ఇంకా రాజ్యమేలుతుందా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

పవర్ కార్పొరేషన్ సీఎఫ్‌వోగా రమణారెడ్డి పునర్నియామకం

» నాడు వైసీపీ అధికారిగా ముద్ర, రిటైర్మెంట్ తర్వాతా అదే హోదాలో..

» జగన్ పత్రిక మాజీ రిపోర్టరు కోసం మంత్రి సిఫారసు

» ప్రభుత్వశాఖల్లో వైసీపీ హల్‌చల్‌పై సర్వత్రా విస్మయం

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ శాఖల్లో గతంలో కీలక విభాగాల్లో పనిచేసిన వైసీపీ అధికారులు ఇప్పటికీ హల్‌చల్ సృష్టిస్తున్నారు. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో (ఏపీపీఎఫ్‌సీ) సీఎఫ్‌వోగా రమణారెడ్డి పనిచేసి గత నెలలోనే పదవీ విరమణచేశారు. గత ఐదేళ్లు జగన్ మనిషిగానే కొనసాగారన్న విమర్శ ఆయనపై ఉంది. అలాంటి అధికారికి రిటైర్మెంట్ తర్వాతా ఎక్కడా ప్రాధాన్యత తగ్గలేదు. తిరిగి చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్‌గా ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆయన బాధ్యతలోకి వచ్చారు. గతంలో జగన్ పత్రికలో పనిచేసిన రఘురామిరెడ్డి వైసీపీ హయాంలో ఏపీ జెన్కోలో ఉద్యోగిగా పనిచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆయన వైదొలిగారు. అయితే, రఘురామిరెడ్డిని జెన్కోలోకి తిరిగి తీసుకోవాలంటూ, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సీనియర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిఫారసు చేశారు. మరోవైపు కూటమి ప్రభుత్వం రాగానే ఫైబర్‌నెట్‌లో ప్రక్షాళన తప్పదని అంతా భావించారు. అంతగా ఆ కార్పొరేషన్ భ్రష్టు పట్టిపోయింది. అయితే, అప్పట్లో ప్రతిపక్షనేత చంద్రబాబుపై కేసులు పెట్టించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారుల్లో కొందరు ఇప్పటికీ అదే సంస్థలో హడావుడి చేస్తున్నారు. ఫైబర్‌నెట్‌లో వైసీపీ అధికారిగా పరమేశ్వర్ వ్యవహరించారు. అయినా, ఆయనను ఫైబర్‌నెట్‌లోనే కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు బంధువైన శరత్‌ను మళ్లీ ఫైబర్‌నెట్‌లోకి ఐదెంకల జీతభత్యాలు ఇచ్చి తీసుకున్నారు.

జిల్లాకో ఆహార పరీక్షా ల్యాబ్

» తిరుమల, కర్నూలు జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల ఏర్పాటు

» ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ఒప్పందం.. ఫలితంగా 88.41 కోట్లు రాక

» మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఉన్నతాధికారుల సంతకాలు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆహార భద్రతా ప్రమాణాల చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామని, దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాలను పెంపొందించడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాడర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి. కమలవర్ధనరావు, ఏపీ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సి. హరికిరణ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇనోషి వర్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామని జి. కమలవర్ధనరావు తెలిపారు. ఈ ఒప్పంద వల్ల రాష్ట్రానికి రూ.88.41 కోట్ల వరకు నిధులు రానున్నాయి. ప్రతి జిల్లాలోనూ ఆహార పరీక్ష ల్యాబ్ ఏర్పాటు చేయాలని మంత్రి కోరగా.. దీనికి కమలవర్ధనరావు అంగీకరించారు. తాజా ఒప్పందం మేరకు రూ.20 కోట్లతో తిరుమలలో, మరో రూ.20 కోట్లతో కర్నూలులోనూ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ ల్యాబ్‌లను నెలకొల్పనున్నారు. ఏలూరు, ఒంగోలులో ప్రాథమిక ఆహార పరీక్షల ప్రయోగశాలలను ఒక్కొక్కటీ రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లతో పాటు అదనంగా మరో 22 ల్యాబ్‌లను 'టర్న్‌కీ' విధానంలో వినియోగించేందుకు అంగీకారం కుదిరింది.

పంచాయతీరాజ్‌లో ప్రక్షాళన!

» అంతర్గత బదిలీలు చేపట్టిన కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆ శాఖలో ప్రక్షాళన ప్రారంభించారు. బదిలీల సందర్భంగా ఫైళ్లను క్లియర్ చేసేందుకు జరిగిన అక్రమాలపై 'పీఆర్ కమిషనరేట్ సిబ్బంది చేతి వాటం' శీర్షికన గతనెల 20న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ బదిలీల ప్రక్రియ పూర్తయిన వెంటనే కమిషనరేట్‌లో గత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన గ్రామీణాభివృద్ధిశాఖ అడ్మిన్‌ను ఇప్పటికే బదిలీ చేసి ఆ స్థానంలో డీఎల్‌డీఓ సుధాకర్‌ను నియమించారు. అలాగే పలువురు అధికారులకు స్థానచలనం కల్పించిన కమిషనర్ తాజాగా పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో అంతర్గతంగా సీట్లు మార్పు చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అవినీతి రహిత పరిపాలన అందించేందుకు కమిషనరేట్ నుంచి కింది స్థాయి దాకా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నవంబరులో జిల్లా, మండల స్థాయిలో ఉపాధి హామీ పథకం సిబ్బందిని బదిలీ చేసేందుకు షెడ్యూల్ రూపొందిస్తున్నారు.

నమ్మకస్తుడే నగల కోసం చంపేశాడు

» స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి అతడి సాయంతో హత్య

» ధర్మవరం సీఐ తల్లి అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

» సొంత ఊరివాడే ప్రధాన నిందితుడు.. బెంగళూరులో అరెస్ట్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 8: ఓ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తల్లిని.. నమ్మకంగా ఉండే.. అదీ సొంతూరుకే చెందిన వ్యక్తి నగల కోసం హత్యచేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని పూడ్చిపెట్టి నగలను కుదవపెట్టి జల్సా చేశాడు. ఆ తర్వాత బెంగళూరుకు పారిపోయిన అతడిని, సాంకేతిక సాయంతో పోలీసులు పట్టుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన నాగేంద్రప్రసాద్ ధర్మవరం వన్‌టౌన్‌లో సీఐగా పనిచేస్తున్నారు. వాల్మీకిపురం మండలం మంచూరు వీరి స్వగ్రామం. తల్లి స్వర్ణకుమారి(62) మదనపల్లె పట్టణ శివారులోని జగన్ కాలనీలో సొంతింటిలో ఒంటరిగా నివసిస్తున్నారు. ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ చుట్టుపక్కల అందరితో కలివిడిగా ఉండేవారు. స్వర్ణకుమారి ఇంటి ఎదురుగా ఉండే వీరి సొంతూరికే చెందిన వెంకటేశ్ అనే యువకుడు ఆమెకు అవసరమైన సరుకులు తెచ్చిస్తూ సహాయంగా ఉండేవాడు. ఆమె వద్ద రూ.5లక్షల అప్పు తీసుకున్నాడు. గత నెల 28వ తేదీ ఉదయం ఓ పూజారి వద్దకు తీసుకెళ్తానని వెంకటేశ్ ఆమెను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. మూడు రోజులైనా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కాలనీ వాసులు స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్రప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఈనెల 2 మదనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. స్వర్ణకుమారి నగలను పట్టణంలోని ప్రైవేటు ఫైనాన్స్‌లో వెంకటేశ్ కుదవ పెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఈ డబ్బులో కొంత ఇంట్లోనే దాచిపెట్టి, మిగిలిన డబ్బు తీసుకుని పరారయ్యాడు. మొబైల్‌ఫోన్, సిమ్ కార్డులు ఇక్కడే పడేసి వెళ్లిపోయాడు.

స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ పెట్టి దొరికాడు..

బెంగళూరులో ఉన్న వెంకటేశ్ మరో ఫోన్, సిమ్ వాడుతున్నట్లు అనుమానం వచ్చిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు మొదలెట్టారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్ స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ పెట్టడాన్ని గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం అతడిని వెంటబెట్టుకుని మదనపల్లె వద్ద అయోధ్యనగర్ సమీపంలోని శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడ ఓ సమాధి కింద పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం, ఆపక్కనే మరో గోయి తవ్వి తల్లి మృతదేహానికి సీఐ నాగేంద్రప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించారు. మదనపల్లె పట్టణం గజ్జెలకుంటకు చెందిన అనిల్ అనే యువకుడు వెంకటేశ్‌కు స్నేహితుడు. అతని ఇంటిలోనే స్వర్ణకుమారిని హత్యచేశాడు. మృతదేహాన్ని గోనెసంచెలో చుట్టి కారులో తీసుకెళ్లి శ్మశానవాటికలో పూడ్చిపెట్టారు. అనిల్ ఇంకా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్, అనిల్ గంజాయికి అలవాటు పడి నేరాలు చేసినట్లు సమాచారం.

పోలవరం అంచనాల్లో భారీ కోత!

▸ పీపీఏ తీరుపై ప్రభుత్వం విస్మయం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ అంచనాలకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) భారీగా కోతపెట్టింది. వచ్చే మార్చి నెలాఖరు దాకా డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం సహా ఇతర కీలక పనులు చేపట్టేందుకు రూ.7,218.68 కోట్లు కావాలని రాష్ట్రప్రభుత్వం కోరింది. కానీ వీటికి రూ.4,941.92కోట్లు చాలని పీపీఏ పేర్కొనడంపై రాష్ట్ర జల వనరుల శాఖ విస్మయం వ్యక్తం చేస్తోంది. పోలవరం తొలిదశ పనులకు, భూ సేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలకు రూ.12,567 కోట్లు కావాలని జల శక్తి శాఖను రాష్ట్రం కోరింది. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఈ శాఖ ప్రాజెక్టు పనుల్లో వేగాన్ని పెంచేందుకుగాను రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన ఆ మొత్తాన్నీ విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు సిఫారసు చేసింది. ఈ సిఫారసులను ఈ ఏడాది మే నెలలో కేంద్ర కేబినెట్ ఆమోదానికి ఆర్థిక శాఖ పంపింది. రూ.12,567 కోట్లకు కేంద్ర కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ఇందులో 7,218.68 కోట్లను 2024-25కిగాను మంజూరు చేయాలని రాష్ట్రం కోరింది. సదరు ప్రతిపాదనలను పీపీఏ మదింపు చేసి.. ఏకంగా రూ.2,276.76 కోట్లకు కోత వేసింది. 4,941.92 కోట్లకు మాత్రమే ఆమోదిస్తూ గత నెల 30వ తేదీన జలశక్తి శాఖకు పంపింది. ఆ శాఖ వెంటనే ఆమోదించింది. దీనిపై రాష్ట్ర జలవనరుల శాఖ విస్తుబోయింది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం పొందినందున.. నిధులు వస్తాయని కొండంత ఆశతో ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి విడుదల చేసే నిధుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని జలశక్తి శాఖ రాష్ట్రాన్ని ఆదేశించింది. కేంద్ర ప్రాయోజిత పథకం కింద పోలవరాన్ని నిర్మిస్తున్నందున ప్రత్యేక అకౌంట్‌ను ప్రారంభించేందుకు సీఎస్‌పీ నంబర్‌ను పంపాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దీనిపై ఇంతవరకు స్పందన లేదు. ఇంకోవైపు.. అడ్వాన్సుగా నిధులివ్వడంపై కేంద్ర ఆర్థికశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. సొంతగా వ్యయం చేయడానికి రాష్ట్రప్రభుత్వాన్ని నిధుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచే యోచనలో ఆ శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

పీపీఏ కోత ఇలా.. (రూ.కోట్లలో)

వివరాలు	రాష్ట్రం కోరింది	పీపీఏ సిఫారసు
హెడ్‌వర్క్స్	1,509.3	1,183
భూసేకరణ	1,291.88	781.2
సహాయ పునరావాసం	3,138.53	2,269.24
పీపీఏ ఎస్టాబ్లిష్‌మెంట్		36.72
మొత్తం	5,939.71	4,270.15
2023 ఏప్రిల్ 1 నుంచి 2024 ఆగస్టు 31 దాకా జరిగిన పనులు	1,278.97	571.77
మొత్తం	7,218.68	4,841.92

16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

▸ 40 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలి

▸ వీడియో కాన్ఫరెన్సులో మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 16 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. వాటిని సమర్థవంతంగా నిర్వహించాలి. రాష్ట్రంలో 6,219 సాగునీటి సంఘాలకు, 252 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 56 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు పూర్తి చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను 40 రోజుల్లో పూర్తి చేయాలి' అని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. వెలగపూడి సచివాలయంలోని తన చాంబర్ నుంచి మంగళవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వర రావు, జిల్లాల కలెక్టర్లు, జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'కార్డులున్న కౌలుదారులు కూడా ఓటింగ్‌కు అర్హులే. కౌలు కార్డులు లేని చోట ఒరిజినల్ భూయాజమానులు ఓటర్లుగా ఉంటారు. జిల్లా కలెక్టర్లు సమస్యాత్మక సంఘాలను గుర్తించాలి. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలి. లోకలైజేషన్ పూర్తయిన కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలను కూడా జిల్లా కలెక్టర్లు, కమిషనర్‌కు పంపాలి. పునర్విభజన పూర్తయ్యాక రెవెన్యూ శాఖ ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తుంది. సాగునీటి శాఖ విస్తీర్ణాన్ని నిర్ణయిస్తుంది. గడచిన ఐదేళ్లలో సాగునీటి రంగానికి బడ్జెట్‌లో అంతంత మాత్రంగా కేటాయింపులు చేశారు. వాటిని కూడా వ్యయం చేయలేదు. సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు కూడా జగన్ ప్రభుత్వం చేయలేదు' అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

శరవేగంగా అభివృద్ధి!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. గ్రామాల్లో మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంచేందుకు గాను మంజూరైన పనులకు పండుగ వాతావరణంలో భూమి పూజ చేయడానికి సంకల్పించామన్నారు. మంగళవారమిక్కడ సచివాలయం నుంచి ఆయన రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, కలెక్టర్లు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి పంచాయతీకి నిధుల సమస్య లేకుండా చూస్తున్నామని, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500ను కేంద్రం రాష్ట్రానికి మంజూరుచేసిందని తెలిపారు. గ్రామీణ కుటుంబాలకు నివాసముంటున్న గ్రామాల్లో ఏడాదిలో కనీసం వంద రోజులు వేతన ఉపాధి కల్పించడం, సుస్థిర ఆస్తులను ఏర్పాటు చేసి జీవనోపాధులు మెరుగుపరచడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశమని గుర్తుచేశారు. పని కోరిన 15రోజుల్లో పనిపొందే హక్కు.. లేనట్లయితే నిరుద్యోగ భృతి, పని ప్రదేశం నివాసానికి 5 కి.మీ కంటే దూరముంటే రోజూ కూలీలకు అదనంగా 10 శాతం వేతనం, పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించడం, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వేతన రేటు రూ.300 ఇవ్వడం, పని ప్రదేశంలో మరణించిన కూలీలు మరణించినా, లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి రూ.50 వేల నష్ట పరిహారం వంటి హక్కులను ఉపాధి కూలీలకు కల్పించాలని స్పష్టంచేశారు. 13,326 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 23న గతంలో ఎప్పుడూ లేని విధంగా అందరి సహకారంతో ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించామన్నారు. ఇందుకు వరల్డ్ రికార్డు యూనియన్ అవార్డు అందుకున్నామని, ఈ కార్యక్రమం మీ అందరి సహకారంతో చేయగలిగామని అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ వంద రోజుల్లో ఉపాధి హామీ కూలీలకు రూ.4.66 కోట్ల పనిదినాలను కల్పించడంతో పాటు 1.07 లక్షల కుటుంబాలకు వంద రోజుల పనిదినాలను కల్పించగలిగామన్నారు. అలాగే 46,745ఎకరాల రైతు భూముల్లో ఉద్యానవన పంటల మొక్కలు నాటించామన్నారు. గ్రామ సభల తీర్మానాల ఆధారంగా ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు 26,715 పనులకు రూ.2,239 కోట్లు కలెక్టర్లు పరిపాలనామోదం ఇచ్చారన్నారు. మిగిలిన రూ.474 కోట్ల పనులకు పరిపాలన ఆమోదం త్వరితగతిన ఇవ్వాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కావలసిన9 కోట్ల పనిదినాలకు (విలువ రూ.4,500 కోట్లు) గ్రామ సభల ఆమోదం తీసుకున్నామని తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అన్నీ గ్రామ పంచాయతీల్లో 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో పనులకు పెద్దఎత్తున భూమి పూజ చేయాలన్నారు. శాసనసభ్యులకు ఈ కార్యక్రమం గురించి తెలియజేయాలని.. శంకుస్థాపన కోసం పంచాయతీలు, ఎమ్మెల్యే వారీగా రోజువారీ రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు తరహాలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేద్దామని పిలుపిచ్చారు. ప్రతి పంచాయతీలో 2024-25లో చేపట్టబోయే పనులు, పూర్తి చేసిన పనుల వివరాలతో నాలెడ్జ్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ ఏడాదిలో 25.50 కోట్ల పనిదినాలు...

2024-25 ఆర్థిక సంవత్సరానికి 25.50 కోట్ల పనిదినాలు, అలాగే 8 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని ఇవ్వడానికి సంకల్పించామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటి దాకా 17.95 కోట్ల పనిదినాలు కల్పించామని, 1.30 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించామన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో 3 వేల కి.మీ సిమెంటు రోడ్లు, 500 కి.మీ బీటీ రోడ్లు, 65 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు, 25 వేల పంటకుంటలు, 22,525 గోకులాలు, 30 వేల ఎకరాల్లో కందకాలు అందుబాటులోకి తేవాలని సంకల్పించామని చెప్పారు. ఇప్పటికే 200 కి.మీ సిమెంట్‌రోడ్లు, 50 కి.మీ బీటీ రోడ్లు, 53,257 ఎకరాల్లో ఉద్యానవన పంటలు, 11,512 మినీ గోకులాలు, 20,145 ఎకరాల్లో కందకాలు పూర్తయ్యాయని.. మిగిలిన వాటిపై కలెక్టర్లు జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహించి సకాలంలో పూర్తి చేసేందుకు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. నీటి ఎద్దడి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చెక్‌డ్యాంలు, కుంటలు నిర్మించి భవిష్యత్‌లో నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థల భవనాల్లో పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలతో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ కట్టడాలను నిర్మించాలని తెలిపారు. ఇప్పటికే ప్రారంభించిన పనుల్లో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లను సంక్రాంతినాటికి పూర్తిచేసి పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో మళ్లీ ఘనంగా పల్లె పండుగ నిర్వహించుకుందామని కలెక్టర్లకు ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇసుక, సిమెంటు తదితర విషయాల్లో వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

వరద ఖర్చుపై వైసీపీ దుష్ప్రచారం

బాధితుల కడుపు నింపడంపైనా విషప్రచారమేనా: పట్టాభి విమర్శ



అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 'కనీవినీ ఎరుగని వరద బీభత్సానికి అతలాకుతలమైన బాధితులను ఆదుకోవడానికి రూ.200 కోట్లు ఖర్చు చేస్తే.. రూ.534 కోట్లు ఖర్చు చేసినట్లు వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. నోటికి వచ్చిన అంకెలు చెపుతోంది' అని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం మండిపడ్డారు. మంగళవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వరదలు ముంచెత్తినప్పుడు బాధితుల కడుపు నింపితే జగన్‌రెడ్డి దానిపై కూడా విష ప్రచారం చేస్తున్నారు. వైసీపీ హయాంలో గోదావరి వరదల్లో మునిగిపోయిన వారికి రెండు బంగాళా దుంపలు, రెండు టమాటాలు ఇచ్చి జగన్ చేతులు దులుపుకొన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉదారంగా సాయం చేసి మంచి పేరు తెచ్చుకోవడాన్ని జగన్ భరించలేకపోతున్నారు. తన హయాంలో వైసీపీ రంగులు వేయడానికి రూ.3,000 కోట్లు దుబారా చేసిన విషయం జగన్‌కు గుర్తు రాలేదా? ఏ మొహం పెట్టుకొని ఆయన పార్టీ మాట్లాడుతోంది? వరదలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం తన బాధ్యతగా చంద్రబాబు పనిచేశారు. వారిని ఆదుకోవడానికి చేసిన ఖర్చు రూ.140కోట్లు. పౌర సరఫరాలశాఖ ద్వారా రూ.63కోట్ల విలువైన బియ్యం, ఇతర నిత్యావసరాలు సరఫరా చేశారు. మొత్తం కలిపి రూ.203 కోట్లు బాధితుల కోసం ఖర్చు చేశారు. భోజనాలకు 1.15 కోట్ల ప్యాకెట్లు సరఫరా చేశారు. ఒకో ప్యాకెట్ ఖర్చు రూ.50. మొత్తం ఖర్చు రూ.57 కోట్లు. జగన్ తన పత్రికలో దీనికి రూ.368 కోట్లు ఖర్చు చేసినట్లు రాశారు. ఏమైనా పొంతన ఉందా? అర లీటర్ మంచినీళ్ల బాటిల్ రూ.ఏడు, లీటర్ బాటిల్ రూ.13 చొప్పున ఒక 1.20 కోట్ల బాటిళ్లు సరఫరా చేశాం. మొత్తం ఖర్చు రూ.11కోట్లు. రూ.26కోట్లని జగన్ చెబుతున్నారు. వీధులు, కాల్వలు శుభ్రం చేసి బురద, మట్టి, పూడిక తొలగించడానికి రూ.18 కోట్లు ఖర్చు చేస్తే రూ.50 కోట్లు దోచేశారని ప్రచారం చేస్తున్నారు. కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు పైసా ఖర్చు చేయకపోయినా రూ.23కోట్లు ఖర్చు చేశారని దుష్ప్రచారం చేయడం జగన్‌కే చెల్లింది. సర్వే రాళ్లపై తన బొమ్మ వేసుకోవడానికి జగన్ రూ.700 కోట్లు ఖర్చు చేశారు. దానివల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగం కలిగిందా? రుషికొండ ప్యాలెస్‌కు రూ.600 కోట్లు, పాసు పుస్తకాలపై తన బొమ్మ వేసుకోవడానికి రూ.13 కోట్లు, సొంత పత్రికలో ప్రభుత్వ ప్రకటనలకు రూ.500 కోట్లు, ఇంట్లో ఎగ్ పఫ్‌లకు రూ.3.5 కోట్లు, తాడేపల్లిలో ప్యాలెస్ విలాసాలకు రూ.15 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో ప్రజలకు పెట్టింది ఏమైనా ఉందా? జగన్... ఇంకా ఏ మొహం పెట్టుకొని మాట్లాడుతున్నావు?' అని ఆయన ప్రశ్నించారు. వరదల్లో నష్టపోయిన బాధితులకు రూ.కోటి విరాళం ప్రకటించిన జగన్ ఇంతవరకూ దానిని ఎవరికీ ఇవ్వలేదని పట్టాభి ఆరోపించారు. వరదలొచ్చినా రెడ్ కార్పెట్ వేస్తే తప్ప ఆయన నేలపై కాలు పెట్టడని పట్టాభి ఎద్దేవా చేశారు.



నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ కోర్టులో నాగార్జున, అమల, నాగసుశీల, సుప్రియ, నాగచైతన్య

కుటుంబ గౌరవానికి భంగం కలిగింది

▸ క్రిమినల్ పరువు నష్టం కేసులో నాగార్జున వాంగ్మూలం

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో తమ కుటుంబం తీవ్ర మనోవేదనకు లోనైందని హీరో నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిపై నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం దావాకు సంబంధించి నాగార్జున, అతడి మేనకోడలు సుప్రియ మంగళవారం కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. మరో సాక్షి మెట్ల వెంకటేశ్వర్ వాంగ్మూలాన్ని గురువారం నమోదు చేయాలని నిర్ణయించారు. ముగ్గురి వాంగ్మూలాలను పరిశీలించాక మంత్రికి సమన్లు ఇచ్చే విషయమై న్యాయమూర్తి నిర్ణయం తీసుకుంటారు. మంగళవారం మధ్యాహ్నం నాగార్జునతో పాటు భార్య అమల, సోదరి నాగసుశీల, కొడుకు నాగచైతన్య, మేనకోడలు సుప్రియ కోర్టుకు వచ్చారు. అసలు పరువు నష్టం దావా ఎందుకు దాఖలు చేశారని న్యాయమూర్తి శ్రీదేవి ప్రశ్నించారు. నాగార్జున వాంగ్మూలమిస్తూ, "దేశవ్యాప్తంగా ఎందరో ప్రజల ఆదరాభిమానాలను పొందిన నాపై, నా కుటుంబంపై మంత్రి కొండా సురేఖ రాజకీయ దురుద్దేశంతో అమర్యాద పూర్వకంగా మాట్లాడారు. నా కొడుకు నాగ చైతన్య విడాకుల వ్యవహారం గురించి పూర్తి అవాస్తవమైన, అసత్యమైన వ్యాఖ్యలు చేశారు. "ఎన్ కన్వెన్షన్" కూల్చకుండా ఉండాలంటే మాజీ మంత్రి కేటీఆర్ దగ్గరకు వెళ్లాల్సిందిగా నేను సమంతను ఒత్తిడి చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేకుండా మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. సమాజం పట్ల బాధ్యతతో మా కుటుంబం చాలా ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలను కూడా చేస్తోంది. మంత్రి చేసిన వ్యాఖ్యలతో మా కుటుంబ గౌరవ మర్యాదలకు భంగం కలిగింది. తీవ్ర మనోవేదనకు లోనయ్యాం. అవమానం ఎదుర్కొన్నాం. ఇప్పటి వరకు మంత్రి కనీసం మమ్మల్ని క్షమాపణలు కోరలేదు, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోలేదు. బాధ్యతా యుతమైన మంత్రి పదవిలో ఉండి ఈ విధంగా మాట్లాడడం, సినీరంగంపై రాజకీయాలు చేయడం సబబు కాదు" అన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు తక్కువ! బయటి మార్కెట్‌లో సహజంగానే రేటు ఎక్కువ! రైతు బజార్‌కు, బయటి మార్కెట్‌కూ మధ్య తేడా గరిష్ఠంగా ఎంత ఉండాలి? ఈ ధరలను నియంత్రించాల్సిందెవరు? నిత్యావసరాలైన కూరగాయల ధరలపై మార్కెటింగ్ శాఖ రోజూ వారీ పర్యవేక్షణ చేస్తే.. రైతు, దళారులు, రిటైలర్ల 'ధర' హెచ్చులు తెలుస్తాయి. కానీ... మార్కెటింగ్ శాఖ కేవలం రైతు బజార్లలో ధరలను నిర్ణయించడంతోనే సరిపెడుతోంది.

మార్కెట్ మాయతో ధరల మంట!

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ధరలపై పర్యవేక్షణ ఏదీ?

హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్యే భారీగా ధరల వ్యత్యాసం కనిపిస్తోంది. మదనపల్లె మార్కెట్‌లో పది కిలోల టమాటా రూ.200 నుంచి రూ.450 మించి కొనడం లేదు. ఉత్పత్తి పెరిగితే రైతుకు ఇంకా ధర తగ్గుతుంది. కానీ... మార్కెట్‌లో ఆరునెలలుగా టమాటా ధర కిలోకు రూ.50 తగ్గలేదు. ఇప్పుడు ఏకంగా 80 నుంచి వంద పలుకుతోంది. ఉల్లి కొత్త పంట మార్కెట్‌కు వచ్చినప్పుడు ధరలు తగ్గాలి. కానీ, హోల్‌సేల్ వ్యాపారులు పాత ఉల్లికి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కొత్త ఉల్లిని పాత ఉల్లి రేటుకు అమ్ముతున్నారు. మహారాష్ట్రలో పాత ఉల్లి టన్ను ధర రూ.3,500 ఉండగా... ఏపీలో కిలో రూ.80 వరకు పలుకుతోంది.

ఇదేనా జోక్యం?

టమాటా, ఉల్లి ధరలు బాగా పెరిగినప్పుడే మార్కెటింగ్‌శాఖ కదులుతోంది. అదీ ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే. రైతుకు పెట్టుబడి వ్యయం ఎంత? వారికి దక్కాల్సిన ధర ఎంత? హోల్‌సేల్ వ్యాపారులు రైతు దగ్గర ఎంతకు కొంటున్నారు? రిటైల్ మార్కెట్‌లో ధరలు ఎంతున్నాయి? ఇవేవీ పట్టించుకోవడంలేదు. టమాటా ధరలు పెరగడంతో ఇటీవల మార్కెటింగ్ శాఖ అనంతపురం, పులివెందుల నుంచి టమాటా కిలో రూ.65నుంచి రూ.75 చొప్పున లక్షా 35వేల కిలోలు కొనుగోలు చేసింది. ఉల్లిపాయలు కర్నూలు మార్కెట్‌లో రూ.29, ఎన్టీఆర్ జిల్లాలో 31, నంద్యాలలో రూ.32 చొప్పున 21వేల కిలోలు సేకరించింది. ప్రభుత్వమే హోల్‌సేల్ వ్యాపారుల నుంచి భారీ ధరలకు కొనడంతో ఇతర జిల్లాల్లో వ్యాపారులు ధరలను మరింత పెంచేశారన్న వాదన వినిపిస్తోంది. రిటైల్ మార్కెట్‌లో టమాటా ధర పెరుగుదలకు పరోక్షంగా మార్కెటింగ్ శాఖే కారణమన్న విమర్శలొచ్చాయి. కూరగాయల ధరలకు రైతు బజార్లు ప్రమాణికం! కానీ.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 111 రైతు బజార్లు మాత్రమే ఉన్నాయి. అవన్నీ పట్టణాలకే పరిమితమయ్యాయి. ప్రతి మునిసిపాలిటీలో కనీసం ఒక రైతు బజారు పెట్టాలన్న ప్రతిపాదన కాగితాల దశ దాటడం లేదు. పట్టణాలు, నగరాల్లో మొబైల్ రైతు బజార్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌నూ పట్టించుకోవడంలేదు. రాష్ట్రంలో కేవలం విజయవాడలో మాత్రమే 16 మొబైల్ రైతు బజార్లను నిర్వహిస్తున్నారు.

కూరగాయల ధరలు కిలో రూ..ల్లో	రైతుబజార్	మార్కెట్
టమాటా	65/50	70-90
వంకాయ	36-38	50-60
పచ్చిమిర్చి	22.00	50.00
కాకర	40.00	60.00
బీర	40-45	60.00
క్యాలీఫ్లవర్	35-40	40-50
దొండ	42.00	50.00
బంగాళాదుంప	38.00	50.00
గోరుచిక్కుడు	32.00	50-60
దోస	30.00	40-50
చామదుంప	36.00	50-60
క్యారెట్	46.00	60.70
క్యాప్సికం	70.00	90-100
కంద	56.00	80.00
కీరదోస	36.00	50-60
బెండ	30.00	40.00

రైతుకు దక్కేది మూడోవంతే!

వ్యవసాయ పంట ఉత్పత్తుల మాదిరిగానే కూరగాయ పంటలు పండించే రైతులకూ గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ఈ నేపథ్యంలో రైతు నుంచి రిటైలర్ వరకు ఏం జరుగుతోందనే అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల ఒక అధ్యయనం చేసింది. రైతుకు రూపాయి పంట విలువలో మూడో వంతు కూడా దక్కడం లేదని తేలింది. వినియోగదారుడు వందరూపాయలు పెట్టి కూరగాయలు కొంటే.. అందులో రైతుకు దక్కిన వాటా రూ.35 మాత్రమే. మిగిలిన రూ.65 దళారులు, రిటైలర్లు దక్కించుకుంటున్నారు. రైతు పంట పొలం నుంచి మార్కెట్‌కు తెచ్చి... చివరగా వినియోగదారుడు కొనే వరకు ఉండే సప్లై చెయిన్, వ్యాల్యూ చెయిన్ సిస్టమ్ సరిగ్గా లేదని ఆర్బీఐ నిపుణుల బృందం గుర్తించినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ పాలసీ రిసెర్చ్ విభాగం ఓ నివేదికలో వెల్లడించింది.

నాడూ నేడూ వారిదే హవా!

▸ అర్హత లేని కంపెనీకి డీ-సిల్టేషన్ కాంట్రాక్టు

▸ జగన్ జమానాలో పొందిన సంస్థకే మరో జిల్లాలో అదనపు పనులు

▸ జీవో 43కి విరుద్ధమని తెలిసినా నెల్లూరు కలెక్టర్, జేసీ అత్యుత్సాహం

▸ ఆ కలెక్టర్, జేసీపై సర్కారుకు ఫిర్యాదులు

▸ ఏసీబీ విచారణకు డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నదుల్లో ఇసుకను యంత్రాల ద్వారా తవ్వితీసే ప్రక్రియను డీ-సిల్టేషన్ అంటారు. ఈ పనిని సహకార చట్టం-1964 కింద రిజిస్టర్ అయిన బోట్స్‌మెన్ సొసైటీలకు అప్పగిస్తుంటారు. సంక్షేమ సంఘాలు, సొసైటీస్ చట్టం కింద ఏర్పాటైన సంఘాలకు ఈ పనులు అప్పగించడానికి వీల్లేదు. ఈ మేరకు స్పష్టమైన నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అయినా జగన్ హయాంలో ఆ నిబంధనలకు తిలోదకాలిచ్చి గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి మినరల్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో తుంగభద్ర నదిలో ఐదు డీ-సిల్టింగ్ పాయింట్లు అప్పగించారు. ఈ టెండర్ ఎలా ఇచ్చారో విచారణ జరిపితే.. జగన్ జమానాలో అనుమతులు ఇచ్చిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తీవ్ర క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక బోట్స్‌మెన్ సొసైటీల ఉపాధి పెంచే చర్యలను పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. సహకార చట్టం-1964 కింద ఏర్పాటయిన బోట్స్‌మెన్ సొసైటీలకు మాత్రమే డీ-సిల్టింగ్ వర్క్ ఇవ్వాలని జూలై 8న జీవో 43 జారీ చేసింది. ఈ ఉత్తర్వు వచ్చాకైనా.. కర్నూలులో ఆ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టు రద్దుచేయాలి. ఆ పని చేయకపోగా.. దానికే నెల్లూరు జిల్లా పెన్నానదిలో మరో ఐదు డీ-సిల్టింగ్ పాయింట్లు కేటాయించడం విశేషం. నిబంధనలు, హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి నెల్లూరు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆ సంస్థకు రాచబాట వేశారు. ఆగస్టు 23న డీ-సిల్టింగ్ ఏజెన్సీల నుంచి దరఖాస్తులు కోరుతూ నెల్లూరు కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ మేరకు ఆ ప్రైవేటు సంస్థ ఓ.తారాదేవి పేరిట ఓ సంక్షేమ సొసైటీతో జాయింట్ వెంచర్ ఏర్పాటుచేసుకుని టెండర్ వేసింది. ఆ సంస్థకే టెండర్ కట్టబెట్టారు. నిజానికి తారాదేవి సొసైటీ అనేది సంక్షేమ సంఘం. అది సొసైటీస్ చట్టం-2001 కింద ఏర్పాటైంది. జీవో 43 ప్రకారం, సహకార సొసైటీల చట్టం-1964 కింద ఏర్పాటైన బోట్స్‌మెన్ సొసైటీకే టెండర్ ఇవ్వాలి. ఈ విషయం చిన్న పిల్లలకు కూడా అర్థమవుతుంది. అయితే కాంట్రాక్టు సదరు కంపెనీకే ఇవ్వాలని అధికారులు ముందుగానే నిర్ణయించుకోవడంతో.. ఇలాంటి నిబంధనలన్నీ పక్కకు నెట్టేశారు. దీనిపై అనేకానేక అభ్యంతరాలు వచ్చినా నెల్లూరు కలెక్టర్, జేసీ పట్టించుకోలేదన్న ఫిర్యాదులున్నాయి. టెండర్‌ను పిలిచింది ఆగస్టు 23న.. కానీ తారాదేవి సంస్థ సర్టిఫికెట్ తెచ్చుకుంది ఆగస్టు 16న. ఆ సంక్షేమ సంఘం సర్టిఫికెట్‌ను పరిశీలిస్తే ఈ తేడాను గుర్తిస్తారన్న ఆలోచనే ఉన్నతాధికారులకు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ సంస్థకు టెండర్ ఇవ్వబోతున్నారని తెలిసి నిజమైన బోట్స్‌మెన్ సొసైటీలు హైకోర్టును ఆశ్రయించాయి. ఆ సంస్థకు డీ-సిల్టింగ్ కాంట్రాక్టు చేసే అర్హత లేదని.. దానికి కాంట్రాక్టు ఇవ్వకూడదని హైకోర్టు గత నెల 20వ తేదీన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అది తెలిసి నెల్లూరు కలెక్టర్, జేసీ పాత తేదీలతో టెండర్ కట్టబెడుతూ ఒప్పందాలు చేసుకున్నారు. ఇందులోనూ తప్పులే చేశారు. ఆగస్టులోనే ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ విధానం అమల్లోకి తీసుకొచ్చింది. కానీ ఈ కంపెనీతో ఒప్పందం చేసుకునేందుకు ఆగస్టుకు ముందే ఉన్న మాన్యువల్ స్టాంపు కాగితాలపై ఒప్పందాలు చేసుకున్నారు. వీటిని పరిశీలిస్తే ఈ సంస్థకు ఎలాగైనా కాంట్రాక్టు ఇచ్చితీరాలన్న కసి నెల్లూరు అధికారులకు ఉన్నట్లుంది. ఈ ఉదంతంపై ఇప్పటికే కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌పై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని, ఏసీబీతో విచారణ చేయించాలని బోట్స్‌మెన్ సొసైటీ ప్రభుత్వాన్ని కోరింది. ఇదే అంశంపై ఆ ఇద్దరు అధికారులపై హైకోర్టుకూ ఫిర్యాదు చేసింది.


వారి వెనుక అదే జిల్లా అధికార పార్టీ నేత?

నదుల నుంచి ఇసుకను తవ్వితీసే కాంట్రాక్టు బోట్స్‌మెన్ సొసైటీలకే అప్పగించాలి. ఇది చట్టబద్ధమైన నిబంధన. జగన్ జమానాలో దీనిని తుంగలోతొక్కి ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆ తప్పు పునరావృతం కాకూడదని జీవో 43 తీసుకొస్తే.. దానినీ అధికారులు పక్కనపడేశారు. వైసీపీ హయాంలో అక్రమంగా కాంట్రాక్టు పొందిన సంస్థకే మరో జిల్లాలో మరిన్ని పనులు అప్పగించారు. ఆ కంపెనీకి అర్హత లేదని, కాంట్రాక్టు ఇవ్వొద్దని హైకోర్టు ఆదేశించినా.. పాత తేదీతో ఆర్డర్ ఇవ్వడం గమనార్హం.

ఇంత ప్రేమ ఎందుకో..!

జగన్ హయాంలో అక్రమంగా పనులు చేపట్టిన సంస్థకు కూటమి ప్రభుత్వంలో కూడా రెడ్ కార్పెట్ వేయడం వెనుక పనిచేసిందెవరు? జీవో 43కు విరుద్ధమని తెలిసినా, హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ ఆ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చేలా అధికారులను నడిపించిన చోదక శక్తి ఎవరు.. అన్నదానిపై చర్చలు సాగుతున్నాయి. ఈ వ్యవహారంలో నెల్లూరుకే చెందిన ఓ నేత పేరు వినిపిస్తోంది.

ఆచార్య రాచపాళెంకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం



అనంతపురం కల్చరల్, అక్టోబరు 8: ప్రముఖ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని 'చం. స్పందన' జీవన సాఫల్య పురస్కారం వరించింది. స్వర్ణభారతి సాక్షిగా, పొలి, రెండు ప్రపంచాలు వంటి కవితా సంపుటాలను వెలువరించడంతోపాటు అనేక కవిత్వ విశ్లేషణ వ్యాసాలు రాసిన ఆయన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఏకగ్రీవంగా ఎంపిక చేశామని 'చం.స్పందన-అనంత కవుల వేదిక' జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తూముచర్ల రాజారామ్, చంద్రశేఖరశాస్త్రి మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. చంద్రశేఖరశాస్త్రి (చం.) తన పేరు మీద ఏటా ఇచ్చే ఈ పురస్కారాన్ని చం.స్పందన జీవన సాఫల్య పురస్కారంగా వ్యవహరిస్తున్నారు. అనంతపురంలో త్వరలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రాచపాళెంకు జీవన సాఫల్య పురస్కారం, నగదు బహుమతి అందజేసి సత్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, స్పందన సభ్యులు షమీవుల్లా, అంకె శ్రీనివాస్, కవులు నందవరం కేశవరెడ్డి, డాక్టర్ రాధేయ, షేక్ నబీరసూల్, రాయుడు, మధురశ్రీ తదితర సాహితీవేత్తలు.. పురస్కార విజేత రాచపాళెంను అభినందించారు.

ఆ షాపులు భలే కిక్కు..!

విజయవాడలో రెండు షాపులకు ఫుల్ డిమాండ్

96వ దుకాణానికి 87 దరఖాస్తులు.. 97కు 75 మంది పోటీ

96వ షాపునకు వచ్చిన దరఖాస్తు ఫీజే 1.74 కోట్లు

దరఖాస్తుల గడువు మరో రెండు రోజులు పొడిగింపు

14న లాటరీ 16 నుంచి కొత్త షాపులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నూతన మద్యం పాలసీలో షాపులు కేటాయించకముందే కొన్ని దుకాణాలు భలే కిక్కిస్తున్నాయి! కొన్ని జిల్లాల్లో దరఖాస్తులు తక్కువగా వస్తుంటే విజయవాడలో మాత్రం భారీ పోటీ నెలకొంది. ముఖ్యంగా 96, 97వ నంబరు షాపులకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఈ షాపులు ఒక్కోదానికి లైసెన్స్ ఫీజు ఏడాది రూ.85 లక్షలు. రెండేళ్లకు రూ.1.70 కోట్లు. అయితే 96వ షాపు కోసం ఇప్పటికే 87 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు కాబట్టి.. ఈ రూపంలోనే రూ.1.74 కోట్లు వచ్చినట్టయింది. అంటే.. వ్యాపారం మొదలుపెట్టాక రెండేళ్లపాటు వ్యాపారి చెల్లించే లైసెన్స్ ఫీజు ఈ దరఖాస్తుల ద్వారానే వచ్చేసిందన్నమాట! ఇక 97వ నంబరు దుకాణానికి 75 దరఖాస్తులొచ్చాయి. తద్వారా ఇప్పటికే 1.5 కోట్ల ఆదాయం వచ్చిపడింది. వాస్తవానికి ఎక్సైజ్ శాఖ ప్రతి షాపునకు ఒక నంబరు కేటాయించినా.. లైసెన్స్ వస్తే విజయవాడ పరిధిలో ఎక్కడైనా షాపు పెట్టుకోవచ్చు. అయినా దరఖాస్తుదారులు ఈ 2 షాపులకు పోటీపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఒక్కరోజులోనే 20వేల దరఖాస్తులు..

మంగళవారం సాయంత్రానికి రాష్ట్రవ్యాప్తంగా 41,348 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో షాపునకు సగటున 12 అందాయి. మంగళవారం ఒక్కరోజే 20వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల సమర్పణకు బుధవారం చివరిరోజు కావడంతో ఒక్కసారిగా పోటెత్తారు. అయితే దరఖాస్తుల గడువును ఈ నెల 11 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. అలాగే 14న లాటరీ నిర్వహించి, 16 నుంచి షాపులు ప్రారంభించేలా ఎక్సైజ్ శాఖ మరో ఉత్తర్వు జారీ చేసింది. దీంతో ఈ నెల 15 వరకు ప్రభుత్వ మద్యం షాపులు కొనసాగున్నాయి.

ఆ జిల్లాల్లో మారని నేతల తీరు

ప్రభుత్వ స్థాయిలో హెచ్చరించినా కొన్ని జిల్లాల్లో నేతల తీరు మారట్లేదు. కొందరు ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో షాపులకు ఇతరులను దరఖాస్తులు వేయనివ్వడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేద్దామన్నా ఎమ్మెల్యేల బెదిరింపులతో దరఖాస్తుదారులు వెనక్కి తగ్గుతున్నారు. ఎక్సైజ్ అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. బాపట్ల జిల్లా, భట్టిప్రోలులో ఐదు షాపులుంటే మంగళవారం సాయంత్రానికి ఐదు షాపులకు కలిపి రెండే దరఖాస్తులు పడ్డాయి. మూడు షాపులకు ఎవరూ దరఖాస్తు చేయలేదంటే ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. విశాఖ జిల్లాలో అనేక షాపులకు రెండంకెల సంఖ్యలో దరఖాస్తులు దాఖలు కాలేదు. ఓ ఎమ్మెల్యే ఒత్తిడితో ఇతరులెవరూ దరఖాస్తు చేయట్లేదు. కాకినాడలో ఎక్కువ షాపులు రెండు మూడు దరఖాస్తులకే పరిమితమయ్యాయి. ప్రకాశం జిల్లాలో మొత్తం 171 షాపులుంటే 1,326 దరఖాస్తులే అందాయి. నెల్లూరులో 182 షాపులకు 1,531, కాకినాడలో 155 షాపులకు 1,145 దరఖాస్తులే వచ్చాయి.

వెబ్‌సైట్‌లో దరఖాస్తుల సంఖ్య..

ఎమ్మెల్యేలు, నేతలు, సిండికేట్లను నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల సంఖ్యను పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకొచ్చింది. సోమవారం వరకు ఏ షాపునకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అనేది తెలుసుకోవడం సాధారణ వ్యక్తులకు కష్టంగా మారింది. దీంతో సాధారణ వ్యక్తులు సరైన సమాచారం అందక దరఖాస్తుల విషయంలో వెనక్కి తగ్గారు. దీన్ని గుర్తించిన ఉన్నతాధికారులు ప్రతి షాపునకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అనే లైవ్ డేటాను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చారు.

నష్టం వస్తుందని ప్రచారం

కొన్ని ప్రాంతాల్లో వ్యాపారుల తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోటీని తగ్గించడం కోసం ఈ వ్యాపారంతో పెద్దగా లాభం ఉండదని, నష్టం కూడా వస్తుందని ప్రచారం చేస్తున్నారు. తద్వారా కొత్తవారు దరఖాస్తులు చేయకుండా నియంత్రిస్తున్నారు. దరఖాస్తుల సంఖ్య పెరిగితే పోటీలో తమకు లైసెన్స్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయని ఈ తరహా ప్రచారం చేస్తున్నారు. కొత్తవారికి సరైన అవగాహన లేకపోవడంతో వ్యాపారం లాభసాటి కాదని భావించి వెనకడుగు వేస్తున్నారు.

ఈ లడ్డూ మంచిదే, కల్తీది కాదు

» ప్రధానమంత్రితో చమత్కరించిన సీఎం

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసినప్పుడు తిరుపతి లడ్డూ ను ఆయనకు అందించారు. "ఈ లడ్డూలో కల్తీ లేదు. నూటికి నూరుపాళ్లు పవిత్రమైంది" అని చంద్రబాబు మోదీతో చమత్కరించారు. ప్రధానమంత్రి మోదీ ఆ మాటలు విని విరగబడి నవ్వి ప్రసాదాన్ని కళ్లకద్దుకుని తిన్నారు







కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరిలను కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రాకు అభయం

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను మంజూరు చేయాలని, అమరావతి రాజధానిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, పీఎంయూపై కింద కేటాయింపులను పెంచాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ మరో రెండేళ్లలో పూర్తవుతుందని, ఇందుకోసం కేంద్రం రూ.12,500 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభమవుతుందని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) నుంచి రూ.15 వేల కోట్లు త్వరలో మంజూరు కానున్నాయని తెలిపారు. రాజధాని పనులు డిసెంబరు నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించకుండా అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశాఖ ఉక్కును తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా అభివర్ణించారు. మరో రెండేళ్లలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేను నాలుగు నుంచి ఎనిమిది లేన్లకు పెంచాలని, హైదరాబాద్ నుంచి అమరావతికి మరో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను ప్రతిపాదించినట్లు తెలిపారు. మచిలీపట్నం రేవును తెలంగాణకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. భోగాపురంలోనే సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ మరో రెండేళ్లలో ఏర్పడుతుందని తెలిపారు. బీపీసీఎల్ రిఫైనరీని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కమిటీ నిర్ణయిస్తుందని, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నంతో సహా నాలుగు ప్రాంతాలు పరిశీలనలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. తన రెండ్రోజుల ఢిల్లీ పర్యటనపై మంగళవారం సాయంత్రం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..



అమిత్‌షాకు వినాయకుడి ప్రతిమను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వారసత్వంగా చెత్త మిగిల్చాడు

"జగన్ ఆర్థిక అకృత్యాల వల్ల అడుగడుగునా ఏపీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానికి వివరించాను. స్వచ్ఛభారత్ పథకాన్ని కూడా జగన్ నీరుగార్చారు. వారసత్వంగా ఆయన 85 లక్షల టన్నుల చెత్తను మిగిల్చిపోయారు. జగన్ హయాంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్ది 2047 వరకు ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దే దిశలో లక్ష్యాన్ని ప్రధానికి వివరించాను. జగన్ సర్కారు కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయ్యలేదు. ఏ మంత్రిత్వ శాఖకు వెళ్లి నిధులు అడిగినా యూటిలిటీ సర్టిఫికెట్లు(యూసీ)లు అడుగుతున్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులతో సహా కేంద్రం తలపెట్టిన ఏ ప్రాజెక్టుకూ జగన్ ప్రభుత్వం భూమి కేటాయించలేదు. మ్యాచింగ్ గ్రాంట్లను కూడా విడుదల చేయలేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ. 10.50 లక్షల కోట్లు అప్పు చేసింది. ఎఫ్ఆర్‌బీఎం కింద కూడా అప్పులు చేసే పరిస్థితి లేదు"

పంచాయతీరాజ్‌ను నాశనం చేశారు

"రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను నాడు నాశనం చేశారు. ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను కూడా ఇవ్వలేదు. ఉపాధి హామీ డబ్బులను నాటి వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. విశాఖపట్నం రైల్వే జోన్‌కు కూడా గత ప్రభుత్వం భూమి కేటాయించలేదు. మేం అధికారంలోకి రాగానే కేంద్రాన్ని సంప్రదించి అనువైన భూమిని కేటాయించాం. డిసెంబరులో ప్రధాని చేతుల మీదుగా రైల్వే జోన్ ప్రారంభమవుతుంది"

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమగ్ర ప్యాకేజీ

"విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా శాయశక్తులా నేను ప్రయత్నిస్తున్నాను. కేంద్రం కూడా సహకరించడానికి సిద్ధంగా ఉంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, మనోభావాలకు సంబంధించిన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి సమగ్ర ప్యాకేజీ అవసరం. స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారంలో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నాం. పరిపాలన వైఫల్యం, కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల స్టీల్ ప్లాంట్ ఇబ్బందులలో పడింది. స్టీల్ ప్లాంట్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక పరిష్కార విధానం. అయితే అందుకు సెయిల్, కేంద్రప్రభుత్వం ఒప్పుకోవాల్సి ఉంటుంది. సాధుకొండ, ఎర్రకొండ, గడ్చిరోలిలో ఐరన్ ఓర్ ఉంది. సెయిల్ మాదిరి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఐరన్ ఓర్‌ను కేటాయిస్తే ప్రధాన సమస్య పరిష్కారమవుతుంది. స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన జటిల సమస్యలపై కేంద్ర ఉక్కు మంత్రి జేడీ కుమారస్వామితో చర్చించాను"

స్కీమ్‌లకు ఏఐ సంధానం..

"రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి ప్రభుత్వ పథకాలు రియల్‌టైంలో ప్రజలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా విద్యార్థుల భవిష్యత్తుకు, ప్రజల ఆరోగ్య రికార్డులను నమోదు చేసేందుకు, ప్రభుత్వ పనితీరును మెరుగుపర్చేందుకు ఈ టెక్నాలజీని వినియోగించనున్నాం. ఏపీలో ఐటీ నైపుణ్యం, డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు జాతీయ ఎలక్ట్రానిక్స్ సమాచార సంస్థను నెలకొల్పాలని నేను చేసిన ప్రతిపాదనను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అంగీకరించారు. ఏపీని సెమీకండక్టర్ పరిశ్రమలకు కేంద్రంగా మార్చాలని నేను కోరాను. వాల్తేరు డివిజన్‌ను యథాతథంగా కొనసాగిస్తూ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయడంపై అశ్వినీ వైష్ణవ్‌తో వివరంగా చర్చించాను. రెండేళ్లలో విశాఖ నుంచి అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటవుతోంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అమరావతి మధ్య హైస్పీడ్ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేయడం, బుల్లెట్ ట్రైన్లను ప్రవేశపెట్టడంపై చర్చించాం. మచిలీపట్నం నుంచి అమరావతి మధ్య, నరసాపూర్- మచిలీపట్నం, రేపల్లె- బాపట్ల మధ్య కొత్త రైల్వే లైన్లు మంజూరు చేయాలని కోరాను" అని చంద్రబాబు తెలిపారు.

ఏపీ అభివృద్ధికి సహకరించండి

» విజయవాడ తూర్పు బైపాస్ అభివృద్ధి చేయాలి

» గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి

» బీపీసీఎల్ రిఫైనరీని వేగవంతం చేయాలి

» కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతి..

న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండో రోజైన మంగళవారం.. కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిలను వేర్వేరుగా కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులపై చర్చించారు. తొలుత నితిన్ గడ్కరీతో సమావేశమైన చంద్రబాబు... విజయవాడ తూర్పు బైపాస్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలోని జాతీయ రహదారులకు అభివృద్ధి చేయాలన్నారు. కుప్పం-హోసూర్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని, మూలపేట్-వైజాగ్ గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని, భోగాపురం విమానాశ్రయం పనులు శరవేగంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేందుకు ఫ్లైఓవర్, మెట్రోలను అనుసంధానించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 4 లేన్ల నుంచి 8 లేన్లుగా అభివృద్ధి చేయాలన్నారు. ఏపీ రాజధాని అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఏర్పాటు చేయాలని కోరారు.

పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సహకరించాలి

ఆ తర్వాత కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ), షిప్పింగ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్త కమిటీని ఏర్పాటు చేసి ప్రాజెక్టులు నిర్ణీతకాలంలో పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ఐసీడీఐటీ ద్వారా పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు డెవలప్‌మెంట్ ఇండస్ట్రియల్ పాలసీ, సెక్టోరల్ పాలసీలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో ఉక్కు, పరిశ్రమలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశాఖ ఉక్కుని నిలబెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని చంద్రబాబుతో కేంద్రమంత్రి తెలిపారు. అలాగే.. ఏపీలో పారిశ్రామిక రంగానికి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరీతో సమావేశమయ్యారు. పీఎం ఉజ్వల యోజన పథకం కింద రాష్ట్రంలో 65 లక్షల దీపం కనెక్షన్లు ఇవ్వాలని, బీపీసీఎల్ రిఫైనరీని వేగవంతం చేయాలని కోరారు. చంద్రబాబు వినతులపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు.

హరియాణాలో విజయం... మోదీకి బాబు అభినందనలు

హరియాణాలో బీజేపీ మూడోసారి విజయం సాధించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. దీన్ని ఎన్డీఏ చరిత్రాత్మక విజయంగా ఆయన అభివర్ణించారు.

పెట్టుబడులపై నేడు భారీ ప్రకటన!

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ మంగళవారం ముంబైలో టాటా సన్స్ బోర్డు ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సమావేశమయ్యారు. ఆయనతో భేటీ అత్యద్భుతంగా జరిగిందని.. బుధవారం భారీ ప్రకటన వెలువడనుందని, వేచిచూడాలని లోకేశ్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. గత నెలలో కూడా అమరావతిలో ఆయన చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. ఈ అంశంపైనే బుధవారం కీలక ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు. ఇంకోవైపు.. హీరానందానీ సంస్థల డైరెక్టర్ హర్ష్ హీరానందానీతోనూ సమావేశమయ్యానని.. రాయలసీమలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు, విశాఖలో గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్‌లకు ఉన్న అవకాశాలపై చర్చించానని లోకేశ్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకే చంద్రబాబు ఢిల్లీ పర్యటన

» జగన్ ఢిల్లీ యాత్రలన్నీ స్వప్రయోజనాల కోసమే!: వర్ల రామయ్య

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్ మాత్రం తన స్వప్రయోజనాల కోసం ఢిల్లీ యాత్రలు చేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. స్వయంగా ఒక కేంద్ర మంత్రే చంద్రబాబు ఉన్నచోటుకు వచ్చి కలిశారని, అదీ చంద్రబాబుకు ఢిల్లీలో ఉన్న గౌరవమని పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తన పర్యటనలో సాధించిన విషయాలు వెల్లడిస్తారని అన్నారు. జగన్ ఎనాడైనా ఇలా చేశారా? అని నిలదీశారు. తిరిగి జైలుకు వెళ్లకుండా ఉండడం కోసమే జగన్ ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ వెళ్లేవాడని విమర్శించారు. ఈ విధంగా జగన్‌రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. గత ఐదేళ్లలో 29 సార్లు ఢిల్లీ వెళ్లిన ఆయన, తన సొంత ప్రయోజనాలు చూసుకున్నారే తప్ప.. ప్రజలకు జరిగిన మేలు ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. జగన్ ఢిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఒనగూరలేదని అన్నారు.

ఏపీకి బుల్లెట్ ట్రైన్

» బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతిని కలుపుతూ ఏర్పాటు

» దీనికోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్.. పూర్తి ప్రతిపాదనల తర్వాత ప్రకటన

» ఢిల్లీలో ఎంపీలకు వెల్లడించిన బాబు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర రైల్వే శాఖ ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు....రాష్ట్ర ఎంపీలకు ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వివిధ విషయాలపై మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి ఢిల్లీలో అందుబాటులో ఉన్న కొందరు కూటమి ఎంపీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన గురించి చెప్పారు. దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర ప్రభుత్వం ముంబై నుంచి అహ్మదాబాద్‌కు నడపాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన పనులు వేగంగా నడుస్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు మార్గాల్లో ఈ హై స్పీడ్ రైళ్లను నడపాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. ఇందులో దక్షిణాదిలో రెండు మార్గాలు ఉన్నాయి. చెన్నై నుంచి బెంగళూరు మీదుగా మైసూరు వరకూ ఒక ట్రైన్, ముంబాయి నుంచి హైదరాబాద్‌కు మరో ట్రైన్‌ను ఇందులో ప్రతిపాదించారు. మొదటి దశ ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్ లేదు. కాని తాజాగా ఏపీని కూడా ఇందులో చేర్చినట్లు ముఖ్యమంత్రి.... ఎంపీలకు తెలిపారు. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతి నగరాలు కలిసేలా బుల్లెట్ రైళ్లు నడపడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయని ఆయన చెప్పారు. దీని కోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్ వేయాల్సి ఉంటుందని, పూర్తి ప్రతిపాదనలు సిద్ధమైన తర్వాత రైల్వే శాఖ వివరాలు వెల్లడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

రామాయపట్నంపై బీపీసీఎల్ మొగ్గు

రూ.అరవై వేల కోట్ల పెట్టుబడితో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న భారత్ పెట్రోలియం కంపెనీ... రామాయపట్నంపై మొగ్గు చూపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎంపీలకు తెలిపారు. ఈ కంపెనీ తన రిఫైనరీ ఏర్పాటుకు మూడు రాష్ట్రాలను పరిశీలించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకొంది. ఏపీలో మూడు ప్రాంతాలను ఆ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపాడు (శ్రీకాకుళం) పోర్టు ప్రాంతాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మూడు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ఆ కంపెనీ....రామాయపట్నం వైపు మొగ్గు చూపుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రామాయపట్నం నెల్లూరు జిల్లాలో కందుకూరు ప్రాంతంలో ఉంది. వెయ్యి ఎకరాల్లో రూ. అరవై వేల కోట్ల పెట్టుబడితో వచ్చే ఈ రిఫైనరీ ఆ ప్రాంత స్వరూపాన్ని మార్చివేసే అవకాశాలు ఉన్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుకు మచిలీపట్నం పోర్టు ప్రాంతాన్ని ఎంపిక చేసే అవకాశాలు పరిశీలించాలని బందరు ఎంపీ బాలశౌరి ఈ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరారు. బీపీసీఎల్ తనకు నచ్చిన ప్రాంతాన్ని తాను ఎంపిక చేసుకొంటుందని ముఖ్యమంత్రి ఆయనకు చెప్పారు.

గ్రీన్ హైడ్రోజన్‌లో లక్ష కోట్ల పెట్టుబడి

విశాఖపట్నం ప్రాంతంలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు రాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు వస్తోందని, దేశంలోనే ఇది అతి పెద్ద ప్రాజెక్టని ఆయన వెల్లడించారు. పునరుత్పాదక ఇంధనాల్లో ఇది కొత్త తరం టెక్నాలజీకి సంబంధించిందని, ఇక్కడ ఉత్పత్తి అయిన గ్రీన్ హైడ్రోజన్‌ను ఎగుమతి చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయని ఆయన ఎంపీలకు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



మూలానక్షత్రం రోజున క్యూలైన్ల రద్దీని నివారించాలి

● ఎస్పీ గౌతమి శాలిని ఆదేశం

భవానీపురం: కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన మూలానక్షత్రం రోజున క్యూలైన్లలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని విధుల్లో ఉన్న ఎస్పీ గౌతమి శాలిని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీఎంసీ కార్యాలయం వద్ద మూలానక్షత్రం రోజున బుధవారం తెల్లవారుజామున నుంచి భక్తులను వినాయకుడి గుడి వద్ద లైన్ల మీదుగా తరలించే ఏర్పాట్లను మంగళవారం ఆమె పర్యవేక్షించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు, కేశఖండనశాల నుంచి భవానీలు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున ఇటువైపు వస్తారని పోలీసులకు వివరించారు. వచ్చిన భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా వారికి కేటాయించిన క్యూలైన్లలో నింపి, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని గౌతమి శాలిని ఆదేశించారు.

అమ్మా.. అనుగ్రహించు!



రంగావఝ్ఝల శ్రీనివాస శాస్త్రి

● కుంకుమ, ఖడ్గమాలార్చన, చండీహోమం పూజలకు డిమాండ్

● ఈ పూజలకు దుర్గమ్మ ప్రసన్నం ఉంటుందని భక్తుల నమ్మకం

వన్‌టౌన్, అక్టోబరు 8: జగన్మాత అనుగ్రహం నిరంతరం తమపై ఉండేందుకు అమ్మను మెప్పించటానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ పూజల్లో ముఖ్యమైనవి మూడున్నాయి. కుంకుమ, ఖడ్గమాల అర్చనతో పా టు చండీహోమం. ఈపూజలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు.



ఏమిటీ పూజల ప్రత్యేకత..?

ఆదిశంకరాచార్యుల వారు అమ్మవారి సన్నిధిలో శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. ఆ శ్రీ చక్రానికే ఇప్పుడు నిత్యం లలిత సహస్రనామ పారాయణను అనుసంధానించి కుంకుమ పూజ చేస్తుంటారు. ఈ పూజతో అమ్మవారు సంతుష్టురాలవుతుందని వాడుకలో ఉంది. దేవస్థాన ముఖ్య అర్చకుడు, ఆలయ వైదిక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న రంగావఝ్ఝల శ్రీనివాస శాస్త్రి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ శ్రీచక్ర నవావరణార్చన, కుంకుమపూజ, ఖడ్గమాలార్చన పూజలు గురించి ఎన్నో విశేషాలను వెల్లడించారు. అమ్మవారికి కుంకుమంటే ఎంతో ఇష్టమని పురాణాలు, శాస్త్రాల్లో చెప్పబడింది. లలితా సహస్ర నామాలతో అమ్మవారికి కుంకుమ సమర్పిస్తే ఆమె హృదయం ఎంతో పులకిస్తుందని భక్తులు కోరిన కోర్కెలను తీరుస్తుందని నవిష్మక. కుంకమతో పూజ వల్ల దైవశక్తి జాగృతం అవుతుందని, సకల సంపదలను సమకూరుస్తుందని చెబుతారు. శ్రీసూక్తం పఠిస్తూ పూజ చేయటంతో మంచి ఫలితాలు వస్తాయని చెబుతారు. మూలా నక్షత్రాన్ని అమ్మవారి జన్మదినంగా భావిస్తారు. ఆరోజున



సరస్వతీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. ఈ రోజున కుంకుమార్చనకు భక్తులు ఎంతో ఉవ్విళ్లూరుతుంటారు. ఆ రోజున 3లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కుంకుమ పూజకు మంచి డిమాండ్ ఉంది. రెండు షిఫ్టుల్లో కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, గంట విరామం తరువాత 10 నుంచి 12 గంటల వరకు ఈపూజలు చేస్తారు. సర్వస్వతీ దేవి అలంకారంలో అర్చనకు ఎంతో ప్రాధాన్యం ఉండటంతో ఆ రోజున కుంకుమ పూజ రుసుము రూ.5వేలుగా నిర్ణయించారు. మిగిలిన రోజుల్లో రూ.3వేలు మాత్రమే. ఈ పూజను గతంలో అర్చకులే లోపల శ్రీచక్రానికి చేస్తుండేవారు. భక్తులకు కూడా అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో 1980లో ఆలయం పక్కనే మండపంలో కుంకుమ పూజకు ఏర్పాట్లు చేశారు. అప్పట్లో రుసుము తక్కువగా ఉన్నా క్రమేపీ పెంచుకుంటూ వచ్చారు. సాధారణ రోజుల్లో రూ.1,116 ఇచ్చి దంపతులు కుంకుమ పూజలో పాల్గొంటారు.

ఖడ్గమాలార్చన

మహిషాసుర సంహారం కోసం దుర్గమ్మ అనేక అవతారాలను ధరించారు. వాటిలో అనేక రూపాలున్నాయి. వాటిలో ముఖ్యంగా చండీరూపం ప్రధానమైంది. చండీదేవిని సాక్షాత్కరించుకోవటానికి ఖడ్గమాలా స్తోత్రం అత్యంత శక్తిగలదని నమ్ముతారు. ఖడ్గమాల స్తోత్రంను దశమహా విద్యల్లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమ్మవారి శక్తిని మరింత ద్విగుణీకృతం చేసి ప్రసన్నం చేసుకోవటానికి ఇంతకు వించిన మరో పూజ లేదని చెబుతారు. ఖడ్గమాలలో ప్రత్యేకమైన నామాలున్నాయి. ఇవన్నీ అమ్మవారి శక్తిని, మహిమలను కీర్తిస్తూ సాగుతాయి. అమ్మవారిని ఖడ్గమాలతో పూజించటం వల్ల సర్వ సంక్షోభాలు నివారించి, సర్వాకర్షణ సిద్ధి కలుగుతుందని నమ్మిక. ఖడ్గమాలలో శ్రీచక్రంలో ఉన్న నవ దేవతల ప్రత్యేకతను ప్రస్తావిస్తూ నామాలుంటాయి. అందుకే ఈ పూజకు అంత ప్రత్యేకత. ఖడ్గమాల పూజతో సర్వశత్రు విజయం కలుగుతుందని, కోర్కెలు తీరుతాయని నమ్మిక. దుర్గగుడిలో కనకదుర్గమ్మ సన్నిధిలో వేకువజామున ఖడ్గమాల పూజలు నిర్వహిస్తారు. ఈ పూజ ప్రత్యేకత దృష్ట్యా టిక్కెట్ రుసుము రూ.5,116గా నిర్ణయించారు. ఆలయం లోపల పూజ చేస్తారు. స్థలం తక్కువ ఉండటంతో పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతిస్తారు. శుక్ర, ఆదివారాలు, పర్వదినాలు, ప్రత్యేకమైన రోజులు, మంగళవారాలు, ఖడ్గమాల పూజ చేయించటం శుభకరమని నమ్మిన భక్తులు ఆ రోజుల్లో



ఎక్కువగా వస్తుంటారు. ఖడ్గమాలార్చనను 2008 నుంచి ప్రారంభించారు. ఇదేతరహాలో శ్రీచక్ర నవావరణార్చన పూజలు అమ్మవారి ఆలయం పక్కనున్న స్థలంలో నిర్వహిస్తుంటారు. శ్రీచక్ర నవావరణార్చన పూజ ప్రత్యేకమైన ఉపాసకులు మాత్రమే చేయగలరు. ఈ పూజను 2000లో ప్రారంభించారు. దసరా ఉత్సవాల్లో ఈ పూజకు రుసుము రూ.3వేలుగా నిర్ణయించారు. సాధారణ రోజుల్లో రూ.1,116గా నిర్ణయించారు.

చండీహోమం

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలలో నిత్యం చండీహోమం జరుగుతుంది. ఎక్కడా లేనివిధంగా ఆలయంలో చండీహోమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నారు. సాధారణంగా పూజలు చేస్తున్నప్పటికీ హోమం ద్వారానే ఎక్కువ ఫలితాలు వస్తాయన్న నమ్మిక. శక్తిస్వరూపురాలైన చండీదేవిని ప్రసన్నం చేసుకోవటానికి హోమం ద్వారానే సాధ్యమవుతుందని నమ్మిక. సాధారణ రోజుల్లో చండీహోమం రుసుము రూ.1,116లు, దసరా మహోత్సవాల్లో రూ.4వేలుగా నిర్ణయించారు.



బందరు రోడ్డులో..

నగరంలో ఎల్ఈడీ స్క్రీన్లు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాల విశేషాలు, పూజాదికాలు, హోమాలు లైవ్‌లో వీక్షించేందుకు దేవస్థానం నగరంలోని పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసింది. బస్టాండ్, బందరు రోడ్డులో ఈ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. మహోత్సవాల్లో భాగంగా మూలనక్షత్రం నుంచి 4 రోజుల పాటు అన్ని విశిష్ట దినాలే రానున్నాయి. సప్తమి తిథి నాడు మూలనక్షత్రం సందర్భంగా భక్త జనం పెద్ద ఎత్తున రానున్నారు. ఇక దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి రోజుల్లోనూ భక్తజనం తరలి వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు కొండపై సాంస్కృతిక ప్రదర్శనలు, లక్ష కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ, చండీహోమం జరుగుతుంటాయి. ఈ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లి ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు దేవస్థానం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసింది. ప్రజలు వీక్షించటం ద్వారా మరింత ప్రచారం జరగనుంది.



అధికారుల సమన్వయంతో సాఫీగా దర్శనం

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● మూలానక్షత్రం ఏర్పాట్లు పరిశీలన

వన్‌టౌన్, లబ్బీపేట, అక్టోబరు 8: దసరా ఉత్సవాల్లో 13 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం సాఫీగా జరిగేలా పనిచేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ బుధవారం మూలానక్షత్రం సందర్భంగా సరస్వతి అమ్మవారిని ఉదయం 3 నుంచి రాత్రి 11.30గంటల వరకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నార. అన్ని క్యూలైన్లలో ఉచితంగా దర్శనం చేసుకోవచ్చన్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య వీఐపీ దర్శనాలను రద్దు చేశామని, ప్రతి ఒక్కరూ అమ్మవారి దర్శించుకున్న అనంతరం ఉచితంగా లడ్డు అందజేస్తామని తెలిపారు. మూలానక్షత్రం రోజు అమ్మవారికి సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించనున్నారని, ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య జరుగుతుందన్నారు. ప్రొటోకాల్ ఉన్న కొద్దిమందికి మాత్రమే అంతరాలయ ప్రవేశం ఉంటుందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మూలానక్షత్రం రోజున ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లపై మంగళవారం మంత్రి రామనారాయణ రెడ్డి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఇతర ఉన్నతాధికారులు, కలెక్టర్ జి.సృజనతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, కలెక్టర్ సృజన అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వారికి వేద పండితుల ఆశీస్సులు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.





దుర్గమ్మ సన్నిధిలో మంత్రి ఆనం, కలెక్టర్ సృజన

కుమ్మరిపాలెం వద్ద ఉద్యోగుల అడ్డగింత

భవానీపురం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పోలీసులు అత్యుత్సాహం పెచ్చుమీరుతోంది. కొండపైనే కాదు, కింద కూడా రెచ్చిపోతున్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు వచ్చిన వారు తాము ఉద్యోగులమే? తోటి ఉద్యోగులను గౌరవించాలన్న స్పృహ లేదు. కుమ్మరిపాలెం నుంచి అమ్మవారి గుడిపై వివిధ ట్రాన్స్‌పోర్టు విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై వస్తుంటే మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు చాలామందిని అడ్డుకున్నారు. వాహనం వెళ్లడానికి వీల్లేదని, నడిచి వెళ్లండి లేకపోతే ఫ్లై ఓవర్ ఎక్కి వెళ్లాలంటూ ఉచిత సలహాలివ్వడంపై దేవదాయశాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. తాము ఉద్యోగులమే కదా? మా విధులకు పోలీసులు అడ్డుతగలడం షరా మామూలే అయిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాసుల్లోను కోత... హోదా నమోదు తూచ్..

అమ్మవారి గుడి తరపున విధుల్లో ఉన్న సగానికి పైగా వివిధ హోదాల్లోని సిబ్బందికి పాసులివ్వడంలో గుడిలో పనిచేసే ఓ ఏఈవో స్థాయి అధికారి కోతలు విధించారని ఆరోపిస్తున్నారు. తమ కుటుంబాలతో అమ్మవారి దర్శనం ఒక్కసారి కూడా చేసుకోలేపోయామని, పోలీసులతో గెంటించుకోవాలా? కొండపై అమ్మకు సేవ చేసుకునే మాకే ఈ అవహేళన ఏమిటని నిలదీస్తున్నారు.

ఎందరో కార్యకర్తలకు ఆదర్శం గౌరంగబాబు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



భారతీనగర్, అక్టోబరు 8: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యలమంచిలి గౌరంగబాబు పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, ఎంతో మంది కార్యకర్తలు ఆయన అడుగుజాడల్లో ముందుకొచ్చారని, అటువంటి మహోన్నత వ్యక్తి మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన యలమంచిలి గౌరంగబాబు అంతిమయాత్రలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ఆయన మృతదేహంపై టీడీపీ జెండాను కప్పి నివాళులర్పించారు. రామలింగేశ్వరనగర్‌లోని హిందూస్మశాన వాటిక వద్ద టీడీపీ నేతలు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. టీడీపీ నేతలు మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి గాంధీ, నగర వైసీపీ నేత దేవినేని అవినాష్, టీడీపీ నేతలు, పెద్దలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాలసీ సమావేశంపై గందరగోళం

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 7: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఏ నిర్ణయం తీసుకున్నా? అది వివాదాలకే ఆజ్యం పోస్తోంది. గత ప్రభుత్వం నీడలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్పోర్ట్స్ పాలసీపై వివిధ క్రీడా సంఘాలతో సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఈ నెల 10న కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఈ సమావేశం క్రీడా సంఘాల ప్రతినిధులతో నిర్వహించనున్నారు. మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న సమావేశానికి 17 క్రీడాసంఘాలకు ఇప్పటి వరకు శాప్ వీసీ, ఎండీ గిరిషా ఆహ్వానాలు పంపారు. శాప్ గుర్తించిన క్రీడా సంఘాలు ఇంకా ఉన్నా పంపకపోవడంతో దుమారం రేగుతోంది. ఇది కాస్త వివాదాస్పదం కావడంతో లిఖితపూర్వకంగా ఆహ్వానాలు కాకుండా ఫోన్లలో సమావేశానికి రావాలంటూ కార్యాలయం నుంచి కొంతమంది కోచ్‌లతో ఆయా సంఘాల ప్రతినిధులకు మంగళవారం పిలుపు అందించారు.



గన్నవరంలో స్వీట్లు తినిపిస్తున్న ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మ శ్రీ

రాహుల్ సారథ్యంలో అధికారంలోకి కాంగ్రెస్

● ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ

గన్నవరం, అక్టోబరు 8: రాహుల్ గాంధీ సారథ్యంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మ శ్రీ అన్నారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ జార్ఖండ్‌లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలకు భరోసా కల్పిస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేసిన ధీరుడన్నారు. మహారాష్ట్ర నుంచి మణిపూర్ వరకూ న్యాయయాత్ర చేసి ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. నిత్యవసరాల ధరలు పెరిగితే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కనిపించటం లేదన్నారు. వరదల్లోనూ కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. మద్యం టెండర్లు సజావుగా జరగటం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే క్రీడాభివృద్ధి

● ఘనంగా జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ ● ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చిత్రంలో గిరిషా, అంకమ్మ చౌదరీ, ద్వారకానాథ్

విజయవాడ, స్పోర్ట్స్, అక్టోబరు 8: రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని, గతంలో ఏషియన్ గేమ్స్ విజయవంతంతో పాటు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధి ప్రదాత ఆయనేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య వీఎంసీ ఇండోర్ స్టేడియం, గురునానక్ కాలనీలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీల్లో జరిగే యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ (కలగర నాగబాబు మెమోరియల్) టోర్నీ ప్రారంభోత్సవం రామకోటయ్య స్టేడియంలో ఏపీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కాల ద్వారకానాథ్, ఎం అంకమ్మ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవానికి గద్దె, శాప్ ఎండీ గిరిషా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ 2026 ఇంటర్నేషనల్ గేమ్స్ నిర్వహణకు కూడా సీఎం నడుంబిగించారని, ఉమ్మడి రాష్ట్రంలోని క్రీడల అభ్యున్నతికి ఆయన కృషి చేశారన్నారు. అనంతరం శాప్ వీసీ, ఎండీ గిరిషా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఆంధ్ర ఆసుపత్రి ఎండీ పీవీ రమణమూర్తి, ఆడిటర్లు అక్కయ్యనాయుడు, పూర్ణ, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ భాస్కరరావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఏపీబీఏ ట్రెజరర్ వంశీకృష్ణ, కేడీబీఏ జాయింట్ సెక్రటరీ దోనేపూడి ధనలక్ష్మి, టోర్నీ చీఫ్ రిఫరీ రాకేష్ శేఖర్ (కేరళ) పాల్గొన్నారు.

మహిళా చైతన్యమే లక్ష్యంగా..



విద్యార్థి ఉద్యమం నుంచి సేఫ్ వరకూ సామాజిక స్పృహతోనే ప్రయాణం ● జ్యోత్స్న మరణంతో నగరంలో విషాదం

విజయవాడ, అక్టోబరు 8: ఒకనాటి విద్యార్థి కార్యకర్త, నేటి తరుణీతరంగాలు, స్టెప్ హెడ్ ఫర్ ఈక్వాలిటీ (సేఫ్) స్థాపనలో కీలక భూమిక వహించిన గుళ్లపల్లి జ్యోత్స్న మంగళవారం తెల్లవారుజామున రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ సమాచారంతో నగరంలో విషాదం అలముకుంది. 1980లో కృష్ణాజిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యురాలిగా పనిచేసిన జోత్స్న, మహిళా ఉద్యమంలోనూ అంతే చురుగ్గా పనిచేశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాగిన మద్యనిషేధ ఉద్యమంలో చురుకైనపాత్ర పోషించారు. 1992లో రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళా న్యాయసలహా సంఘాన్ని తమ ఇంట్లోనే ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత న్యాయసహాయం అందించారు. విద్యావంతులైన మహిళలను సంఘటితపరిచి తరుణీరతంగాలను ఏర్పాటు చేశారు. అమరావతి బాలోత్సవ్ కార్యదర్శిగా ప్రత్యేక ముద్ర వేశారు. 2022లో స్టెప్ హెడ్ ఫర్ ఈ క్వాలిటీ (సమానత్వం కోసం ఒక అడుగు ముందుకు) అనే సంస్థను స్థాపించి విద్యార్థులను చైతన్యవంతులను చేస్తూ వచ్చారు. ఇటీవలే 'చెడును దునుమాడుదాం' అనే థీమ్‌తో దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన జ్యోత్స్న ఇకలేరనే వార్త తెలిసిన వెంటనే నగర ప్రముఖులు, న్యాయవాదులు, మహిళలు సీతారాంపురంలోని వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహిళ, విద్యార్థి సంఘాలు, కళాశాలల యాజమాన్యాలు జ్యోత్స్న మృతికి సంతాపం తెలిపాయి.

గుండెలు కలచివేసేలా...

రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురవడంతో గాయపడిన న్యాయవాదులతోపాటు సుంకర రాజేంద్ర ప్రసాద్‌ను కూడా అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. కొంతదూరం వెళ్లాక ఆయన బస్సులో ఉన్న న్యాయవాదులకు ఫోన్ చేసి జ్యోత్స్న ఎలా ఉందని అడిగారు. అప్పటి వరకు ఆమె ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. న్యాయవాదులంతా ఆమెకోసం బస్సులో వెతుకుతున్నారు. ఇంతలో బస్సు వెనుక టైర్ల కింద ఒకరు పడి ఉన్నారని గమనించారు. న్యాయవాదులు బస్సు కింద ఉన్న ఆ మహిళ ఫొటోను సెల్‌ఫోన్‌లో తీశారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు దిగిన ఫొటోలను పరిశీలించినప్పుడు చెవిదిద్దులు, చేతులకున్న గాజులు, దుస్తులను పరిశీలించి జ్యోత్స్నగా గుర్తించారు.

ఐఏఎల్ సంతాపం

విజయవాడ లీగల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రముఖ న్యాయవాది, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి మహిళా ఉద్యమ నేత గుళ్లపల్లి జ్యోత్స్నకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర నాయకత్వం మంగళవారం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ జ్యోత్స్న మరణం న్యాయవాదులకు తీరని లోటని, పలువురు న్యాయవాదులు తీవ్రంగా గాయపడ్డారని, వారందరూ త్వరగా కోలుకోవాలని చలసాని ఆకాంక్షించారు..

గుడపాటి సంతాపం..

అలాగే తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ కార్యాలయ ఇన్‌చార్జి గుడపాటి లక్ష్మీ నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డుప్రమాదంలో మృతిచెందిన జ్యోత్స్నకు నివాళులర్పించి, గాయపడిన న్యాయవాదులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అక్రమార్కులపై చర్యలేవి?

వైసీపీ పాలనలో హౌసింగ్ ఏఈల చేతివాటం

కాంట్రాక్టర్, ట్రాన్స్‌పోర్టర్ అవతారాలెత్తి మరీ దందా

* అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో సిమెంట్, ఐరన్ మాయం

* అధికారుల విచారణలో అక్రమాలు నిజమేనని తేలినా నేటికీ చర్యలు శూన్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని లబ్ధిదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. పామర్రు నియోజకవర్గం మొవ్వ మండలంలో పనిచేసే మహిళా వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను వైసీపీ ప్రభుత్వంలో చల్లపల్లి మండలం గృహ నిర్మాణశాఖ ఏఈగా నియమించారు. ఈమె చల్లపల్లిలో బాధ్యతలు తీసుకున్న తర్వాత పేదల గృహ నిర్మాణాలకు సిమెంటు, ఇనుము ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా రికార్డులో నమోదు చేసి, 1300 సిమెంటు బస్తాలు, ఏడు టన్నుల ఇనుము మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అవనిగడ్డలో రెండు అంతస్తుల భవనం నిర్మించుకున్నారని ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై అధికారులు విచారణ జరిపి నివేదికను రూపొందించారు. ఈ విచారణ అనంతరం ఆమెపై చర్యలు తీసుకోకుండా మచిలీ పట్నంలోని జిల్లా గృహనిర్మాణశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో అక్కడే పనిచేసే డీఈ తెరవెనుక చక్రం తిప్పారనే విమర్శలున్నాయి.

వ్యాన్ కొనుగోలు చేసి మరీ రవాణా

ఘంటసాల మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంటు, ఇనుము ఇచ్చేందుకుగాను గూడౌన్ ఉంది. ఈ మండల ఏఈ ఒక వ్యాన్ కొనుగోలు చేసి లబ్ధిదారులు ఇనుము, సిమెంటు కోసం వస్తే తన వ్యాన్‌లోనే రవాణా చేయాలని నిబంధనపెట్టాడు. తన మనిషిని వ్యాన్ డ్రైవర్‌గా పెట్టుకుని, అతనికే గూడౌన్ తాళాలు ఇచ్చి అవకాశం ఉన్నంతవరకు ఇనుము, సిమెంటును దొడ్డిదారిన తరలించుకుపోయారు. ఈయనే అవనిగడ్డ మండలం ఇన్‌చార్జి ఏఈగాను పనిచేశారు. రెండు మండలాల్లో రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు ఇనుము, సిమెంటు మాయం చేశారని ఈయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఏఈ అక్రమాలపైన అధికారులు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

ఇళ్ల నిర్మాణానికి భారీగా వసూలు

అవనిగడ్డ మండలం గృహ నిర్మాణశాఖలో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని వైసీపీ ప్రభుత్వం వచ్చాక మోపిదేవి మండలం ఏఈగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. మోపిదేవి, కోసూరివారిపాలెం గ్రామాల్లో గిరిజనుల గృహాలను ఈ ఏఈనే కాంట్రాక్టుకు తీసుకుని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రతి పనికి ఒకరేటు నిర్ణయించి లబ్ధిదారుల నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేశాడనే ఆరోపణలున్నాయి. మండలంలోని మిగిలిన గ్రామాల్లో సైతం ఇదే విధంగా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. ఏఈ పనితీరుపై అనేక ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ జరిపి మోపిదేవి మండలం నుంచి జిల్లా కార్యాలయానికి పంపారు. మోపిదేవి మండలానికి వేరొక ఏఈని నియమించినా.. పాత ఏఈ మోపిదేవిలోనే ఉండటం గమనార్హం. మోపిదేవి మండలంలోనూ పెద్దమొత్తంలో ఇనుము, సిమెంటు మాయం కాగా, కొందరు పెద్దల సహకారంతో ఈ విషయం బయటకు రాకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో జరిగిన అక్రమాలపై గృహనిర్మాణశాఖ, విజిలెన్స్ అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక బయటకు రాకుండా, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా తెరవెనుక కొందరు రెగ్యులర్ అధికారులు, పెద్దలు వ్యవహారం నడపడం చర్చనీయాంశంగా మా రింది. ఈ నేపథ్యంలో అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ గృహనిర్మాణశాఖలో పనిచేసే అధికారులు తనవద్దకు రావద్దని ఖరాఖండిగా చెప్పినట్లు ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

అడుసుమిల్లి కుటుంబసభ్యులకు జగన్ పరామర్శ

మొగల్రాజపురం, అక్టోబరు 8: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ కుటుంబ సభ్యులను మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మంగళవారం పరామర్శించారు. సాయంత్రం సమయంలో జమ్మిచెట్టు సెంటర్‌లోని కరెంటు బావి వద్ద ఉన్న లోటస్ టవర్స్‌లోని జయప్రకాష్ ఇంటికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు తిరుమలేష్, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపాన్ని తెలిపారు. జగన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ పాల్గొన్నారు.



ఎదురు కాల్పులపై న్యాయ విచారణ జరపాలి

పౌరసంఘాల నేతలు

ధర్నాచౌక్, అక్టోబర్ 8: తెల్లులి - నెండూరు ఘటనతో సహా జనవరి నుంచి జరిగిన ఎదురు కాల్పుల ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని పౌర, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఆదివాసులను, అడవిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న అభివృద్ధి నమూనాపై ప్రభుత్వం చర్చించాలన్నారు. ఆదివాసులను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ 'కగార్'ను నిలిపేయాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం నేతలు టి.ఆంజనేయులు, చిలుకా చంద్రశేఖర్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నేత వై.వెంకటేశ్వర్లు, ఓపీడీఆర్ నేత వి.హనుమంతరావు, ఐఫ్టూ నేత కే పోలారి, కుల నిర్మూలన పోరాట కమిటీ నేత కే కృష్ణ, చైతన్య మహిళా సంఘం నేత మంజరి లక్ష్మీ, విప్లవ రచయితల సంఘం నేత రివేరా పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పీఎస్‌యూ వీసీ పృథ్వీయాదవ్, అడ్మిషన్స్ డైరెక్టర్ సంజీవ్ తదితరులు

మార్పులకు అనుగుణంగా కోర్సులు ఎంపిక చేసుకోవాలి

- ఎస్‌పీఎస్‌యూ వీసీ డాక్టర్ పృథ్వీయాదవ్ సూచన
- హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

బంజారాహిల్స్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా కోర్సుల ఎంపిక ఉండాలని సర్ పదంపత్ సింఘానియా విశ్వవిద్యాలయం(ఎస్‌పీఎస్‌యూ) ఉపకులపతి డాక్టర్ పృథ్వీయాదవ్ అన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన ఎస్‌పీఎస్‌యూ.. అమీర్‌పేట్‌లోని ఎంపీఎం మాల్‌లో ఏర్పాటు చేసిన దక్షిణ భారత ప్రాంతీయ కార్యాలయాన్ని అడ్మిషన్స్ డైరెక్టర్ సంజీవ్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రత్యేకతలను ఆయన వివరించారు.

ఏపీపీఎస్సీ నియామక పత్రాలు జారీచేయదు!

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ల పట్ల నిరుద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఏపీపీఎస్సీ సూచించింది. ఏపీపీఎస్సీ, ఏపీపీఎస్సీ సభ్యుల పేరుతో కొందరు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ నుంచి ఉద్యోగాలకు ఎలాంటి నియామక పత్రాలూ జారీ కావని స్పష్టంచేశారు.

ఆ నలుగురు కమిషనర్లకూ జీతాలు చెల్లించండి

- ఆర్టీఐ అధికారికి ప్రభుత్వం ఆదేశం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్లు నలుగురికి సెప్టెంబరు నెల జీతాలు చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ అధికారికి ఆదేశాలు జారీ చేసింది. ఆ నలుగురూ విధులకు సక్రమంగా హాజరుకాలేదంటూ సెప్టెంబరు నెల జీతభత్యాలను చీఫ్ కమిషనర్ ఆర్.ఎం.బాషా ఆపేయమన్నారు. జీతాల విషయమై కమిషనర్లు పి.శామ్యూల్ జొనాథన్, సీహెచ్.సునీల్, రెహానా బేగం, ఎ.ఉదయ్ భాస్కర్‌రెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం తక్షణమే వారికి జీతభత్యాలు చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

జగన్ కుళ్లు రాజకీయాలు మానుకోవాలి: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 8: వరద సహాయంపై వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. జగన్ రెడ్డి కుళ్లు, కుట్ర రాజకీయాలను మానుకోవాలని సూచించారు. మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదలను అడ్డం పెట్టుకుని టీడీపీ ప్రభుత్వం దోపిడీ చేసిందనడానికి వైసీపీ వాళ్లకు సిగ్గు ఉండాలని విమర్శించారు. కోటి రూపాయల విరాళం ప్రకటించిన జగన్.. ఎక్కడ, ఎవరికి ఖర్చు పెట్టాడో చెప్పాలని డిమాండ్ చేశారు.

'కేఆర్ఎంబీ'ని అమరావతికి తరలించండి

- కిసాన్ మోర్చా సభలో రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య డిమాండ్

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య సంస్థ(కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. మంగళవారం బెంగళూరులో జరిగిన దక్షిణ భారత సంయుక్త కిసాన్ మోర్చా సభలో సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ కృష్ణా నది ఆనవాళ్లే లేని విశాఖలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని మండిపడ్డారు.

సీఎంఆర్ఎఫ్‌కు పశు వైద్యుల రూ.లక్ష విరాళం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం పశువైద్యులు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి చెక్కు అందజేశారు.

పర్యావరణ కాలుష్యంపై నేడు వర్క్‌షాప్

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంపై విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో కన్సల్టేటివ్ వర్క్‌షాప్‌ను పీసీబీ నిర్వహిస్తోంది. అటవీ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

'హౌసింగ్' అక్రమార్కులపై వేటు

- అనంతలో ఒక డీఈఈ, ఏఈ సస్పెన్షన్?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సిటీ, అక్టోబరు 8: హౌసింగ్‌లో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాల ఆధారంగా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఒక డీఈఈని, ఆయన కింద పని చేసే ఏఈని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇద్దరు రిటైర్డ్ అధికారులు సహా 8మంది ఇంజనీరింగ్ అధికారులపై అభియోగాలు నమోదు చేసినట్లు సమాచారం. అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ చేసిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. ఈ అక్రమాల్లో హౌసింగ్ అధికారుల పాత్రను బయటపెట్టింది. ఈ కథనాల ఆధారంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన నియోజకవర్గంలో జరిగిన అక్రమాలను సీఎం చంద్రబాబు, హౌసింగ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో ఆ శాఖ ఎండీ హౌసింగ్‌లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించారు. తాజాగా 10 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు ఎండీ నుంచి మంగళవారం జిల్లా హౌసింగ్ పీడీకి ఉత్తర్వులు వచ్చాయి.

దేవుని కడప... ప్రజల అభిమతం: సత్యకుమార్

న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి), కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 8: 'జిల్లాకు 'కడప' లేదా 'దేవుని కడప' అన్న పేరు మాత్రమే ఉండాలనేది ప్రజల అభిమతం. అయినప్పటికీ వైఎస్ఆర్ పేరు తొలగించమని నేను ఎక్కడా కోరలేదు' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. జిల్లా పేరు మార్పు వివాదంపై మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఇంకోవైపు.. 'వైఎస్సార్ జిల్లా పేరును కడప జిల్లాగా మార్చాలని పక్క జిల్లాకు చెందిన మంత్రి సత్యకుమార్ మాట్లాడడం హేయమైన చర్య. ఇటువంటి ప్రతిపాదనను సీఎం చంద్రబాబు పక్కన పెట్టాలి. పేరు మారిస్తే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదు' అని అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి కడపలో హెచ్చరించారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.287.12 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. బేసిక్ టైడ్ గ్రాంట్ కింద 2024-25 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులను విడుదల చేసింది. అదే విధంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి బేసిక్ అన్‌టైడ్ గ్రాంట్ కింద మొదటి విడతగా రూ.108 కోట్లు విడుదల చేస్తూ మరో జీవోను విడుదల చేశారు. మొత్తంగా గ్రామ పంచాయతీలకు రూ.395 కోట్లు అందనున్నాయి.

తాగునీటి పనులకు నిధులు మంజూరు

జల్‌జీవన్ మిషన్ పథకం కింద పీవీటీజీ(ఆదిమ గిరిజన సమూహాల) నివాసిత ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పన పనుల కోసం రూ.29.93 కోట్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంజూరుచేసింది.

'ఉపాధి'లో విజిలెన్స్ ఉనికేది?



వైసీపీ హయాం నుంచి దిగజారిన సీవీఓ స్థాయి

- ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలోనే నడిచిన విభాగం
- అవినీతి ఆరోపణలున్న ఆర్డీఓ స్థాయి అధికారికి బాధ్యతలు
- 12 జిల్లాల్లో ఖాళీ అయిన విజిలెన్స్ విభాగాలు
- కొన్ని మినహా అన్ని జిల్లాల్లో డీవీఓ పోస్టులు ఖాళీ
- ప్రక్షాళనపై కూటమి ప్రభుత్వం కసరత్తు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో నిఘా కొరవడింది. మమ అనిపించే తనిఖీలతో తప్పులను కప్పిపుచ్చుతూ సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వమే ఉపాధి సిబ్బంది చేత తప్పులు చేయించి దానిని కప్పిపుచ్చుకునేందుకు నిఘా సంస్థలను నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్‌లో ఉండే విజిలెన్స్ విభాగం పూర్తిగా ఉనికి కోల్పోయింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు నాలుగు రకాల నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అయితే వాటి కళ్లకు గంతలు గట్టి యథేచ్ఛగా అక్రమాలకు గేట్లు ఎత్తేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో గతంలో సోషల్ ఆడిట్, విజిలెన్స్ విభాగం, క్వాలిటీ కంట్రోల్, అంబుడ్స్‌మన్ వ్యవస్థలు చురుకుగా వ్యవహరించేవి. అలాంటి వ్యవస్థలను వైసీపీ సర్కార్ నీరుగార్చింది.

ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు నిఘా వ్యవస్థల రూపకల్పనలో గతంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా ఉండేది. గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌లో ప్రత్యేకంగా విజిలెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రాష్ట్రస్థాయిలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(సీవీఓ)ను నియమించారు. ప్రారంభంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీవీఓగా వ్యవహరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ విజిలెన్స్ విభాగం ఉపాధిలో అవినీతికి పాల్పడిన వారి నుంచి రికవరీ చేయడంతో పాటు ఉద్యోగులపై చర్యలు, తప్పు చేసిన వాళ్లపై కేసుల నమోదు విజిలెన్స్ బాధ్యత. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత నిఘా సంస్థలు కొంతమేర బలహీనపడినా 2014 తర్వాత చంద్రబాబు హయాంలో విజిలెన్స్ విభాగం చురుకుగా వ్యవహరించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత అసలు విజిలెన్స్ ఉనికి లేకుండా పోయింది. ప్రస్తుతం కమిషనరేట్‌లో ఈ విభాగం ఒక ఆర్డీఓ స్థాయి అధికారి చేతిలో ఉంది. ఏ మాత్రం సమర్థత లేని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లేని అధికారి పెత్తనం చేస్తున్నారు. ఈ అధికారి తహశీల్దార్‌గా పనిచేస్తున్న కాలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు సమాచారం.

నాలుగు రకాల నిఘా వ్యవస్థలు

ఉపాధి హామీ పథకం పనులను సామాజిక తనిఖీ విభాగం క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. తప్పులు జరిగితే బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి, అవినీతి మొత్తాన్ని రికవరీ చేసేందుకు సిఫారసులు చేస్తారు. ఈ సిఫారసులపై డ్వామా కార్యాలయంలోని జిల్లా విజిలెన్స్ అధికారి విభాగం సమగ్ర విచారణ చేపట్టి రికవరీ చేస్తుంది. ఉపాధి మేట్లు రూ.5 వేల కంటే ఎక్కువ అవినీతికి పాల్పడితే వారిని విధుల నుంచి తొలగించి కేసులు నమోదు చేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.10 వేలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు రూ.25 వేలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్, ఏఈలు రూ.50 వేలు, ఎంపీడీఓలు రూ.లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటారు. దీంతో పాటు ఎక్కడైనా అవినీతిపై ఫిర్యాదులొచ్చినప్పుడు జిల్లాలోని అంబుడ్స్‌మన్ విచారణ చేపడతారు. అంబుడ్స్‌మన్ సిఫారసులపై పీడీలు చర్యలు తీసుకుంటారు. నాణ్యతా నియంత్రణ విభాగం మొత్తంలో 10 శాతం పనులను ఎంపిక చేసుకుని నాణ్యతను పరిశీలిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విభాగానికి కూడా ప్రత్యేక సిబ్బంది ఉంటుంది. ఈ నాలుగు విభాగాలు చేపట్టిన తనిఖీలకు సంబంధించి విచారణ చేపట్టి చర్యలు తీసుకునేందుకు విజిలెన్స్ విభాగం సిఫారసు చేస్తుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో విజిలెన్స్ కోరలు పీకేశారు. ఉపాధి పథకాన్ని అవినీతి ఊబిలోకి నెట్టేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వీర్యమైన విజిలెన్స్ వ్యవస్థ

రాష్ట్రస్థాయిలో గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సమీక్ష చేపట్టి ఎప్పటికప్పుడు విజిలెన్స్‌కు పదును పెట్టాల్సిన పరిస్థితి నుంచి విజిలెన్స్ విభాగం ఏం చేస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. మొదట్లో రిటైర్డ్ ఐఏఎస్ సీవీఓగా ఉన్న ఈ విభాగం ప్రాధాన్యత కోల్పోతోంది. 2018 తర్వాత నుంచి ఇన్‌చార్జ్‌గా ఉంటున్నారే తప్ప పూర్తిస్థాయి అధికారిని సీవీఓగా నియమించలేదు. గత ప్రభుత్వంలో సీవీఓగా ఉపాధి హామీ పథకం డైరెక్టర్ చినతాతయ్య ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఈ సమయంలో విజిలెన్స్ వ్యవస్థను అటకెక్కించారన్న ఆరోపణలున్నాయి. జిల్లా విజిలెన్స్ అధికారిని(డీవీఓ) స్వతంత్రంగా నియమించాల్సి ఉండగా... వారిని డ్వామా పీడీల ఆధీనంలో ఉంచారు. దీంతో విజిలెన్స్ వ్యవస్థ నీరుగారిపోయింది. జిల్లాల విభజన తర్వాత విజిలెన్స్ విభాగం పరిస్థితి దారుణంగా మారిపోయింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారడంతో వాటికి విజిలెన్స్ అధికారులను సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, కృష్ణా, పల్నాడు, బాపట్ల, నంద్యాల, తిరుపతి, చిత్తూరు, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో విజిలెన్స్ విభాగంలో సిబ్బంది లేరు. ఒక్కరిద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తున్నారు. పాత జిల్లాల్లో డీవీఓలను నియమించి కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్లను నియమించకపోవడంతో 12 జిల్లాల్లో పూర్తిగా విజిలెన్స్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇటీవల డీఎల్‌డీఓలు బదిలీ కావడంతో కృష్ణా, ప్రకాశం, ఎన్టీఆర్ తప్ప అన్ని జిల్లాల్లో డీవీఓ పోస్టులు ఖాళీ అయ్యాయి.

కొత్త ప్రభుత్వంలో సీవీఓగా ఏఎస్పీ స్థాయి అధికారి!

ఇప్పటికే సోషల్ ఆడిట్ డైరెక్టర్ పదవీ కాలం పూర్తయింది. పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజను ఇన్‌చార్జ్‌గా నియమించారు. చీఫ్ విజిలెన్స్ అధికారిగా పోలీసు అధికారిని నియమించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ యోచిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని నియమించి, తప్పు చేయాలనుకొనే సిబ్బందిలో భయం పుట్టే విధంగా చేయాలని నిర్ణయించారు. విజిలెన్స్ విభాగాన్ని స్వతంత్ర సంస్థగా మారిస్తే తప్ప అవినీతిని కట్టడి చేయలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాల్లోనూ డీవీఓలను పీడీ ఆధ్వర్యంలో కాకుండా నేరుగా సీవీఓ నియంత్రణలో ఉండేట్లు చేస్తే నిఘా వ్యవస్థలు పారదర్శకంగా పనిచేస్తాయంటున్నారు. మిగతా నిఘా ఏజెన్సీల్లో కూడా సమర్థ అధికారులను నియమించి, పూర్తిస్థాయిలో మార్పులు తీసుకురావాల్సిన అవసరముంది.

ఏపీ ప్రభుత్వ లోగోతో ఫేక్ ఖాతా

- చంద్రబాబు, కూటమిపై విమర్శలే ప్రధానం
- సీఎం వయసునూ హేళన చేస్తూ వ్యాఖ్యలు
- పోలీసులు, హోం మంత్రికి పట్టని వైనం



ఫేక్ చెక్ పేరు, ప్రభుత్వ లోగోతో ఉన్న సామాజిక మాధ్యమం ఖాతా చిత్రం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక మాధ్యమంలో ఏపీ ప్రభుత్వ లోగోతో ఓ ఖాతా.. దానిలో వచ్చే సందేశాలన్నీ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలే. 'ఫేక్‌చెక్ ఏపీ జీవోవీ'(FakeCheckApGov) పేరుతో ఆ ఖాతా ఉంది. దీనిలో పోస్టు చేసిన రెండు సందేశాలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అవే పోలీసులు, హోం మంత్రి తీరుపై విమర్శలకు కారణం అయ్యాయి. సెప్టెంబరు 18న పెట్టిన ఓ సందేశంలో... 'ఆవు అనేది ఒక జంతువు. అంటే ఇంగ్లీషులో యానిమల్. ఆవు పాలతో తయారు చేసిన నెయ్యిలో ఆవు కొవ్వు కాకుండా మనిషి కొవ్వు ఉంటుందా? ప్రస్తుత సీఎం వయస్సు 75 సంవత్సరాలు. ఈ వయస్సులో తప్పులు మాట్లాడడం సహజం. కావున ఆంధ్ర ప్రజలు ఇతని మాటలు పట్టించుకోనవసరం లేదని టీటీడీ దేవస్థానము వారు కోరడమైనది' అని పేర్కొన్నారు. అలాగే 4 రోజుల క్రితం 'ఫేక్ న్యూస్ అలర్ట్' శీర్షికతో వచ్చిన మరో సందేశంలో... 'అధికార తెలుగు పార్టీ చేస్తున్న ఈ ఆరోపణలు నిజం కాదు. తిరుమల లడ్డూ వివాదంలో రాష్ట్ర దర్యాప్తు సంస్థలపైన పూర్తిగా నమ్మకం లేక సీబీఐ విచారణ కావాలని సుబ్బారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు' అని పేర్కొన్నారు. సదరు ఖాతా పేరు దిగువన ఇచ్చిన వివరణలో 'అఫీషియల్ అకౌంట్ ఆఫ్ ఫేక్ చెక్ వింగ్ ఆఫ్ ఫెడరల్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. రిపోర్ట్ ఎనీ మిస్‌లీడింగ్ పోస్ట్/ట్వీట్ ఎట్ ఫేక్‌చెక్ యాప్ ఎట్ ప్రొటాన్.మీ' అని రాసుకున్నారు. ఆగస్టు 2024న ప్రారంభమైన ఈ ఫేక్ ఖాతాపై సైబర్ పోలీసులు దృష్టి సారించకపోవడాన్ని పలువురు టీడీపీ నేతలు తప్పుపడుతున్నారు.

టీటీడీ కల్యాణ మండపాలను ధార్మిక కేంద్రాలుగా మార్చండి

- సీఎం చంద్రబాబుకు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపాలను ధార్మిక కేంద్రాలుగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాలకు పాలకమండళ్లు ఏర్పాటు చేయాలని మంగళవారం సీఎంకు వినతిపత్రాలు అందించారు. రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటుగా ఎంపీలకు వసతి సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. జర్నలిస్టులకు రైల్వే పాసులను కేంద్రం పునరుద్ధరించడంలో చొరవ తీసుకోవాలని, టోల్‌గేట్‌ల వద్ద ఉచిత పాసులను కల్పించాలని సీఎంకు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి చేశారు.

దండకారణ్యంలో తెలుగు 'వార్'!

- నక్సల్స్ ఉద్యమంలో తెలుగోళ్ల కీలక పాత్ర
- వివిధ రాష్ట్రాల్లో పార్టీ సారథులు వారే
- నేడు ఆపరేషన్ 'కగార్'లో తెలుగు పోలీసులు
- భారీ ఎన్‌కౌంటర్లలో వారిదే కీలక పాత్ర
- ఈ ఏడాది 200 మంది నక్సల్స్ మృతి

చర్ల, అక్టోబరు 8: మావోయిస్టు ఉద్యమాన్ని తెలుగు వారే నడిపిస్తే, అదే మావోయిస్టు పార్టీని దెబ్బకొట్టడంలోనూ తెలుగు పోలీసు అధికారులే కీలక పాత్ర పోషిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 1967లో ప్రారంభమైన నక్సల్స్ ఉద్యమ ప్రస్థానం 11 రాష్ట్రాల మీదుగా దండకారణ్యానికి చేరుకోగా, ప్రస్తుతం ఆపరేషన్ కగార్‌తో కేంద్ర బలగాలు మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలోనూ తెలుగు పోలీసు అధికారులే కీలక పాత్ర పోషిస్తుండడం విశేషం. ఇలా వరుస ఎన్‌కౌంటర్లతో పార్టీ కుదేలవడంతో ఉద్యమంపై నీలి నీడలు అలుముకున్నాయి. నక్సల్బరిలో ప్రారంభమైన ఉద్యమం 2004లో మావోయిస్టు పార్టీగా మారింది. 1967 నుంచి 1980వరకు అటు ఉద్యమాన్ని నడిపించిన వారిలో తెలుగు వారే ఉన్నారు. అబూజ్‌మడ్ కేంద్రంగా 2004లో మావోయిస్టు పార్టీగా మారిన తరువాత కూడా తెలుగువారే పార్టీని నడిపించారు. అటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, దండకారణ్యం ఇలా అనేక చోట్ల పార్టీకి నాయకత్వం వహించారు. గతంలో మావోయిస్టు పార్టీ ఇండియా కార్యదర్శిగా గణపతి పని చేశారు. ఆయన తెలుగు వారే కావడం, పార్టీ నుంచి ఆయన బయటికి వచ్చిన తరువాత శ్రీకాకుళానికి చెందిన నంబాల కేశవరావు ఆ బాధ్యతలు చేపట్టడం విశేషం. అలాగే కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్లలోనూ తెలుగు వారు వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీలో కీలక సభ్యులుగా పనిచేసి పార్టీని నడిపించిన అక్కిరాజు హరగోపాల్, హరిభూషణ్ శంకరావు, సాగర్, ఏసేబ్ మృతి చెందారు. వీరితో పాటు అనేక మంది తెలుగు వారు మావోయిస్టు పార్టీని నడిపించారు.

నక్సల్స్ వేటలో తెలుగు పోలీసులు

గత ఏప్రిల్ 17న జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో 29మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ ఆపరేషన్ నిర్వహించిన అధికారి తెలుగు అధికారే కావడం విశేషం. అలాగే గత ఐదు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనలోనూ తెలుగు అధికారే ప్రముఖ పాత్ర పోషించారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లు దేశ చరిత్రలో అతిపెద్ద ఘటనలుగా నిలిచాయి.

ఇంకా ఎంతమంది నక్సల్స్ ఉన్నారు?

జనవరి నుంచి భారీ ఎన్‌కౌంటర్లలో సుమారు 200 మంది మావోయిస్టులు మృతి చెందారు. 500 మందికి పైగా లొంగిపోయారు. సుమారు 350 మందికి పైగా అరెస్టయినట్లు గణాంకాలు చెబుతున్నారు. అయితే, 2004లో మావోయిస్టు పార్టీ ఏర్పడ్డ సమయంలో మావోయిస్టుల సంఖ్య సుమారు 9వేలు ఉందని తెలుస్తోంది. అప్పటి నుంచి రిక్రూట్‌మెంట్లతో పార్టీ పుంజుకుంది. ఇదే సమయంలో అప్పటి నుంచి ఎన్‌కౌంటర్లు కూడా జరుగుతూనే ఉన్నాయి. ఇన్ని ఘటనలు జరిగినా ఇంకా వేల సంఖ్యలోనే మావోయిస్టులు ఉన్నారని పోలీసులు చెబుతునారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని ప్రకటించారు. అయితే, మావోయిస్టుల సంఖ్య ఇంకా భారీగానే ఉన్నట్లు అంచనాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీని అంతం చేయడం అంత సులువు కాదన్న వాదన వినిపిస్తోంది.

రఘురామ కేసులో సాక్షుల వాంగ్మూలం

- గుంటూరు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయిస్తున్న పోలీసులు
- భవిష్యత్తులో మాట మార్చకుండా చర్యలు

గుంటూరు, అక్టోబరు 8: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాటి నరసాపురం ఎంపీ, నేటి ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు 'కస్టోడియల్ టార్చర్' కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన సమయంలో సీఐడీ ఆఫీసులో ఉన్న వారి నుంచి వాంగ్మూలం నమోదు చేస్తున్నారు. రఘురామను సీఐడీ కస్టడీకి తీసుకువచ్చిన రోజు రాత్రి ఏం జరిగింది? అనే కోణంలో కూపీలాగుతున్నారు. ఆ రోజు విధుల్లో ఉన్న ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, మరో నలుగురు సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారు. అయితే, వారంతా పోలీస్ అధికారులు కావడంతో భవిష్యత్తులో కేసు విచారణ సందర్భంగా ఈ స్టేట్‌మెంట్స్‌ను కోర్టు ఏమేరకు పరిగణనలోకి తీసుకుంటుందోనన్న సందేహం ఏర్పడింది. అదేవిధంగా భవిష్యత్తులో వారు మాటమార్చకుండా ఉండేందుకుగాను వారందరి స్టేట్‌మెంట్స్‌ను నేరుగా మేజిస్ట్రేటు వద్దే నమోదు చేయిస్తున్నారు. గుంటూరు జిల్లా మొబైల్ కోర్టులో మంగళవారం ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

విజయపాల్‌ను విచారిస్తేనే

సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామను కొట్టిందెవరనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం కేసు విచారిస్తున్న అధికారులు ఆ రోజు విధుల్లో ఉన్న సీఐడీ అధికారులు, సిబ్బందిని విచారించగా తాము కొట్టలేదని, నాటి సీఐడీ అదనపు ఎస్పీ కె. విజయపాల్ నేతృత్వంలో కొందరు వ్యక్తులు బయట నుంచి వచ్చారని, వారే రఘురామను కొట్టారని చెప్పినట్లు తెలిసింది. అయితే, వారెవరు అనేది ఇంతవరకు తేలలేదు. దీంతో ఈ కేసులో కీలకంగా ఉన్న నాటి అదనపు ఎస్పీ కె. విజయపాల్ పట్టుబడితేనే కొట్టినవారు ఎవరనేది తేలనుంది. మరోవైపు.. అలా వచ్చినవారు పోలీసులేనని, వారిని వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చారని, నాడు విధుల్లో ఉన్న సీఐడీ అధికారులు, సిబ్బంది విచారణ అధికారికి చెప్పినట్లు సమాచారం. విజయపాల్ నోరు విప్పితే రాజకీయనేతలకు, ఐపీఎస్ అధికారులకు ఉచ్చు బిగుసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులే ఆయనను దాచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీసపాడు అమర సైనికుడి తల్లికి అరుదైన అవకాశం

- ఢిల్లీ స్మారకస్థూపం వద్ద అమరులకు నివాళులు



క్రోసూరు, అక్టోబరు 8: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన అమర సైనికుడు నేలవల్లి నేతాజీ తల్లికి అరుదైన గౌరవం దక్కింది. 18 ఏళ్ల తర్వాత ఢిల్లీలో తన కుమారుడితో సహా ఇతర అమర జవాన్లకు నివాళులర్పించే అవకాశం లభించింది. పీసపాడుకు చెందిన నేలవల్లి భాస్కరరావు, వీరమ్మ దంపతుల తనయుడు నేలవల్లి నేతాజీ. ఆయన 2006 అక్టోబరు 10న జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందాడు. ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద ప్రతిరోజు అమర జవాన్లకు వారి తల్లిదండ్రుల చేత నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుంది. ఆ అవకాశం ఈసారి నేతాజీ తల్లి వీరమ్మకు దక్కింది. స్మారక స్థూపం వద్ద ఇతర అమరవీరులతోపాటు నేతాజీకి నివాళులర్పించేందుకు రావాలని ఢిల్లీ నుంచి వీరమ్మ దంపతులకు ఆహ్వానం అందింది. సైనికాధికారులు మంగళవారం సాయంత్రం అమరవీరుల స్మారక స్థూపం వద్దకు తీసుకువెళ్లి నివాళులర్పించే కార్యక్రమంలో భాగస్వాములను చేశారని, ఇది తమకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని వీరమ్మ చెప్పారు. ఈ సందర్భంగా సైనిక అధికారులు ఆమెకు ఒక జ్ఞాపికను అందజేశారు.

గ్రామదేవత ఉత్సవాల్లో వైసీపీ వర్గీయుల ఘాతుకం

- టీడీపీ వర్గీయులపై కత్తులతో దాడి.. ఒకరి హత్య, మరొకరికి తీవ్రగాయాలు

నరసన్నపేట, అక్టోబరు 8: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం వన విష్ణుపురంలో రాజకీయ కక్షలతో వైసీపీ వర్గీయులు.. టీడీపీ కార్యకర్తను హత్య చేశారు. గ్రామంలో దసరా వారాలు (గ్రామదేవత ఉత్సవాలు) జరుపుకొంటున్న నేపథ్యంలో టీడీపీ కార్యకర్త పాలిన వీరస్వామి(47)పై వైసీపీ నేత, మాజీ సర్పంచ్ పాలిన కృష్ణమూర్తి తన అనుచరులతో విచక్షణా రహితంగా కత్తులతో దాడిచేశారు. దీంతో వీరస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ఎన్నికల్లో వీరస్వామి వర్గీయులు టీడీపీకి మద్దతు ఇచ్చారని కృష్ణమూర్తి కక్ష పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి ఉత్సవాల సందర్భంగా వీరస్వామి తన అనుచరులతో కొమ్ములు వేసేందుకు అమ్మవారి గుడికి వెళ్తుండగా.. తమ వర్గమే ముందు వెళ్లాలని, ముందుగా మొక్కు చెల్లించాలని, మీరెలా వస్తారని కృష్ణమూర్తి అడ్డుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కృష్ణమూర్తి వర్గీయులు ఒక్కసారిగా కత్తులతో టీడీపీ వర్గీయులపై దాడికి దిగారు. దీంతో వీరస్వామి అక్కడికక్కడే మరణించగా.. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రామారావు తలకు గాయాలయ్యాయి.

వెలిగొండకు 2 వేల కోట్లు కేటాయించాలి: సీపీఐ రామకృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 8: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు రానున్న బడ్జెట్‌లో రూ.2వేల కోట్ల నిధులను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. వెలిగొండ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష ప్రతినిధులతో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రకాశంలోని పశ్చిమప్రాంతం ఏడు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి, గురైందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగి 28ఏళ్లు దాటుతున్నా నేటికి పనులు పూర్తికాలేదన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం దసరా అనంతరం మంత్రులు, సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు.



విశాఖపట్నం చేరుకున్న నౌకలు


నేటి నుంచి విశాఖలో 'మలబార్ మేరీటైమ్ ఎక్సర్‌సైజ్ - 2024'

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వేదికగా 'మలబార్ మేరీటైమ్ ఎక్సర్‌సైజ్ - 2024' బుధవారం ప్రారంభం కానుంది. ఈ సైనిక విన్యాసాల్లో పాల్గొనేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా నౌకాదళాలకు చెందిన యుద్ధ నౌకలు, విమానాలు నగరానికి చేరుకున్నాయి. ఈ నెల 8న మొదలై 18వ తేదీ వరకూ జరిగే ఈ విన్యాసాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశ హార్బర్‌లో, మలి దశ సముద్రంలో నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనే నాలుగు దేశాలు సముద్ర సంబంధిత వ్యవహారాల్లో పరస్పరం సహకరించుకోవడం, సాంకేతిక అంశాలు ఇచ్చిపుచ్చుకోవడం, కలిసి కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేస్తాయి. ప్రత్యేక ఆపరేషన్లు, ఉపరితలం, గాలిలో, సబ్‌మెరైన్లపై దాడులు వంటి అంశాలపై నిపుణుల అనుభవాలను పంచుకునే లక్ష్యంతో ఈసారి ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నట్టు నేవీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయా దేశాల నుంచి మిస్సైల్ డెస్ట్రాయర్లు, మల్టీపర్పస్ ఫ్రిగేట్లు, సబ్‌మెరైన్లు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు విచ్చేశాయి. తొలిరోజైన బుధవారం ఆయా దేశాల ప్రతినిధుల సమావేశం, గురువారం ఆయా దేశాల యుద్ధ నౌకల సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 9 అక్టోబరు 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్ధిపేట్-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. దీని ద్వారా బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలోని నాన్ రూరల్, రూరల్, నాన్ ఫార్మర్స్, ఫార్మర్స్ కోటా సీట్లు భర్తీ చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆగస్టు 28 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో
డిగ్రీ కౌన్సెలింగ్



ప్రోగ్రామ్‌లు-సీట్లు

బీఎస్సీ ఆనర్స్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి. పీజేటీఎస్ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్ అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు; సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు; ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'. పీజేటీఎస్ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీవీఎస్సీ & ఏహెచ్: ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం. పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం. పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బేర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

కౌన్సెలింగ్ వివరాలు

- తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు.
- ఫార్మర్స్ కోటా కింద ప్రవేశం పొందాలంటే అభ్యర్థులు వ్యవసాయ కుటుంబానికి చెందినవారై ఉండాలి. తల్లిదండ్రులకు గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉండాలి. గ్రాండ్‌ఫాదర్/గ్రాండ్‌మదర్/గార్డియన్ పేరు మీద భూమి ఉన్న పక్షంలో ఈ రిజర్వేషన్ వర్తించదు. అభ్యర్థులు కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్

- తెలంగాణ ఈఏపీసెట్ 2024లో 237-5295 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 14న; 5303-8788 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 15న; 8805-12996 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 16న; 1304-17800 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 17న; 17806-22997 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 18న; 23002-29999 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 19న కౌన్సెలింగ్ ఉంటుంది. అన్ని కేటగిరీల అభ్యర్థులకూ ఈ షెడ్యూల్ వర్తిస్తుంది.


ప్రోగ్రామ్ ఫీజు

- పీజేటీఎస్ఏయూ కళాశాలల్లో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ), బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లకు ఒక్కో సెమిస్టర్‌కు రూ.46,550. పీవీఎన్ఆర్‌టీవీయూ కళాశాలల్లో బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.63,260; బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌నకు సెమిస్టర్‌కు రూ.48,130. ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌నకు సెమిస్టర్‌కు రూ.46,710.

ముఖ్య సమాచారం

- **అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీ, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల పత్రాలు, టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్‌లు, అగ్రికల్చరల్ ల్యాండ్ సర్టిఫికెట్‌లు, కులం-ఆదాయం-వైకల్యం ధ్రువీకరణ పత్రాలు.
- **కౌన్సెలింగ్ సెంటర్:** హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్ఏయూ ఆడిటోరియం
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

కాళోజీ అనుబంధ కళాశాలల్లో
ఆయుష్ డిగ్రీలు



వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)- తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ అనుబంధ కళాశాలల్లో ఆయుష్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ యూజీ 2024 స్కోర్, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు.

నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకు గాను జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 144; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127 మార్కులను కటాఫ్‌గా నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ), ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీయూఎంఎస్ కోర్సులో ప్రవేశానికి పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఉర్దూ/అరబిక్/పర్షియన్ లాంగ్వేజ్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇంటర్ స్థాయిలో జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

పీహెచ్‌డీ



ఐఐఐటీడీఎంజేలో

జబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎంజే)- పీహెచ్‌డీ 2024 వింటర్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, డిజైన్, నేచురల్ సైన్సెస్-ఫిజిక్స్, నేచురల్ సైన్సెస్-మేథమెటిక్స్

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ఎండిజైన్/ఎమ్మెస్సీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్/సీడ్/సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్ స్కోర్ ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/డీఏఈ/డీఎస్‌టీ/డీబీటీ/ఎన్‌బీహెచ్ఎం ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

ఫైనాన్షియల్ సపోర్ట్: ఫుల్ టైం అభ్యర్థులకు ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్‌షిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ప్రాజెక్ట్ వర్క్ కోసం రూ.50,000 చెల్లిస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ వర్క్ ప్రజెంటేషన్ కోసం రూ.50,000 అదే నేషనల్ కాన్ఫరెన్స్‌లలో అయితే రూ.10,000 ఇస్తారు.

ముఖ్యసమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 17
- **రాత పరీక్ష/ఇంటర్వ్యూ కోసం ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 22
- **రాత పరీక్ష/ఇంటర్వ్యూలు:** అక్టోబరు 28
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** నవంబరు 5
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** నవంబరు 11 నుంచి
- **వెబ్‌సైట్:** admission.iiitdmj.ac.in

ఐఐటీ మండీలో

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ మండీ)కి చెందిన స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్(ఎస్‌పీఎస్)- రెగ్యులర్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పరిశోధనాంశాలు: పెరోవ్‌స్కైట్ ఆప్టోఎలక్ట్రానిక్ డివైజెస్, ఎక్స్‌పరిమెంటల్ కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్, ఎక్స్‌పరిమెంటల్ హై ఎనర్జీ ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఎమ్మెస్సీ(ఫిజికల్ సైన్సెస్) ఉత్తీర్ణతతోపాటు గేట్/జెస్ట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి. సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాలలు/ఐఐటీలు/ఐసర్ సంస్థల నుంచి కనీసం 7.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఎస్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వర్కింగ్ ప్రొఫెషనల్స్ అయితే పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 30
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

'LIFE'S GOOD' Scholarship Program

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and postgraduate courses at select colleges/institutes across India.

Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh. Selections are made on a first-come, first-served basis.

Prizes & Rewards: For UG students - 50% of tuition fees or up to INR 1 lakh (whichever is lesser)
- For PG students - 50% of tuition fees or up to INR 2 lakh (whichever is lesser)
- For meritorious candidates with zero tuition fees and a family income of less than INR 8 lakh:
- UG students will receive INR 50,000
- PG students will receive INR 1 lakh

Last Date to Apply: 31-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LGIGS2

SCHOLARSHIP ALERT



Louis Dreyfus Agri-Scholars Program

Description: An initiative by Louis Dreyfus Company India Private Limited aimed at providing financial assistance to underprivileged students pursuing undergraduate courses in agriculture.

Eligibility: Open to students in their first or second year of undergraduate courses in agriculture at select institutions. Applicants must have secured at least 60% marks in their Classes 10 and 12, with a combined annual family income of less than INR 8 lakh.

Prizes & Rewards: Up to INR 50,000
Last Date to Apply: 31-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/DASPL1



Colgate Keep India Smiling Scholarship

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

Prizes & Rewards: Scholarship of INR 75,000
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CKISSP3

buddy4study.com

లిటిల్ బజ్


సోమరి సుబ్బయ్య

అనంత వరం అనే ఊరికి కూతవేటు దూరంలో ఒక అడవి ఉంది. ఈ గ్రామ ప్రజలు పళ్లు కాయలు అవసరమైన వంట చెరకు కోసం హాయిగా అడవికి నడిచి పోయి అన్నీ తెచ్చుకునే వారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అడవికి వెళ్లి, అక్కడే చెట్ల నీడలో ఆడుకొని, ఆ చెట్ల తియ్యనిపండ్లను కోసుకుని వచ్చేవారు. ఒక రోజు చందుఅనే పిల్లవాడు రేగు పండ్ల కోసం అడవికి వెళ్లి, కాసేపు పండ్లు కోసుకున్న తర్వాత ఆ ఎండకు తట్టుకోలేక ఆ చెట్టు నీడలో సొమ్మసిల్లిపడి పోయి అలాగే నిద్ర పోయాడు. పక్కనున్న చెట్ల మీద కూర్చున్న కొన్ని కోతులు చందు ఇబ్బంది చూసి సాయం చేయాలి అనుకున్నాయి. ఆ కోతుల్లో పెద్ద కోతులు చెట్ల కొమ్మలను బలంగా ఊపితే, చిన్న కోతులు పండ్లను కోసి, చందు సంచీలో వేసాయి.



మెలకువ వచ్చాక చుట్టూ చూసుకున్న చందూకి, తన చుట్టూ రాలిపడిన చాలాపండ్లు, ఇంకా తన సంచీ నిండా తియ్యని మంచి పండ్లు కనిపించాయి, చెట్టు కొమ్మలమీద చూస్తే, కనిపించిన కోతులను చూసి అవే తనకు సాయం చేసి ఉంటాయని గ్రహించాడు చందు. సంతోషంగా ఆ పండ్ల సంచీని తీసుకుని ఇంటికి వెళ్లి, జరిగినదంతా ఇంట్లో వారితో చెప్పాడు. అందరూ అది విని ఆశ్చర్య పోతే, చందు మేనమామ సుబ్బయ్య మాత్రం తాను కూడా అడవికి వెళ్లి అలాగే పండ్లు సంపాదించాలి అని పథకం వేసుకున్నాడు, ఆ మర్నాడు సుబ్బయ్య మధ్యాహ్నం పూట ఎండగా ఉన్నపుడు అడవికి బయలుదేరి, ఆ చెట్టు దగ్గరికి వెళ్లి, సంచీ పక్కన పడేసి,ఆ నీడలో పడి నిద్రపోయాడు కోతులు వచ్చితనకు సాయం చేస్తాయో లేదో అని నిద్ర నటిస్తూ, గమనిస్తూ ఉన్నాడు. కాసేపటికి, చెట్టుకింద ఎవరో పడుకొని ఉన్న విషయం గమనించిన కోతులు సుబ్బయ్య దగ్గరికి వచ్చి చూసి, అతను నిద్ర నటిస్తున్న విషయం అర్థం చేసుకునొ పండ్లు కోసి సాయం చేయడం మానేసి, అతని మీద దూకి, తమ గోర్లతో రక్కి గాయ పరిచాయి. ఆ గాయాలతో ఇంటికి వెళ్లిన సుబ్బయ్య 'అనవసరంగా దురాశ కి పోయి సోమరితనంతో శ్రమ లేకుండా పండ్లు సంపాదించాలని పోయి, గాయాల పాలయ్యాను కదా' అని విచారించాడు.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



ఏవి ఎన్ని?



డైలీ సుడోకు - 430

3		9						5
			3				1	6
		8		9	4			
			4	6				
1	9						4	7
				5	7			
			5	7		2		
6	2				3			
8						3		1

సుడోకు - 429 సమాధానం

5	2	6	9	1	3	7	4	8
9	1	7	8	6	4	5	3	2
3	4	8	2	5	7	9	6	1
4	9	3	6	7	8	2	1	5
1	8	5	4	2	9	3	7	6
6	7	2	1	3	5	8	9	4
2	3	4	7	8	1	6	5	9
8	5	1	3	9	6	4	2	7
7	6	9	5	4	2	1	8	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.